మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

NAMASTE TELANGANA

www.ntnews.com /ntdailyonline

సోమవారం MONDAY 2.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4

సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 89 ‖ వెల (Price) రూ.6.50

సోమవారం, సూర్యోదయం: 6-02, సూర్యాస్తమయం: 6-29. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం తిథి: అమావాస్య పూర్తి. నక్షత్రం: మఖ రాత్రి 12-21 వరకు. వర్జ్యం: ఉదయం 11-05 నుంచి పగలు 12-51 వరకు. రాహుకాలం: ఉదయం 7-36 నుంచి ఉదయం 9-09 వరకు. దుర్ముహూర్తం: పగలు 12-40 నుంచి పగలు 1-29 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 1-09 నుంచి పగలు 3-58 వరకు. అమృతకాలం: రాత్రి 9-40 నుంచి రాత్రి 11-27 వరకు.



సూర్యాపేట జిల్లా అర్వపల్లి కేజీబీవీ నుంచి విద్యార్థులను బయటికి తీసుకొస్తున్న అధికారులు



మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలంలో ఓ వృద్ధురాలిని తరలిస్తున్న దృశ్యం



వరద నీటిలోచిక్కుకుపోయిన ఖమ్మం ప్రధాన రహదారి, పలు కాలనీలు

జన జీవనంపై..

జలఖడ్గం

రికార్డు వర్షాలతో అల్లకల్లోలం

విరుచుకుపడిన వాన.. ముంచెత్తిన వరద.. రాష్ట్రమంతా అతలాకుతలం

జల విలయంతో ఖమ్మం విలవిల.. సహాయ చర్యల్లో సర్కారు తాత్సారం



మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్





ఖమ్మంలో ఆదివారం రాస్తారోకో చేస్తున్న వరదముంపు బాధితులు.. సాయంత్రం పరామర్శకు వచ్చిన తుమ్మలను నిలదీస్తున్న ప్రజలు

- జల దిగ్బంధంలో పల్లెలు, కాలనీలు.. ఇండ్లలోకి నీళ్లు
- చెరువులకు గండ్లు.. నీటమునిగిన పంట పొలాలు
- మున్నేరు మహోగ్రరూపం.. ముంపులో పరీవాహకం
- ఆకేరు వరద ఉధృతికి నీట మునిగిన రాకాసితండా
- ప్రభుత్వం హైఅలర్ట్.. కలెక్టరేట్లలో కంట్రోల్ రూములు
- సహాయ చర్యలపై సమీక్షించిన ముఖ్యమంత్రి రేవంత్
- రాష్ట్రంలో వరద నష్టంపై ఫోన్ చేసిన ప్రధాని మోదీ
- మరో 24 గంటలు భారీ వర్షాలు.. రెడ్ అలర్ట్ జారీ

నేడు విద్యాసంస్థలకు సెలవు

భారీ వర్షాలకు రాష్ట్రం అతలాకుతలమైంది. జనజీవనం అస్తవ్యస్తమైంది. వాగులు, చెరువులు పొంగిపొర్లడంతో ఊర్లు, కాలనీలు నీటమునిగాయి. రోడ్లు కోతకు గురవగా, రైల్వే ట్రాకులు కొట్టుకుపోయాయి.

రాష్ట్రమంతా వర్ష బీభత్సం నెలకొనగా.. ఖమ్మం జిల్లా మాత్రం జలవిలయంతో విలవిలలాడింది. ఇండ్లపైకి ఎక్కి ప్రజలు సహాయం కోసం అర్థించడం కనిపించింది. 2,500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు ప్రభుత్వం చెప్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో సహాయ చర్యల తీవ్రత అంతగా కనిపించలేదు. సర్కారు వైఫల్యంపై పలుచోట్ల ప్రజలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. › 2

సీఎం డౌన్ డౌన్.. తుమ్మల గోబ్యాక్

- సర్కారు వైఫల్యంపై రోడ్డెక్కిన వరద బాధితులు
- నాడు గంటలోపే కేసీఆర్ హెలికాప్టర్ పంపిండు
- జిల్లాలో ముగ్గురు మంత్రులున్నరు.. ఏమైంది?
- ఉదయం నుంచి నీళ్లల్లో ఉన్నా పట్టించుకోరా?
- మంత్రులు రాజీనామా చేయాలి: ఖమ్మంవాసులు
- పరామర్శకు వచ్చిన మంత్రి తుమ్మల ఘెరావ్

ఖమ్మంలో పలుచోట్ల వరద బాధితుల ధర్నాలు

ఖమ్మం, సెప్టెంబర్ 1: 'సీఎం డౌన్‌డౌన్.. రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి.. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు వెంటనే వారి పదవులకు రాజీనామాలు చేయాలి.. తుమ్మల నాగేశ్వరరావు ఎక్కడున్నా వెంటనే ఇక్కడికి రావాలి.. పొంగులేటీ.. అన్నా-అక్కా అంటూ తిరగావు కదా ఇప్పుడు ఎక్కడున్నవ్? వెంటనే ఇక్కడికి రావాలి' అంటూ ఖమ్మం నగర ప్రజలు ఆందోళన చేపట్టారు. ఆదివారం ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్ వద్ద స్థానికులు, వరద › 3వ పేజీలో



తండ్రి మోతీలాల్‌తో అశ్విని

వరదలో కొట్టుకుపోయిన తండ్రీ కూతురు

- యువ శాస్త్రవేత్త అశ్విని మృతదేహం లభ్యం
- భారీ వర్షాలకు 13 మందికి పైగా దుర్మరణం
- ఇంకా ఆచూకీ దొరకని మరో 10 మంది
- వేలాది మూగజీవాలు మృత్యువాత › 3

వరదల సమయంలో ప్రభుత్వం విఫలం



- ఖమ్మంలో దారుణమైన పరిస్థితులు
- ప్రజలు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నరు
- ముగ్గురు మంత్రులున్నా దండగ!
- సహాయచర్యల తీరుపై కేటీఆర్ ఫైర్ › 2

25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

- మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి
- గాయపడిన వారికి 5 లక్షలు ఇవ్వాలి: హరీశ్
- వర్షాలపై సోయిలేదు.. ఢిల్లీకి చక్కర్లా?: సత్యవతి



దుబాయ్ బాధితులకు మరో అవకాశం

- వీసా క్రమబద్ధీకరణకు చాన్స్
- ఫైన్ లేకుండా దేశం విడిచి వెళ్లొచ్చు
- యూఏఈ ప్రభుత్వం ప్రకటన › 10

కేరళ కాంగ్రెస్‌లో క్యాస్టింగ్ కౌచ్!

- అధిష్ఠానంతో 'సన్నిహితం'గా ఉన్న వారికే పదవులు
- లేకపోతే వేధింపులు.. సీనియర్ మహిళా నేత తీవ్ర ఆరోపణలు
- పార్టీ నుంచి బహిష్కరణ › 10

అధిష్ఠానానిది ఓ దారి

ఢిల్లీ మాట.. రివర్స్ బాట

అనుములది మరో దారి

కాంగ్రెస్ విధానాలకు భిన్నంగా ముఖ్యమంత్రి రేవంత్ అడుగులు

- పార్టీ వైఖరికి భిన్నంగా సొంత నిర్ణయాలు
- అదానీతో ఒప్పందాల నుంచి బుల్డోజర్ రాజకీయం వరకు కొరుకుడుపడని చేష్టలు
- మద్యం పాలసీ కేసు కరెక్టే అన్నట్టు వ్యాఖ్యలు
- రేవంత్ తీరుపై కాంగ్రెస్ అధిష్ఠానం అసహనం
- అందుకే సీఎంతో మంత్రుల దూరం దూరం

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ జాతీయ పాలసీలకు వ్యతిరేకంగా నడుచుకుంటున్నారని అధిష్ఠానం ఆగ్రహంగా ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. అందుకే ఆయనకు ఢిల్లీ నుంచి అండదండలు అందడం లేదని సమాచారం. ఇందుకు అనేక ఉదాహరణలు కూడా ఉన్నాయి. అదానీతో చెట్టాపట్టాల్, ఢిల్లీ మద్యం విధానంపై కేంద్ర నాయకత్వానికి భిన్నమైన వ్యాఖ్యలు, సుప్రీంకోర్టుపై అనుచిత › 7వ పేజీలో

• అదానీతో ఒప్పందాలు


ఒకవైపు జాతీయస్థాయిలో అదానీపై పార్టీ యుద్ధం చేస్తుంటే కాంగ్రెస్ సీఎం అయ్యుండి రేవంత్ ఒప్పందాలు చేసుకోవడం ఢిల్లీకి మింగుపడడం లేదు

• బడేభాయ్‌తో సఖ్యత!

ప్రత్యర్థి మోదీని 'బడేభాయ్' అని పిలవడంతోపాటు అవసరానికి మించి సఖ్యత నెరపడం కూడా అధిష్ఠానాన్ని అసహనానికి గురిచేస్తున్నది.

• న్యాయవ్యవస్థపై వ్యాఖ్యలు..

న్యాయవ్యవస్థ నిర్ణయాలను రాజకీయంతో ముడిపెట్టి రేవంత్ తరుచూ చేస్తున్న వ్యాఖ్యలు కాంగ్రెస్ అధిష్ఠానానికి చిర్రెత్తిస్తున్నాయి.



• బుల్డోజర్ రాజకీయం


ఒకవైపు బుల్డోజర్‌రాజ్‌ను కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వమంతా తప్పుపడుతుంటే.. హైడ్రా పేరిట ఇక్కడ బుల్డోజర్‌ను సీఎం నడుపుతున్నారు.


• మద్యం కేసు

మద్యం కేసు తప్పని కాంగ్రెస్ చెప్తున్నది. ఈ విషయంలో కేజ్రీవాల్‌కు అండగా నిలబడుతున్నది, అదే కేసు ఒప్పన్నట్టుగా, కవితదే తప్పన్నట్టుగా రేవంత్ ఆరోపణలు చేస్తున్నారు.

ఎత్తిపోతలు ఎత్తిపోవుడే?

- నిధులు విడుదల చేయని సర్కారు.. పూర్తికాని లిఫ్ట్ స్కీమ్‌ల ఒప్పందాలు
- పంప్‌హౌజ్‌లు నడపలేమంటున్న కాంట్రాక్టర్లు.. తలలు పట్టుకుంటున్న అధికారులు
- జీతాల కోసం రోడ్డెక్కుతున్న కార్మికులు .. రూ.40 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు › 4





27 వేల మంది టెకీలపై వేటు

ఈ ఏడాది ఇదే అత్యధికం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1: సాంకేతిక రంగంలో ఉద్యోగాల కోతలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 44 కంపెనీలు ఆగస్టులో 27,065 మంది ఉద్యోగులను తొలగించాయి. జూలై నెలలో జరిగిన 9,051 ఉద్యోగాల తొలగింపుతో పోలిస్తే ఇది చాలా ఎక్కువని లేఆఫ్స్.ఎఫ్‌వైఐ పేర్కొంది. సుమారుగా 15 వేల మంది ఉద్యోగుల(15 శాతం సిబ్బంది) తొలగింపునకు ప్రణాళికలు రూపొందించామని టెక్ దిగ్గజం ఇంటెల్ కంపెనీ ఆగస్టు 1న ప్రకటించింది. ఈ ఏడాది రెండో విడత కోతల్లో భాగంగా సుమారు 5,900 మంది ఉద్యోగులను (7 శాతం సిబ్బంది) తొలగిస్తున్నట్టు సిస్కో సిస్టమ్స్ తెలిపింది. జర్మనీ చిప్ మేకర్ సంస్థ ఇన్ఫినియన్ 1400 సిబ్బందిని, ఐబీఎమ్ వెయ్యి మందిని, కెనడియన్ ఆన్‌లైన్ ఫుడ్ సర్వీస్ స్కిప్ ది డిషెసెస్ 800 మందిని తొలగిస్తున్నట్టు ప్రకటించాయి. సవాళ్లతో కూడిన ఆర్థిక పరిస్థితులను ఎదుర్కోవడానికి ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా కంపెనీలు ఉద్యోగాల్లో కోతలు విధిస్తున్నాయి.

స్థానిక ఎన్నికలు ఇప్పట్లో లేనట్టే!

- వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలో ఎన్నికలు?
- రైతుభరోసా ఇచ్చాకే ఎన్నికలకు వెళ్లే యోచన
- లేదంటే రైతుల ఆగ్రహం తప్పదని భయం
- క్షేత్రస్థాయి నుంచి ప్రతికూలంగా నివేదికలు

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో లేనట్టేనని అధికార పార్టీ వర్గాలు చెప్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రస్తుతం రైతులు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ఈ సమయంలో ఎన్నికలకు వెళ్తే అంతే సంగతులని, రుణమాఫీ, రైతుభరోసా నిధులు జమ చేశాకే ఎన్నికలకు వెళ్లాలని పార్టీ సీనియర్లు, పలువురు ఎమ్మెల్యేలు సీఎంకు సూచించినట్టు తెలిసింది. వాస్తవంగా రైతు రుణమాఫీ మీద కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఆశలు, నమ్మకం పెట్టుకున్నది. దీనికి విపరీతమైన ప్రచారం చేయడంతోపాటు సంబరాలు కూడా నిర్వహించారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం సీన్ రివర్స్ అయింది. అరకొర రుణమాఫీపై రైతులు ఎక్కడికక్కడ కాంగ్రెస్ నేతలను, అధికారులను నిలదీస్తున్నారు. నిరసనలు తెలుపుతున్నారు. ఒకే దఫాలో రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి 40 శాతం రైతులకు మాత్రమే మాఫీ చేశారని, మిగిలిన 60 శాతం మంది రైతుల › 7వ పేజీలో

42% కోటా ఇవ్వాల్సిందే

- ప్రభుత్వం బీసీ కులగణనను తక్షణమే చేపట్టాలి
- అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలి › 7
- బీసీ నేత, రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య డిమాండ్
- ఆమరణ దీక్ష చేస్తున్న బీసీ నేతలకు పరామర్శ



ఆదివారం సూర్యాపేట జిల్లా మఠంపల్లి సమీపంలో తెగిన బీటీ రోడ్డు



సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో వరదనీటిలో చిక్కుకున్న విద్యార్థినులను జేసీబీ సాయంతో సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న సిబ్బంది



నాగర్‌కర్నూల్‌లోని నాగనూల్ వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడుతున్న పోలీసులు

మొగులుకు చిల్లు

పోటెత్తిన వరద.. ఉప్పొంగిన వాగులు, చెరువులు

- చెరువులకు గండ్లు.. నీట మునిగిన పంటలు
- వరదధాటికి కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్‌లు.. ఎక్కడి రైళ్లక్కడే
- తాడ్వాయిలో 200 ఎకరాల అడవి ధ్వంసం
- శ్రీశైలం హైవేపై రాకపోకలు బంద్
- నడిగూడెంలో సాగర్ ఎడమ కాల్వకు, పిల్లలమర్రిలో మూసీ కాల్వకు గండి
- మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో అత్యధికంగా 45.65 సెం.మీ వర్షపాతం
- 2006 తర్వాత సెప్టెంబర్‌లో అత్యధిక వర్షపాతం



హుజూర్‌నగర్ పట్టణంలో మఠంపల్లి రోడ్డులో నీట వరద నీటిలో చిక్కుకున్న లారీ


హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): మొగులుకు చిల్లు పడింది. సెప్టెంబర్‌లో ఎన్నడూ లేనంతగా రికార్డు వాన దంచికొట్టింది. ఎడతెరపిలేని భారీ వర్షాలతో తెలుగు రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయి. అత్యంత భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వాయుగుండం ప్రభావంతో పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఒక్కరోజే 30 సెం.మీపైగా వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో 45.65 సెం.మీ, చిన్నగూడూరులో 45.16 సెం.మీ, నర్సింహులపేటలో 40.58, నెల్లికుదురులో 38.35 సెం.మీ, దంతాలపల్లిలో 35.09 సెం.మీ, మరిపెడలో 34.42 సెం.మీ, సూర్యాపేట జిల్లా మద్దిరాలలో 34.13 సెం.మీ, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో 33.02 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్‌లో సాధారణ వర్షపాతం 16.28 సెం.మీగా వాతావరణ శాఖ గుర్తించింది. 2006 సెప్టెంబర్ 19న కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో 44.06 సెం.మీ వర్షపాతం నమోదైంది. 18 సంవత్సరాల తర్వాత 2024 సెప్టెంబర్ 1న మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో 45.65 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. భారీవర్షాలతో వరద ఉప్పొంగుతున్నది. ప్రాజెక్టులు, చెరువులు, వాగులు, వంకలు నీటితో కళకళలాడుతున్నాయి. చెరువులు అలుగు పారి గండ్లు పడుతున్నాయి. వేలాది ఎకరాల్లో పంట నష్టం సంభవించింది. పల్లెలు, లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఇండ్లలోకి చేరిన నీళ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో గాలివాన బీభత్సానికి సుమారు 200 ఎకరాల్లో అడవి ధ్వంసమైంది. భారీ వృక్షాలు రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. వాజేడు మండలం చీకుపల్లి అటవీప్రాంతంలోని తెలంగాణ నయాగార బొగత ఉధృతంగా జాలువారుతున్నది. దీంతో అటవీశాఖ అధికారులు సందర్శనను నిలిపివేశారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల ఆలయం ఎదుట మంజీరానది వనదుర్గా ప్రాజెక్టు మత్తడి దుంకడంతో అధికారులు ఆలయాన్ని మూసివేశారు. నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు దేవస్థానంపైకి ఘాట్ రోడ్డులో వాహనాల రాకపోకలను నిషేధించారు.

సాగర్, మూసీ కాల్వలకు గండ్లు

వరద పోటెత్తడంతో కోదాడ నియోజకవర్గ పరిధిలోని నడిగూడెం సమీపంలో నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు గండి పడింది. దాంతో రామచంద్రాపురం గ్రామంలోకి నీళ్లు చేరడంతో జలదిగ్బంధంలో చిక్కుకుంది. పంటలు నీటమునిగాయి. ఇక సూర్యాపేట మండలం పిల్లలమర్రి సమీపంలో మూసీ ఎడమ కాల్వకు గండి పడింది. దీంతో పంట పొలాలు నీట మునిగాయి. మూసీ అధికారులు వెంటనే ఇసుక బస్తాలు వేసి గండిని పూడ్చారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో ఎన్‌ఎస్పీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన గండిని పూడ్చే ప్రక్రియను ప్రారంభించారు.

రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు బంద్

తెలంగాణ- ఏపీ సరిహద్దు రామాపురం వద్ద చిమిర్యాల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రెండు రాష్ట్రాల మధ్య వాహనాల రాకపోకలు నిలిచాయి. సాధారణంగా వాయుగుండం తీరం దాటిన ప్రాంతాల్లో ఉత్తర, దక్షిణ తీరాలలో తీవ్రత ఎక్కువగా ఉండి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రావణి వెల్లడించారు. వాయుగుండం తీరం దాటిన తర్వాత బలహీన పడుతుందని, అనంతరం వర్షాలు తగ్గుముఖం పడతాయని ఆమె తెలిపారు.



వరదల సమయంలో ప్రభుత్వం విఫలం

- ఖమ్మంలో పరిస్థితి దారుణంగా ఉన్నది
- అక్కడ ముగ్గురు మంత్రులున్నా దండుగ
- ప్రజలు వీధుల్లోకొచ్చి ఆందోళన చేస్తున్నరు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్
- సహాయక చర్యల్లో పాల్గొన్నవారికి ధన్యవాదాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : వరదల సమయంలో అప్రమత్తంగా ఉండి పరిస్థితిని అదుపుచేయాల్సిన ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఖమ్మంలో పరిస్థితి మరింత దారుణంగా ఉన్నదని, ఆ జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ప్రజలకు ఏ మాత్రం ఉపయోగం లేదని ఆదివారం ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో విసిగిపోయిన ప్రజలు ఖమ్మం త్రీ టౌన్ ప్రాంతంలో వీధుల్లోకొచ్చి నిరసనకు దిగారని చెప్పారు. వరదలతో ఇబ్బందులు పడుతూ కనీస సాయం కోసం ప్రజలు ఇలా ఆందోళన చేయడమంటే ప్రభుత్వం ఎంత ఉదాసీన వైఖరితో ఉన్నదో అర్థం చేసుకోవచ్చునన్నారు.

స్పందించినవారికి అభినందనలు

భారీ వరదలు, వర్షాల సందర్భంలో సహాయ చర్యలు, పునరుద్ధరణ పనులపై చురుగ్గా స్పందించిన బీఆర్‌ఎస్ నాయకులు, పోలీసులు, విద్యుత్తు సిబ్బందిని కేటీఆర్ అభినందించారు. మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ సామల హేమ, నార్నే శ్రీనివాసరావుకు ధన్యవాదాలు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా నాగనూల్ వాగులో ఓ వ్యక్తి కొట్టుకుపోతుండగా కాపాడిన ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లను అభినందించారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సామాన్యుడిని కాపాడారని వారి ధైర్యసాహసాలకు ఎక్స్ వేదికగా కొనియాడారు. తీవ్ర ప్రతికూల వాతావరణం ఉన్నా విద్యుత్తు పునరుద్ధరణ కోసం సిబ్బంది అద్భుత పనితీరు కనబరుస్తున్నారని కేటీఆర్ అభినందించారు. ఎన్పీడీసీఎల్ ఉద్యోగి కరెంటు పోల్ ఎక్కి విద్యుత్తు పునరుద్ధరణ పనులు చేస్తున్న వీడియో చూసి అతడిని అభినందించారు.వరదల్లో చిక్కుకొని ఇబ్బందులు పడుతున్న అవసరార్థులకు సాయం చేయాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

24 గంటలు బీ అలర్ట్

- అధికారులు సెలవులు పెట్టొద్దు
- మంత్రులతో సీఎం సమీక్ష
- అధికారులతో టెలి కాన్ఫరెన్స్
- సచివాలయం కంట్రోల్ రూమ్ నంబర్ 040-23454088
- నేడు విద్యాసంస్థలకు సెలవు.. పరీక్షలు వాయిదా
- రాష్ట్రంలోని వరదపరిస్థితులపై కేంద్రం ఆరా .. సీఎంకు ప్రధాని, హోంమంత్రి ఫోన్
- రాష్ట్రానికి అదనంగా 9 ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు



సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలో సాగర్ ఎడమ కాల్వకు పడిన గండి

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సహాయ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎవరూ సెలవులు పెట్టొద్దని, సెలవులు పెట్టిన వారు వెంటనే రద్దు చేసుకొని విధుల్లో నిమగ్నం కావాలని అధికారులకు సూచించారు. భారీ వర్షాలపై సీనియర్ మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు తదితరులతో ఫోన్లో సీఎం రివ్యూ చేశారు. అనంతరం సీఎస్, డీజీపీ, మున్సిపల్, విద్యుత్తు, పంచాయతీ రాజ్, హైడ్రా, ఇరిగేషన్‌శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల్లో కలెక్టర్లు, ఎస్పీలు, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. అత్యవసర విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో అంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని సీఎంవోకు పంపాలని ఆదేశించారు. భారీ వర్షాలతో వచ్చిన వరద నీటిని వృథా చేయకుండా భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకోవాలని ఆదేశించారు. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా లిఫ్ట్‌చేసి రిజర్వాయర్లు నింపాలని ఆదేశించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్థానికంగా ఉంటూ సహాయక కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. 24 గంటలు అలర్ట్‌గా ఉంటూ సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కాంగ్రెస్ కార్యకర్తలను రేవంత్‌రెడ్డి కోరారు.

వరద నష్టంపై ప్రధాని ఆరా

సీఎం రేవంత్‌రెడ్డికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం రాత్రి ఫోన్ చేసి వరద నష్టంపై ఆరా తీశారు. ఖమ్మం జిల్లాలో ఎక్కువ నష్టం సంభవించిందని తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సేవలు అందించే హెలికాప్టర్లను పంపిస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం తరపున అవసరమైన సాయం అందిస్తామమని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు.అంతకు ముందు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కూడా సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి వరద పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

గోదావరి తీరం వెంబడి అప్రమత్తం

ఖమ్మం నుంచి ఆదిలాబాద్ వరకు గోదావరి నది తీరం వెంబడి అధికారులు 24/7 అప్రమత్తంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి కలెక్టర్లు, రాష్ట్ర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సచివాలయం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్‌రెడ్డి, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, మున్సిపల్, వైద్య ఆరోగ్య, నీటి పారుదల, రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, జీహెచ్‌ఎంసీ, జలమండలి, ట్రాన్స్‌కో తదితరశాఖల అధికారులు కూడా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఖమ్మం జిల్లాలో శనివారం అర్ధరాత్రి నుంచి పరిస్థితిని స్వయంగా తాను పర్యవేక్షిస్తున్నానని చెప్పారు. జంట నగరాల్లో వరదల వల్ల ఏర్పడే విపత్తును ఎదుర్కోవడానికి హైడ్రాను సన్నద్ధం చేశామని వెల్లడించారు.

సచివాలయం కంట్రోల్ రూమ్ నంబర్ 040- 23454088

అంతరాయంలేని విద్యుత్తు అందించండి

భారీ వర్షాల నేపథ్యంలో వినియోగదారులకు అంతరాయం తలెత్తకుండా విద్యుత్తునందించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదివారం మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి టీజీఎస్పీడీసీఎల్ సంస్థ ఎస్‌ఈలు, డీఈలతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నీట మునిగిన సబ్‌స్టేషన్ల వివరాలు తెలుసుకుని, విద్యుత్తు పునరుద్ధరణకు కలెక్టర్లు, పోలీసు, రెవెన్యూశాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. తమ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

45 పునరావాస కేంద్రాలు : పొంగులేటి

రాష్ట్రంలో 45 పునరావాస కేంద్రాలను తెరచి, 2,500 మందికిపైగా తరలించామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 85 చెరువులు, కుంటలు, కాలువలకు గండ్లు పడ్డాయని ప్రాథమిక సమాచారం అందిందని చెప్పారు. వరద తీవ్రత అధికంగా ప్రాంతాలకు ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలతోపాటు సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. తన నియోజకవర్గమైన పాలేరులోని కూసుమంచి మండలం నాయకన్‌గూడెంకు చెందిన ఇటుకలపని చేసుకొనే యాకూబ్, ఆయన భార్య సైదాబీ వరదల్లో కొట్టుకోపోవడంపై మంత్రి శ్రీనివాసరెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. అన్ని ఉన్నా కూడా వాతావరణం అనుకూలించక వారిని రక్షించుకోలేకపోయానని ఆవేదన వ్యక్తంచేశారు.

అదనంగా 9 ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు

భారీ వర్షాల నేపథ్యంలో అదనంగా తొమ్మిది ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు రాష్ట్రానికి రానున్నాయి. చెన్నై, వైజాగ్, అసోం నుంచి మూడు చొప్పున మొత్తం 9 ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను తెలంగాణకు పంపాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆదివారం కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ రాష్ట్రంలో కురుస్తున్న కుంభవృష్టి వానలు, వరదల తీవ్రతను అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లడంతో తెలంగాణకు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను పంపిస్తున్నట్టు చెప్పారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలకు ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు తప్పనిసరిగా సెలవులివ్వాలని ప్రభుత్వం స్పష్టంచేసింది. ఓయూతో పాటు మహాత్మాగాంధీ వర్సిటీ, తెలంగాణ వర్సిటీ, జేఎన్టీయూ సోమవారం జరగాల్సిన పరీక్షలను అధికారులు వాయిదావేశారు. మంగళవారం వర్షాలు తగ్గకపోతే, వాతావరణ పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకోనున్నారు.



దేవరకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, గాదరి కిశోర్ కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పార్టీనేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

పార్టీలను పక్కనబెట్టి ఆదుకుందాం

- అనుకోని విపత్తుతో రాష్ట్రం అల్లకల్లోలం
- అనేకమంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరం
- ప్రభుత్వం ముందు చూపుతో వ్యవహరించాలి
- ప్రభావిత ప్రాంతాల్లో ముమ్మర చర్యలు చేపట్టాలి
- మృతుల కుటుంబాలకు 25 లక్షలు, గాయపడ్డవారికి 5 లక్షలు అందించాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి
- ప్రజలకు తోడుండాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ)/ సిద్దిపేట/చందంపేట (దేవరకొండ) : అనుకోని విపత్తు రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేసిందని, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున అవసరమైన ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, వర్షాల సందర్భంలో ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించాలని చెప్పారు. వర్షాలు, వరదల కారణంగా ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భారీ వర్షాలు, ప్రజల కష్టనష్టాలపై స్పందిస్తూ ఆదివారం ప్రకటన విడుదల చేయడంతో పాటు నల్లగొండ జిల్లా దేవరకొండలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌తో కలిసి హరీశ్ విలేకరులతో మాట్లాడారు. కొందరు తమ కుటుంబ సభ్యులను కోల్పోయి ఆవేదన చెందుతుంటే, మరికొందరు నిరాశ్రయులై రోడ్డుమీద పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంకొందరు పాడి పంటలు కోల్పోతే, మరికొందరు ఉపాధి కోల్పోయి కన్నీరు పెడుతున్నారని చెప్పారు. ఇలాంటి ఆపత్కాలంలో ఒకరికొకరు బాసటగా నిలవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆపదలోఉన్న ప్రజలకు విశ్వాసం కలిగించేలా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు. మరో రెండు మూడు రోజులు భారీ వర్షాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని, రాష్ట్ర, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని, ప్రజలను అప్రమత్తం చేయాలని, ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులను అలర్ట్‌గా ఉంచాలని, అత్యవసర వైద్యసేవలకు అంతరాయం కలగకుండా చూడాలని, ఏజెన్సీ, ముంపు ప్రాంతాల్లో గర్భిణులను దవాఖానలకు తరలించాలని, పాముకాటు, కరెంట్ షాక్‌లకు గురైన వారికి తక్షణ వైద్యసేవలు అందేలా చూడాలని, ముంపు ప్రాంతాల ప్రజలను కాపాడేందుకు కేంద్రం సాయం కోరాలని, ఎన్‌డీఆర్‌ఎఫ్‌ను రంగంలోకి దింపాలని, హెలీకాప్టర్లను సైతం సిద్ధం చేసుకోవాలని సూచించారు. వరద బాధితుల కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఆహారం, తాగునీరు అందించాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని, ప్రభావిత ప్రాంతాలను ముందే గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. తాత్కాలిక ఉపశమనం కోసం లక్ష ఆర్థిక సాయం చేయడంతో పాటు విపత్తులో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడ్డ వారికి రూ.5 లక్షల ఆర్థికసాయం ఇవ్వాలని ప్రభుత్వానికి హరీశ్ విజ్ఞప్తి చేశారు. సహాయక చర్యల కోసం ఖమ్మంలో ఆందోళన చేస్తున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అన్ని జిల్లాల నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు చేపట్టాలని, కష్టకాలంలో ప్రజలకు తోడుగా నిలవాలని పిలుపునిచ్చారు. విలేకరులతో సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, గాదరి కిశోర్‌కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

మీది మీదే! మాది మాదే!!





సాహిత్యంలో 'తెలుగు' పేరుతో 'ఆంధ్రా' ఆధిపత్యం ఇకపై చెల్లదు!

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం కోసమే కాదు, భాషా, సాహిత్యరంగాల్లో ఆంధ్రాధిపత్యం, వివక్షకు వ్యతిరేకంగా కూడా జరిగింది. సంస్కృతి పరిరక్షణ కోసం, అన్నిరంగాల్లో హక్కుగా దక్కాల్సిన న్యాయమైన వాటా కోసం ఈ పోరాటం సాగింది.

60 ఏండ్ల పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సాకారమైంది. అయినా ఇప్పటికీ 'తెలుగు భాష', 'తెలుగుదనం', 'తెలుగు సంస్కృతి', 'ఉమ్మడి వారసత్వం' ఇలా పలు పేర్లతో ఆంధ్రాధిపత్యం, పెత్తనం, దాష్టీకం, వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కేంద్ర సాహిత్య అకాడమీ కమిటీల నియామకాల్లోనూ, నిర్వహణలోనూ, తెలుగులో రాసే సాహిత్యకారులకు ఇచ్చే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుల్లోనూ, ఆంధ్రా సాహిత్యకారులు 'తెలుగు' పేరిట వెలువరించే సంకలనాల్లోనూ, నిర్వహించే రైటర్స్ మీట్‌లు, లిటరరీ ఫెస్టివల్స్, సంస్థల సభలు, కళాశాలల సదస్సులు, సమావేశాల్లోనూ, కొన్ని ప్రచురణా సంస్థలు ముద్రించే పుస్తకాల విషయంలోనూ ఈ వివక్ష ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది.

తెలుగు పత్రికల్లోని సాహిత్యపేజీల్లో అచ్చయ్యే కవిత్వం, విమర్శ, పరామర్శ, పరిచయాలు, సమీక్షలు అన్నీ కూడా ఒక ప్రాంతానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి మరొక ప్రాంతానికి కనీస ప్రాతినిధ్యాన్ని నిరాకరిస్తున్నాయి. ఒక పద్ధతి ప్రకారం తెలంగాణవారిని, వారి ప్రతిభను ద్వితీయ శ్రేణిదిగా నిర్ధారిస్తున్నారు.

తెలంగాణ ఉద్యమంలో ఆత్మగౌరవ నినాదం ప్రధానమైంది. 90 ఏండ్ల కింద 'తెలంగాణలో కవులు పూజ్యం' అని విమర్శ వస్తే, 'తెలంగాణలో కవులు పూజ్యం కాదు. పూజనీయులు' అని సురవరం ప్రతాపరెడ్డి 'గోలకొండ కవుల సంచి క'ను 369 కవులతో వెలువరించారు. ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ తెలంగాణ ఉద్యమ సందర్భంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలవారు ఇబ్బడిముబ్బడిగా సాహితీ సృజన చేసింద్రు. లెక్కకు మించి సంకలనాలు వెలువరించింద్రు. ప్రపంచంలో మరే ఉద్యమంలో రానన్ని పాటలు, కవితలు, విమర్శలు, వ్యాసాలు, చారిత్రక వ్యాసాలు ఈ ఉద్యమ సందర్భంగా వచ్చాయి. అయినా ఆంధ్రాధిపత్యం తమ వివక్షాపూరిత దృష్టితో ఈ సాహిత్యానికి విలువ కట్టడానికి నిరాకరించింది.

అయితే మొన్నటి జూన్ 2 (2024) వరకు అధికారికంగా హైదరాబాద్ నగరం ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా ఉండింది. దానివల్ల తెలంగాణవాదులు తమ హక్కులను గట్టిగా చాటిచెప్పడానికి కొంత ప్రతిబంధకాలుండేవి. అదే సమయంలో ఆంధ్రాధిపత్యం, లాబీయింగ్ విస్తరించింది. ఈ ఆధిపత్యం నిత్యం రెండింతలవుతున్నందుకే మరోసారి నీళ్లు, నిధులు, నియామకాల మాదిరిగానే 'సాహిత్యం'లోనూ సమానమైన వాటా దక్కాలని నినదిస్తున్నాం. ఇప్పుడు హైదరాబాద్ కేవలం తెలంగాణ ప్రజల ఆస్తి. ఇక్కడ జరిగే ప్రతి ప్రభుత్వ సాహిత్య కార్యక్రమాల్లో పూర్తిగా తెలంగాణవారికే ప్రాతినిధ్యం ఉండాలి. ఆంధ్రా ప్రాంతంలో ఎక్కడ సభలు నిర్వహించినా కేవలం ఆ ప్రాంతం వారినే కేంద్ర సాహిత్య అకాడమీ అతిథులుగా, వక్తలుగా అవకాశం కల్పిస్తున్నది. హైదరాబాద్‌లో సభలు జరిపినా అదే ఆంధ్రావారినే ప్రధానంగా ఆహ్వానిస్తున్నారు. దీనివల్ల అక్కడా, ఇక్కడా.. రెండు ప్రాంతాల్లోనూ ఆంధ్రావారి పెత్తనమే సాగుతున్నది.

> **కేంద్ర సాహిత్య అకాడమీ ఇచ్చే అవార్డుల్లోనూ ఇదే వివక్ష కొనసాగుతున్నది. 2014 నుంచి 2023 వరకు మొత్తం 11 మందికి తెలుగులో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు ప్రకటిస్తే అందులో నిఖిలేశ్వర్, గోరటి వెంకన్న మాత్రమే తెలంగాణవాళ్లు. మిగతా 9 మంది ఆంధ్రా, రాయలసీమవాళ్లే. అంటే తెలుగు పేరిట తెలంగాణవారిని ఎలాంటి దగా చేస్తున్నారో అర్థమవుతున్నది.**

'కవి సంధి'లో కూడా ఇలాంటి వివక్షే జరుగుతున్నది. అకాడమీ నిర్వహించే అన్ని సభలు ఇట్లాగే మిగులుతున్నాయి. అవార్డుల గురించి గట్టిగా నిలదీస్తే ఇది 'తెలుగు' సాహిత్యంలో ప్రతిభ చూపించేవారికి ఇస్తారని చెప్తున్నారు. పరోక్షంగా తెలంగాణలో అవార్డుకు యోగ్యులైన సాహితీవేత్తలు లేరని తేల్చిచెప్తున్నారు.

'తెలుగు కథలు', 'కవిత్వం', 'యువ కథకులు' (విమర్శ) పేరిట ఆంధ్రా సాహిత్యానికి పెద్దపీట వేస్తున్నారు. తద్వారా తెలంగాణలో సాహిత్యం లేదని సంకేతిస్తున్నారు. వాళ్ల సంకలనాలు వాళ్లిష్టమొచ్చినట్లు వేసుకోవచ్చు, అభ్యంతరమేమీ లేదు. కాకపోతే ఆ సాహిత్యాన్ని 'తెలుగు' పేరిట కాకుండా 'ఆంధ్రా' పేరుతో వేసుకున్నట్టయితే సంతోషం. అట్లా కాకుండా ఏ ఒక్కరో, ఇద్దరో తెలంగాణవారికి ప్రాతినిధ్యం కల్పించి అది మొత్తం తెలుగువారి ప్రాతినిధ్య సంకలనం, సభ, ఫెస్టివల్, అవార్డు అంటే ఇకముందు చెల్లదు. మేము ఈ నిర్ణయం తీసుకోవడానికి గత పదేండ్ల అనుభవాలు నేర్పిన గుణపాఠాలే కారణం. కుట్రలు, మోసాలు, అన్యాయాలను ఎన్నో ఎదుర్కొన్నాం. ఆంధ్రా ప్రాంతానికి చెందిన సాహితీ లబ్ధప్రతిష్టులు ఒక పథకం ప్రకారం తమ వారికి మాత్రమే ప్రాతినిధ్యం కల్పిస్తున్నారు. అది సంకలనాల కూర్పులో కావొచ్చు, విమర్శ పేరిట వెలువరించే వ్యాస సంపుటాలు కావొచ్చు, అవార్డులు కావొచ్చు, సభలు, సదస్సులు, లిటరరీ మీట్స్, ఫెస్టివల్స్ కావొచ్చు, ప్రచురణలు కావచ్చు. వీటిలో వేటిలోనూ తెలంగాణవారికి న్యాయమైన ప్రాతినిధ్యం లేకుండా, అసలు తెలంగాణలో సాహితీవేత్తలే లేరనే అభిప్రాయం పాదులూనుకునేలా వ్యవహరిస్తున్నారు. అందుకే ఈ ధిక్కారం.

మీది ఆంధ్రా సాహిత్యం. మీరు ఆంధ్రా సాహిత్య చరిత్ర నిర్మించుకుంటున్నారు. సంతోషం. మీ సాహిత్యం క్యారెక్టర్ వేరు, నేచర్ వేరు, ఫంక్షన్ వేరు, బిహేవియర్ వేరు, లక్ష్యం వేరు. కాబట్టి, మీరు వేరు, మేం వేరు. మా సాహిత్యం మాది. మా ఆత్మగౌరవం మాది. ఇప్పటికే చాలాసార్లు చెప్పాం. అయినా, మేం ఇలాగే చేస్తామంటూ సిగ్గు విడిచి అవే పనులు పదేపదే చేస్తున్నారు. కాబట్టి, మీ కథలు, కవిత్వాన్ని 'ఆంధ్రా' పేరిట అచ్చేసుకుంటే మాకేం అభ్యంతరం ఉండదు. ఇదొక్కటే ఆంధ్రాధిపత్యాన్ని నిలువరించగలదని విశ్వసిస్తున్నాం. రాష్ట్రాలు విడిపోయిన పదేండ్ల తర్వాత ఒక విస్పష్ట ప్రకటన చేస్తున్నాం. ఎందులోనైనా ఆంధ్రా రిప్రజెంటేషన్, తెలంగాణ రిప్రజెంటేషన్ విడిగా ఉండాలి. కాబట్టి ప్రభుత్వాలకు, సంస్థలకు, కేంద్ర సాహిత్య అకాడమీ వారికి చెప్పేదేమంటే తెలుగు అనే భాషా ప్రాతిపదికన కాకుండా రాష్ట్రాల ప్రాతిపదికన రిప్రజెంటేషన్ ఇవ్వండి. తెలుగు సాహిత్యం అనే చర్చ పెట్టినా.. తెలంగాణ సాహిత్యం, ఆంధ్రా సాహిత్యం వేరుగా పెట్టవలసిందే. ఎందుకంటే అవి వేర్వేరు కాబట్టి. తెలంగాణకు ప్రత్యేకంగా ఆహ్వానం ఉండాల్సిందే.

అట్లాగే కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు కన్వీనర్లు ఒకసారి ఆంధ్రావారుంటే, మరోసారి తెలంగాణవారుండాలి. రొటేషన్ పద్ధతిలో మారాలి. అంతేకాకుండా అవార్డులు సైతం ఒక సంవత్సరం తెలంగాణవారికిస్తే, మరుసటి సంవత్సరం ఆంధ్రా/ రాయలసీమ వారికివ్వాలి.

> **కేంద్ర ప్రభుత్వం తెలుగు వారందరికీ కలిపి ఏర్పాటుచేసిన 'ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం' కార్యక్రమాల్లో తెలంగాణ ప్రాతినిధ్యం నామమాత్రంగా ఉంటున్నది. తగిన ప్రాతినిధ్యం ఉండాలి. అసలు తెలంగాణ సాహిత్య ప్రాచీనత వల్లే తెలుగుకు ప్రాచీన హోదా లభించిందన్న విషయం గుర్తుంచుకోవాలి.**

తెలంగాణలో ఉన్న వాగ్గేయకారులు, చిందు, డక్కలి, బైండ్ల తదితర కళలు వేరు. గొప్పవైన ఈ కళారూపాలను కూడా సాహిత్యంలో భాగంగా చూడాలి. ఆ కళల్లోనే బతుకుతున్న ఆ ఫోక్ ఆర్టిస్టులను గుర్తించి వారిని గౌరవించుకోవడం, వారికి డయాస్ ఇవ్వడం, అతిథులుగా పిలవడం ఆంధ్రావారి వల్ల కాదు. అది తెలంగాణవారు మాత్రమే చేసుకోగలరు. కాబట్టి 'తెలుగు' పేరిట మొత్తంగా కొనసాగుతున్న ఆంధ్రాధిపత్యానికి ఇక తెరదించాల్సిందే! ఇప్పటి నుంచి మా ప్రాతినిధ్యాన్ని లాక్కుంటే సహించేది లేదు. 'ఇక మీది మీదే! మాది మాదే!!' ఇక మీ సభలు, మీ కార్యక్రమాలు కావాలంటే ఆంధ్రాలో చేసుకోండి. ఇక చాలు మీరు చేసిన నిర్వాకం. మా సాహిత్యం మేం ప్రచురించుకుంటాం. మా సభలు మేం చేసుకుంటాం. ఇక చాలని తేల్చిచెప్తున్నాం.

సోదరభావం ఉంటే గింటే మా రచయితలను మీరు, మీ రచయితలను మేం అతిథులుగా పిలుచుకుందాం. దానికెవరూ అడ్డు చెప్పరు. ఈ వివక్షలకు, ఆధిపత్య పోకడలకు వ్యతిరేకంగా నిరసనలు జరిగే దాకా లాగవద్దని కోరుతున్నాం.

– డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, వర్థుల శివకుమార్, డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, దేశపతి శ్రీనివాస్, జూలూరి గౌరీశంకర్, అఫ్సర్, అన్నవరం దేవేందర్, డాక్టర్ జిలుకర శ్రీనివాస్, స్కైబాబ, డాక్టర్ పసునూరి రవీందర్, డాక్టర్ నాళేశ్వరం శంకరం, పెద్దింటి అశోక్‌కుమార్, డాక్టర్ ఉదారి నారాయణ, ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి, అన్వర్, దాసోజు లలిత, గుడిపల్లి నిరంజన్, కుంజ కళ్యాణి, బిల్లా మహేందర్, పొట్లపల్లి శ్రీనివాసరావు, వనపట్ల సుబ్బయ్య, నరేష్కుమార్ సూఫీ, తైదల అంజయ్య, గాజోజు నాగభూషణం, కూకట్ల తిరుపతి, డాక్టర్ పొన్నాల బాలయ్య, బూర్ల వెంకటేశ్వర్లు, విలాసాగరం రవీందర్, కందుకూరి శ్రీరాములు, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, వేముగంటి మురళి, దాసోజు కృష్ణమాచారి, ఘనపురం దేవేందర్, రేడియం, కాంచనపల్లి గోవర్ధన్ రాజు, పెనుగొండ బసవేశ్వర్, డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, ఎదిరెపల్లి కాశన్న, అవనిశ్రీ, నాగవరం బాల్‌రాం, బైరెడ్డి కృష్ణారెడ్డి, అంబటి వెంకన్న, డాక్టర్ గాదె వెంకటేష్, డాక్టర్ కటుకోజ్వల రమేష్, రూపా రుక్మిణి, తోకల రాజేశం, బోల యాదయ్య, మొత్కూరు శ్రీనివాస్, గోవింద్ గోవర్ధన్, విఠలాపురం పుష్పలత, పెరుమాండ్ల రాము, డాక్టర్ వెల్దండి శ్రీధర్, శ్రీశైల్‌రెడ్డి పంజుగుల, తండు కృష్ణ కౌండిన్య, పరిమళ్, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, వి.శంకర్, దాస్యం సేనాపతి, తూర్పు మల్లారెడ్డి, రాజు దుర్గాని, జి.ఎన్.స్వామి, మద్దెర్ల రమేష్, గంద్ర లక్ష్మణరావు, కె.వీరయ్య.



పాత అంగీ...

"Old is gold" అన్న పాత సామెతను
నిజం చేస్తూ ఈ పాత అంగీ
ఇంతకాలం వదలకుండా నన్నంటిపెట్టుకునే వున్నది
తాను వదలకుండా వున్నదా,
నేను వదలకుండా వున్నానా? అదొక పెద్ద ప్రశ్న?
కాలేజీ రోజుల్లోనే మా మధ్య అల్లుకున్న బంధం
చదువు పూర్తయి ఉద్యోగం దొరికినా,
పెళ్లయి పిల్లల తండ్రినయ్యాక కూడా
వదలక నా ఒంటిని అంటిపెట్టుకునే వుంది!
సంవత్సరాలు దాటినా ఒక్క చిరుగు లేదని,
కాంతి తగ్గ లేదని నా వాదన
సమయాన్ని బట్టి పొట్టిగా, పొడవుగా మారుతుంది
నాలాగే ఒదిగి వుండే గుణం
'ఇంకెంతకాలం వుంచుకుంటావ్,
వదిలెయ్యి దాన్ని' అని ఇంటావిడ
మందలించినపుడో, అరచినపుడో,
విసుగుతో చిరాకు పడుతున్నపుడో నాకనాలనిపిస్తుంది
'నీకంటే ముందే దీన్ని కట్టుకున్నాను, దీన్ని వదిలేస్తే,
తరువాత నీ వంతు వస్తుందేమోనని భయం' అన్నాను.
అర్థం కాని చూపులతో నన్నొక పాత అంగీలా తీసి పారేస్తుంది
ఐనా కొక్కానికి పాత అంగీ,
మంచానికి నేను అతుక్కుపోయే వుంటాము!
ఇద్దరిదీ ఒకే మాట, ఒకే బాటలా అవసరానికి ఒక్కటవుతాం
అడవులు తిరిగినా, కొండలు,
గుట్టలెక్కినా పాత అంగీ నా తోడుగానే ఉండాలి
నా వొంటి మీదున్నంత సేపు ఎంతో ధైర్యం.
అడవిలో ముళ్లపొదల నుంచి,
నగరంలో ధూళి, మురికి నుంచి కాపాడే రక్షణ కవచం అది...




డాక్టర్ రూప్‌కుమార్ డబ్బీకార్
91778 57389

నా మాట జ్ఞాపకాల మూట

"A Story Should have a beginning, middle and an end, but not necessarily in that order" అని Jean Luc Godard ఒకచోట అన్నాడు. అది ఆత్మకథలకు, జ్ఞాపకాలకు కూడా వర్తిస్తుంది.

డైరీ రాయడం వేరు, జ్ఞాపకాలు రాయడం వేరు. ఎందుకంటే డైరీ ఏ రోజుకారోజు తేదీల వారీగా రాస్తాం. ఆయా సమయాల వారీగా జరిగిన విషయాలను రాస్తూ పోవాలి. అందులో సందర్భాలు, సంఘటనలుంటాయి. వరుసగా క్యాలెండర్ల లాగా రాస్తూ పోవాలి. కానీ, జ్ఞాపకాలు అట్లా కాదు. జ్ఞాపకాలను రాయడం మొదలుపెట్టగానే ఆయా కాలాల నాటి అనుభవాలు, అనుభూతులు జ్ఞాపకాలై మనల్ని ముప్పిరిగొంటాయి, మేమున్నామంటూ మన ముందు వాలతాయి. నేనంటే నేనని మనల్ని చుట్టేసుకుంటాయి. తేదీల వారీగా కాదు కాని తన్నుకొస్తున్న జ్ఞాపకాలు నేనంటే నేనేనని మన లోపలి నుంచి తోసుకొస్తాయి. అప్పుడు వాటిని మనం స్థిరంగా ఒక చోట నిలబడి సంయమనంతో రాయాల్సి ఉంటుంది. అక్కడ ఉద్వేగం, ఉద్రేకం కూడదు. అట్లా రాసినప్పుడే ఆ జ్ఞాపకాలు సజీవంగా ఉండి సాధికారికతను సంతరించుకుంటాయి.

నిజానికి జ్ఞాపకాల్లో 'కాలం' ఒకింత సంక్లిష్టమైన పాత్రను పోషిస్తుంది. అది ముందుకు, వెనక్కూ సాగుతుంది. అంతేకాదు, అప్పుడప్పుడు గుండ్రంగా కూడా తిరుగుతుంది. అంతేకాదు, ఆ 'కాలం' పొరలు పొరలుగా మన ముందు ఆవిష్కృతమవుతుంది. అట్లా ఆయా కాలాల్లో సాగిన మన జీవన ప్రవాహంలో అనేక గెలుపులు, ఓటములు, అభినందనలు, అవమానాలూ అన్నీ ఎదురవుతాయి. వాటి ప్రభావాలూ స్పష్టంగా కళ్లముందు కదలాడతాయి. కొన్ని మనలను సంబురపెడతాయి, మరికొన్ని కొండకచో బాధపెడతాయి. జ్ఞాపకాలు రాసేటప్పుడు వాటన్నింటినీ నిర్ద్వంద్వంగా నిష్పక్షపాతంగా రాయాలి. ఎప్పుడైనా ఆబ్జెక్టివ్‌గా రాయడం వల్లనే ఆ జ్ఞాపకాలకు, ఆ రచనకు సాధికారికత ఏర్పడుతుంది.



జ్ఞాపకాలు, ఆత్మకథలు ఎప్పుడైతే భేషజాలు లేకుండా నిజాయితీగా శ్వేతపత్రాలుగా రాస్తామో అవి గొప్ప ప్రేరణనిస్తాయి, ఆనందాన్నిస్తాయి. ఆ విశ్వాసంతోనే నేను నా ఈ 'యాదోంకీ బారాత్' (జ్ఞాపకాల ఊరేగింపు)ని రాయడం మొదలుపెట్టాను.

***

'లోపల జ్ఞాపకాల జాతర/ నేనేమో వర్తమాన జెండా పట్టుకుని ముందు నడుస్తున్నా' అనుకుంటూ రాయడం మొదలుపెట్టాను. తేదీల వారీగా రాయడం కాదు కానీ, మొత్తమ్మీద ఏదో ఒక క్రమంలో రాయాలనుకున్నాను. ఎప్పటికప్పుడు నన్ను నేను సమన్వయించుకుంటూ, పుటం బెట్టుకుంటూ రాయడం మొదలుపెట్టాను.

మూడేండ్ల కిందట మా కరీంనగర్ ఇంట్లో నేను జరిపిన పాత పుస్తకాల తవ్వకాల్లో బయటపడ్డ ఒక చిన్న ఫొటో అప్పుడు ఓ నాలుగు జ్ఞాపకాలను రాసేందుకు కారణమైంది. చారిత్రకంగా రికార్డ్ చేయాల్సిన విషయమనిపించి ఈ జ్ఞాపకాలను రాసి పంచుకున్నాను. అది చదివిన నా సహచరి ఇందిర 'జ్ఞాపకాలు చాలా బాగున్నాయి... అప్పటి అన్ని విషయాలను రాయకూడదా' అంది. అంతే కాదు, ఒకరకంగా ఒత్తిడి తెచ్చింది. చిన్నప్పటి నుంచీ అన్ని విషయాలను రాస్తే అది ఆత్మకథ అవుతుంది, మనం ఆత్మకథ రాసేంత పెద్దవాళ్లం కాదులే అన్నాను. కానీ, తను ఊరుకోలేదు. 'అన్ని వివరాలను రాయండి... చదివేవాళ్లు చదువుతారు... ఏముంది' అన్నది తను. ఇంకేముంది నాలో కూడా రాయాలనే కోరిక పెరిగింది. ఎప్పుడో ఇంటర్‌లో ఉన్నప్పుడు చూసిన హిందీ సినిమా పేరు 'యాదోంకీ బారాత్' గుర్తొచ్చింది. ఆ పేరు మీదే వారం వారం రాయడం మొదలుపెట్టాను. సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, నా word press పేజీల్లో రాయడం మొదలుపెట్టాను. 'మిత్రులు బాగుంది, కొనసాగించ'మన్నారు. అది అట్లా సాగుతూ వచ్చింది.

నా ఈ 'యాదోంకీ బారాత్'లో విజయాలే కాదు, నా ఓటములు, నేను ఎదుర్కొన్న అవమానాలు, నాకు జరిగిన నష్టాలూ అన్నీ రాశాను. చీకటి, వెలుతురు అన్నింటినీ చిత్రించాను. మన జీవితంలో ఎన్నెన్ని తీరాలని దాటుతామో, ఎంతెంత దూరం ప్రయాణిస్తామో.. ఎన్నో గుర్తుంటాయి, మరెన్నో మరుపు అరల్లో మిగిలిపోతాయి. దాదాపుగా అన్నింటినీ రాసినప్పుడు దగ్గరి వాళ్లనుంచే రెండు వాదాలు వివాదాలు ఎదురవుతాయి. 'నీకు నేను ఇంత దగ్గరివాడిని కదా నా గురించి చాలా తక్కువ రాశావు' అని ఒకటి, ఇక రెండవది 'కొన్ని విషయాలను రాయాల్సింది కాదు, ఎడిట్ చేస్తే బాగుండేది' అని. ఇవన్నీ ఎట్లా ఉన్నా నేను నా జ్ఞాపకాలను నా శక్తి మేరకు నిజాయితీగా, వాస్తవికంగా రాశాను. నా ఈ 'యాదోంకీ బారాత్' రాస్తున్నంత కాలమూ నాలో నేను నవ్వుకున్నాను, ఏడ్చాను, కాలరెగరేసుకున్నాను, కొన్నిసార్లు తల దించుకున్నాను.

ఇదంతా కేవలం నా గడిచిన జీవితాన్ని గుర్తుచేసుకోవడమే కాదు, అది కచ్చితంగా తిరిగి జీవించడమే. ఇందులో నా జీవితానుభవాలతో పాటు ఆయా కాలాలనాటి రాజకీయ, సామాజిక అంశాలూ, వాతావరణమూ ప్రతిబింబించాయి. తారీఖులు, దస్తావేజులూ కాదు గానీ నా జ్ఞాపకాల నేపథ్యంలో ఇది ఒకరకంగా సాహిత్య, సామాజిక, సాంస్కృతిక చరిత్రే అని అనుకుంటాను.

('యాదోంకి బారాత్' పుస్తకానికి రచయిత రాసుకున్న ముందుమాట నుంచి..)



వారాల ఆనంద్
9440501281




అమ్మ స్పర్శ

మాటలు నేర్చినప్పటి నుంచీ
మాట్లాడుతూనే వున్నాను.
కొంత ధ్వనిగా
మరికొంత ప్రతిధ్వనిగా.
పునరుక్తులు కావవి
ఒక అనంత సంభాషణలో భాగం.

చూడటం తెలిసినప్పటి నుంచీ
చూస్తూనే వున్నాను
ఇష్టమైందే చూసే ఛాన్స్ లేదు
కనిపించినవే చూస్తున్నాను
అవి అపారదృశ్యంలోని కొన్ని శకలాలు.

వాసన తెలిసినప్పటి నుంచీ
ముక్కు లెగరేస్తూనే వున్నాను
పరిమళం కావొచ్చు
మరోటి కావచ్చు
మనిషి వాసన మాత్రం
అలవాటు కాలేదు.

స్పర్శ అమ్మతోనే మొదలైంది
అన్ని ఇంద్రియాలూ
దానిలో మిళితమై వున్నాయి.
మరి మనస్సో!?
అది అర్థమైతే ఇలా వుండను
కవిత్వం అబ్బినందుకే
నాకు కొంత
అమూర్త జీవితం మొదలైంది.



డాక్టర్ ఎన్.గోపి
93910 28496

అమ్మకో లేఖ

> తెల్లారకముందే సూర్యుడ్ని
> నీ కళ్లల్లో వెలిగించుకొని నిద్ర లేస్తావ్!

నువ్వలా పక్కమీది నుంచి లేచి కూర్చొని రాత్రి తలకింద మెత్త లేక చేతినే మెత్తగా పెట్టుకొని పడుకున్నందుకు పాయలుగా విడిపోయిన జుట్టును ముడేసుకొని కొప్పు పెట్టుకుంటుంటే మన ఊరి చెరువులో బుంగపడి నీళ్లు సుడులు తిరుగుతున్నట్టు ఎంత సక్కగుంటదోనే నిన్నట్ల సూస్తే!

> ఇగ సిన్నగా నువ్వు పైటకొంగును సర్దుకొని పొరక్కట్ట చేతుల పట్టుకుంటే ప్రపంచాన్ని శుద్ధిజేసే పారిశుద్ధ్య కార్మికురాలిలెక్కనే నా కండ్లల్ల నువ్వు తిరుగుతవమ్మా!!

ఇగ నువ్వు రోజు పోసే బియ్యపు నీళ్లకు బదులుగా దాసరిద్దమ్మమ్మోల్ల బర్ల కొట్టం నుండి నీ రెండు చేతులతో పెండను తీసుకొచ్చి నీళ్లల్లో కలిపి నువ్వు అలుకేస్తావుంటే ఆయుర్వేదాన్నీ నీ చేతుల్లోని లోటతో ఈ ప్రపంచం ముందు సల్లి గత్తర రాకుండా చేసే డాక్టర్ లెక్కనే కనిపిస్తవమ్మా!!

> నువ్వు అలుకేసినంక వాకిలి మొత్తం
> చిలుకల గుంపు కూసున్నట్టే ఉంటదే అమ్మా!
> ఆ అలుకేసిన పెండ భూమిని కౌగిలించుకున్న
> ఘడియేందో తెల్వదు కానీ ఒక కమ్మని వాసన
> మన గుమ్మం
> దగ్గర్నుండీ గూడెమంత వస్తది!!

ఇగ అలుకేసినంక అందంగా సుద్దతో పెట్టే ముగ్గంటే నాకు చాలా నచ్చుతదమ్మా!
నువ్వు చేతితో సుద్దపట్టి ముగ్గేస్తా వుంటే మట్టిపలక మీద పెద బాలశిక్షలో అఆలను దిద్దుతున్న పసిపాప లెక్కనే నాకగుపిస్తవమ్మా!

> మన పందిరి పక్కన ఉన్న పులిసేరు చెట్ల పొదల్లో నుంచి ఊరపిచ్చుకలు వాటి ఊపిరితో సప్పుళ్లను చేస్తూ సూర్యుడికి రమ్మని ఆహ్వానం పంపుతాయి!

ఇగ నువ్వు పొయ్యి దగ్గరికి పోయి రాత్రి కాలిన కట్టెలకొచ్చిన బూడిదిని తీసి మన పెంటగడ్డల పారబోసొచ్చి ఈ రోజు బువ్వకూరలొండుదానికి మన మట్టిపొయ్యిని ఎంతో అందంగా ముస్తాబు చేస్తావ్!

> నువ్వా మట్టిపొయ్యిని ఎర్రమన్నుతో గుడ్డపెట్టి అలుకుతావుంటే పురాతన కట్టడాలకు రంగులద్దుతున్న పెయింటర్ లెక్కనే అగుపిస్తవమ్మ నాకు!

ఇగ నువ్వు పాలచెంబు పట్టుకొని కత్తులెంకమ్మింటికి పోయి పది రూపాల పాలు పట్టుకొచ్చి చాయ్ చేసి చిన్నగ్లాసుల నిండా చాయ్ పెద్ద గ్లాసుల నిండా నీళ్లు పట్టుకొచ్చి ప్రేమతో నాకిచ్చి నువ్వొక గ్లాసుల చాయ్ తెచ్చుకొని మన గనవ దగ్గర మెట్ల మీద నువ్వు నేనూ కూసోని చాయ్ తాగుతూ నువ్వు నాకు చెప్పే నీ ముచ్చట్లు నువ్వు పెట్టిచ్చిన చాయ్ లెక్కనే ఎంతో కమ్మగుంటయమ్మా!!

> ఇప్పుడు నా దగ్గర నువ్వు లేవు
> ఇప్పుడు నీ దగ్గర నేనూ లేను!

నా దగ్గర నువ్వుంటే నీ కడుపు మీద చెయ్యేసుకొని నీ మీద కాళ్లేసుకొని పడుకునేటోడ్నమ్మా!!



కంబాలపల్లి (మనోజ్ మాతంగి)
79957 72473

గులేర్

ఓనగాయ
యాదికున్నద
గులేరు దెబ్బకు
టప టప రాలేయి

చింతకాయలు రాలేయి
చింతలు రాలలే...

చిన్నప్పుడు
గులేరు అతారె
పతారె పుట్టించేది
ఉత్తుత్తి భయమూ...

గులేరు
సూటి తప్పలే..
అసలు సూటి తెల్వకే
తిప్పలు..

చిన్న మైకులు
పెద్ద మైకులు
మొదలైతానై...

భూ సారం ఆకలి కేకలు సూటి
గొంతు గులేర్ల
మాటలు నింపుండ్రి..!!



డాక్టర్ సదానంద్ శారద
98497 97459





ఆదివారం కురిసిన భారీ వర్షానికి సూర్యాపేట జిల్లా కోదాడలో కొట్టుకుపోయిన కార్లు



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కుర్మిశెట్టి కాలనీలో ఇంటిలోకి చేరిన వర్షపునీరు



హుజూర్‌నగర్ పట్టణంలో మఠంపల్లి రోడ్డులో నీట వరద నీటిలో చిక్కుకున్న లారీ



వరదల్లో జనం.. సచివాలయానికి రాని సీఎం

- మంత్రులకు ఆదేశాలతో సరి

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలతో ప్రజలు అతలాకుతలం అవుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యక్ష కార్యాచరణలో నిమగ్నం కాకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు మూడు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఉత్తర తెలంగాణ అతలాకుతలమైంది. ఒక్క ఖమ్మంలోనే ఐదుగురు మృత్యువాత పడ్డారు. గోదావరి వరద ఉధృతితో పోటెత్తుతున్నది. మున్నేరు ఉప్పొంగి ప్రవహిస్తున్నది. వరద సహాయక చర్యల్లో ఎటువంటి లోటు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల, పంచాయతీరాజ్, హైడ్రా అధికారులకు సీఎం ఆదేశాలు ఇచ్చారు. భారీ వరదలు సంభవించినపుడు సీఎం సచివాలయం నుంచి పర్యవేక్షణ చేస్తే పరిస్థితులు మెరుగుపడవనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. పొద్దున లేస్తే ప్రజాపాలన అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు వరదల్లో ఉంటే ప్రజల వద్దకు రాదా? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ప్రజలు తమకు తాముగా ఆదుకోవాలని సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడితేనో, ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తేనో ప్రభుత్వం సహాయక చర్యలు తీసుకుంటున్నది కానీ నేరుగా తనకు తానే కార్యక్షేత్రంలోకి దిగేందుకు అంత చొరవ ఎందుకు అంత ఆసక్తి చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఎం నేరుగా కార్యక్షేత్రంలోకి దిగితే ప్రజాపాలనలో ప్రజలకు మరింత ధైర్యం ఉండేదని చెప్తున్నారు.

ఎల్లంపల్లి ఎత్తిపోతలు చేపట్టండి

- సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్టులూ నింపాలి
- ఇరిగేషన్ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్1 (నమస్తే తెలంగాణ): ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వరదనీటిని రోజుకు ఒక టీఎంసీ చొప్పున ఎత్తిపోయాలని సీఎం రేవంత్‌రెడ్డి సాగునీటిపారుదలశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా లిఫ్ట్ చేసి రిజర్వాయర్లు నింపాలని పేర్కొన్నారు. మిడ్‌మానేరు, లోయర్ మానేరు, రంగనాయక్ సాగర్, మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్ జలాశయాల వరకు ఏకధాటిగా నీటిని లిఫ్ట్ చేయాలని సూచించారు. సింగూర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల వరకు నీటిని తరలించాలని తెలిపారు. మల్లన్నసాగర్‌లో గరిష్ఠంగా 20 టీఎంసీలు, కొండపోచమ్మ సాగర్‌లో 10 టీఎంసీల నీటిని నిల్వ చేయాలని పేర్కొన్నారు.

ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో ఉండాలి: మంత్రి ఉత్తమ్



భారీ వర్షాల నేపథ్యంలో ఏఈల నుంచి సీఈల దాకా క్షేత్రస్థాయిలోనే ఉండి వరద ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. తెలంగాణలో రెడ్ అలర్ట్ నేపథ్యంలో నీటిపారుదల శాఖ సిబ్బందికి సెలవులు రద్దు చేసినట్టు తెలిపారు. ఆ శాఖ ఉన్నతాధికారులతో ఆదివారం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గండ్లు పడిన చోట యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. సూర్యాపేట జిల్లాలో కోదాడ, హుజుర్‌నగర్ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో తాను సోమవారం పర్యటించనున్నట్టు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

677 మందిని రక్షించిన అగ్నిమాపక శాఖ

- అత్యవసరమైతే 101కి కాల్ చేయండి: ఏడీజీ నాగిరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఎడతెరపిలేని వర్షాల కారణంగా వరదల్లో చిక్కుకున్న 677 మందిని అగ్నిమాపకశాఖ సిబ్బంది కాపాడి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు ఆ శాఖ అడిషనల్ డీజీ వై నాగిరెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడలోని షిరిడీసాయి నగర్‌కు చెందిన 450 మందిని, ములుగు జిల్లాలోని కొండాయి గ్రామంలో మరో 150 మందిని సురక్షితంగా బోట్ల ద్వారా కాపాడినట్టు తెలిపారు. ఖమ్మం జిల్లా వైరాలోని ఇందిరమ్మకాలనీలో మరో 50 మందిని, వంగవీడులో ఐదుగురిని సూర్యాపేట జిల్లా కోదాడ సమీప గ్రామాల్లో 14 మందిని, , ఖమ్మం అర్బన్‌లో ఇద్దరు, కామారెడ్డిలో ఒకరు, మహబూబ్‌నగర్‌లో ఐదుగురు, వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఐలందలో నలుగురు, మహబూబాబాద్ జిల్లా బీచురాజుపల్లిలో 9 మందిని అగ్నిమాపక శాఖ సిబ్బంది రక్షించినట్టు ఏడీజీ నాగిరెడ్డి తెలిపారు. అత్యవసరమైతే వెంటనే 101కి కాల్ చేయాలని సూచించారు.

ఎత్తిపోతలు నడిచేదెట్లా?

- నిధులు విడుదల చేయని సర్కారు
- పూర్తికాని లిఫ్ట్ స్కీమ్‌ల ఒప్పందాలు
- పంప్‌హౌజ్‌లు నడపలేమంటున్న కాంట్రాక్టర్లు
- జీతాల కోసం రోడ్డెక్కుతున్న కార్మికులు
- రూ.40 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు

వానకాలం సీజన్ ముగిసే దశకు వచ్చింది. రాష్ట్రంలోని ప్రాజెక్టులు, వాగుల్లో వరద ప్రవాహాలు జోరుగా సాగుతున్నాయి. ఇదే సమయంలో పనిచేసే పంప్‌హౌజ్‌లు మాత్రం.. ప్రభుత్వ నిర్లక్ష్యంతో నడిచే పరిస్థితి లేకుండాపోయింది. ఫలితంగా వాటి ఆయకట్టు పరిధిలోని రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

హైదరాబాద్, సెప్టెంబర్1 (నమస్తే తెలంగాణ): సాగునీటి ఎత్తిపోతల పథకాలు ఏడాదిలో 90 నుంచి180 రోజుల వరకు మాత్రమే పనిచేస్తాయి. నీటి వనరుల్లో వరద ప్రవాహం కొనసాగిన సమయంలోనే పంప్‌హౌజ్‌లు పనిచేస్తాయి. 2021లో టెండర్ల ద్వారా ఏజెన్సీలకు పంప్‌హౌజ్‌ల నిర్వహణను ఆనాటి ప్రభుత్వం అప్పగించింది. అందులో కల్వకుర్తి, రాజీవ్‌భీమా పరిధిలో 4 చొప్పున, నెట్టెంపాడులో 3, కోయిల్‌సాగర్, అలీసాగర్, గుత్ప, చౌటుపల్లి హన్మంతరెడ్డి, దేవాదుల్లో ఒక్కోటి చొప్పున పంపింగ్ స్టేషన్ల అగ్రిమెంట్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం కొత్తగా టెండర్లను పిలిచి బాధ్యతలను అప్పగిస్తేనే ఆయా పంపింగ్ స్టేషన్ల నిర్వహణ కొనసాగనున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా దృష్టి సారించలేదు. ఓఅండ్‌ఎం బిల్లులను మంజూరు చేయకపోవడంతో టెండర్లను ఎలా పిలువాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతమున్న ఏజెన్సీలతోనైనా నిర్వహిద్దామని భావిస్తే సంబంధిత కాంట్రాక్టర్లు అందుకు ససేమిరా అంటున్నారు. తొలుత పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, లేదంటే ఓఅండ్‌ఎంను నిర్వహించేది లేదని అధికారులు తేల్చి చెబుతున్నారు. దీంతో ఈ సీజన్‌లో ఆయా పంప్‌హౌజ్‌ల నుంచి నీటిని ఎత్తిపోసేదెట్లా? అని అధికారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఓఅండ్‌ఎం కోసం నిధులను విడుదల చేయాలని మొరపెట్టుకుంటున్నారు.



నిండు కుండలా మారిన ఎల్లంపల్లి ప్రాజెక్టు

-వేతనాల కోసం కార్మికుల ఆందోళన

ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతో ఆయా పంపింగ్ స్టేషన్ల కాంట్రాక్టర్లు తమ సిబ్బందికి 6 నెలలుగా వేతనాలను చెల్లించడంలేదు. దీంతో పంపింగ్‌స్టేషన్లలో పనిచేసే కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడం లేదంటూ గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల కార్మికులు ఇటీవల రోడ్డెక్కారు. నెలల తరబడి వేతనాలను చెల్లించి అప్పుల పాలవుతున్నామని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. పంపింగ్ స్టేషన్ల నిర్వహణ, మరమ్మతులకు సొంతంగా ఖర్చులు పెట్టామని చెప్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, కార్మికులు,కాంట్రాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు.

-పట్టించుకోని ప్రభుత్వం

గతంలో ప్రాజెక్టులు, పంప్‌హౌజ్‌ల నిర్వహణ, పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఇరిగేషన్ శాఖలో ఓఅండ్‌ఎం విభాగాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మరమ్మతులు, అత్యవసర పనులకు ఈఎన్సీల అనుమతి లేకుండానే ఈఈ, డీఈల స్థాయిలోనే నిధులు కేటాయించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఓఅండ్‌ఎంపై దృష్టి సారించలేదు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఓఅండ్‌ఎం కోసం రూ.145 కోట్లను కేటాయించింది. మొదటి త్రైమాసికం ముగిసినా ఇప్పటికీ రూపాయి విడుదల చేయలేదు. ఇటీవల దేవాదుల ఎత్తిపోతల పథకంలోని 15 పంపింగ్ స్టేషన్ల నిర్వహణకు రూ.45 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయినా ఒక్క రూపాయి ఆ శాఖకు విడుదల చేయలేదు. దీంతో ఆ పంపింగ్ స్టేషన్ల నిర్వహణపై ఎలా ముందుకెళ్లాలో తెలియక ఇరిగేషన్ శాఖ అధికారులు తర్జనభర్జనలు పడుతున్నారు.

పెండింగ్ బిల్లుల వివరాలు


లిఫ్ట్ స్కీమ్	పెండింగ్ బిల్లులు (కోట్లల్లో)
అలీసాగర్	రూ.4.37
గుత్ప	రూ.4.84
చౌటుపల్లి హన్మంతరెడ్డి	రూ.1.18
వేంపల్లి	రూ. 1.85
కోయిల్‌సాగర్	రూ.4.08
నెట్టెంపాడు	రూ.4.16
రాజీవ్‌భీమా-1	రూ.3.95
రాజీవ్‌భీమా -2	రూ.3.68
కల్వకుర్తి స్టేజ్ 1	రూ.3.09
కల్వకుర్తి స్టేజ్ 2	రూ.2.84
కల్వకుర్తి స్టేజ్ 3	రూ.1.60

వరద సహాయక చర్యల్లో పోలీస్ శాఖ

- రంగంలోకి జిల్లాల ఎస్పీలు, కమిషనర్లు
- వాగులు, కుంటలు, చెరువులు వద్ద పహారా
- ఎక్స్ వేదికగా పలువురికి డీజీపీ అభినందన

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రాష్ట్ర పోలీసుశాఖ అప్రమత్తమైంది. ప్రభుత్వ ఆదేశాలతో ఎక్కడికక్కడే సహాయక చర్యల్లో నిమగ్నమైంది. పోలీసుస్టేషన్ల పరిధిలో హోంగార్డుల నుంచి సీఐల వరకూ వరద ప్రభావిత జలాశయాల వద్ద పహారా కాస్తున్నారు. జిల్లాల ఎస్పీలు, కమిషనర్లు భద్రతా పరిస్థితిని సమీక్షించి, వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో చొరవ తీసుకుంటున్నారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు స్థానికుల సహకారంతో పోలీసులు ఆహారం, మంచి నీటి వసతి ఏర్పాటు చూశారు. సూర్యాపేట జిల్లా కోదాడలోని శ్రీరంగాపురం వద్ద అర్ధరాత్రి 3 బస్సుల్లో చిక్కుకున్న ప్రయాణికులను పోలీసులు రక్షించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ వ్యక్తి వాగులో కొట్టుకుపోతుండగా హెడ్ కానిస్టేబుల్ రాములు, కానిస్టేబుల్ రాములు ధైర్యంగా వెళ్లి అతన్ని రక్షించారు. జిగిత్యాల జిల్లాలోని మల్యాల-పెగ్డపల్లి రోడ్డుకు అక్కడి పోలీసులు మరమ్మతులు చేశారు. వరంగల్ జిల్లాలో సీపీ అంబర్ కిశోర్‌ఝా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ఐపీఎస్ రోహిత్ రాజు, నల్లగొండ ఎస్పీ శరత్ చంద్రపవార్, ఖమ్మం జిల్లాలో సీపీ సునీల్ దత్, సిద్దిపేట పోలీస్ కమిషనర్ బీ అనురాధ ఆయా జిల్లాల పరిధిలో వరద సహాయక చర్యలను పర్యవేక్షించారు. మహబూబాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో పోలీసుల కృషిని ఎక్స్ వేదికగా డీజీపీ జితేందర్ కొనియాడారు.





కరీంనగర్ శివారులోని ఎల్ఎండీ రిజర్వాయర్‌లో పెరిగిన నీటి మట్టం



కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

ఉప్పొంగుతున్న కృష్ణమ్మ

- శ్రీశైలానికి 4.96 లక్షల క్యూసెక్కులు
- సాగర్‌కు 4,83,766 క్యూసెక్కులు

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ)/న్యూస్‌నెట్‌వర్క్: విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ ఉప్పొంగి ప్రవహిస్తున్నది. ఆదివారం జూరాలకు 3,80,200 క్యూసెక్కులు, శ్రీశైలం ప్రాజెక్టుకు 4.96 లక్షల క్యూసెక్కులు, నాగార్జునసాగర్‌కు 4,83,766 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. గోదావరి బేసిన్‌లోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 60,419 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టుకు 78 వేల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతుండగా, ఎల్లంపల్లికి 1.48 లక్షల ప్రవాహం వస్తున్నది. సింగూర్‌కు 13,076 క్యూసెక్కులు, నిజాంసాగర్‌కు 28,900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. కాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో మొత్తం 25 గేట్లకు గాను 13 గేట్లు పూర్తిగా, 12 గేట్లు రెండు అడుగుల మేర ఎత్తి 40,962 క్యూసెక్కులను, పాల్వంచ మండలంలోని కిన్నెరసాని ప్రాజెక్టుకు చెందిన 12 గేట్లు ఎత్తి లక్షా 4వేల క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేశారు. ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్ ఉగ్రరూపం దాల్చింది. ఈ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా 28 అడుగులకు పైగా నీరు వచ్చి చేరింది. సుమారు 70 వేల క్యూసెక్కుల నీరు అలుగుమీదుగా పోతున్నది. నిర్మల్ జిల్లాలోని గడ్డెనవాగు, ఆదిలాబాద్ జిల్లాలోని మత్తడి వాగు ప్రాజెక్టు జలకళను సంతరించుకోవడంతో గేట్లను ఎత్తి కిందికి నీటిని వదులుతున్నారు.

మత్తడి దుంకిన మానేరు

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు నిండటంతో దిగువకు మత్తడి దుంకుతున్నది. ప్రాజెక్టు సామర్థ్యం 31 అడుగులకు గాను ఆదివారం రాత్రి వరకు పూర్తి స్థాయిలో నిండింది. కామారెడ్డి జిల్లా పాల్వంచ, సిద్దిపేట జిల్లా కూడవెల్లి వాగుల ద్వారా మానేరుకు 32 వేల క్యూసెక్కులకు పైగా భారీగా వరద వస్తున్నది. శ్రీరాజరాజేశ్వర జలాశయానికి సిరిసిల్ల మానేరు, వేములవాడ మూలవాగు నుంచి 33,805 క్యూసెక్కులు, గాయత్రీ పంప్‌హౌస్ నుంచి 6,300 క్యూసెక్కుల చొప్పున మొత్తం 40,105 క్యూసెక్కుల వదర నీరు వస్తున్నట్టు అధికారులు తెలిపారు. కరీంనగర్ జిల్లాలో మోయతుమ్మెద వాగు ఉప్పొంగుతున్నది. భారీగా వరద వస్తున్న నేపథ్యంలో నేడో, రేపో ఎల్ఎండీ నిండే అవకాశం ఉన్నది.

జంట జలాశయాలకు ఉధృతంగా వరద

హైదరాబాద్ శివారులోని జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లోకి ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. ఉస్మాన్‌సాగర్‌కు శంకర్‌పల్లి, నవాబ్‌పేట, ఖానాపూర్ నుంచి వరద వస్తున్నది. ఇన్‌ఫ్లో 6,700 క్యూసెక్కులు ఉన్నది. గరిష్ఠస్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా.. 1782.45 అడుగుల మేర నీరు నిల్వ ఉన్నది. కాగా హిమాయత్ సాగర్‌కు అనంతగిరి మొదలుకొని వికారాబాద్, పరిగి, చేవెళ్ల, మెయినాబాద్ మీదుగా భారీగా వరద వస్తున్నది. 3,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదుకాగా గరిష్ఠ స్థాయి నీటిమట్టం 1763.50 అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 1756.60 అడుగల మేర నీరు నిల్వ ఉన్నది.

భారీ వర్షాలతో ఏపీ అతలాకుతలం

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అతలాకుతలమైంది. 14 నియోజకవర్గాల్లో 20 సెం.మీ. కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. 9 మంది మరణించినట్టు అధికారులు తెలిపారు. ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ముంపు బారిన పడిన 294 గ్రామలకు చెందిన 13,227 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. పోలీస్, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు 600 మందిని రక్షించాయి. బాధితులకు 25 కిలోల బియ్యం, ఒక్కో కిలో చొప్పున నిత్యావసరాలను ఇస్తున్నామని, మత్స్యకారులు, చేనేతలకు అదనంగా 50 కిలోల బియ్యం ఇస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సినీ నటుడు చిరంజీవి కోరారు.




వర్షం ధాటికి నిండా మునిగిన అమరావతి ప్రాంతం

విద్యుత్తు సంస్థలకు తీవ్ర నష్టం

- పలు సబ్‌స్టేషన్లల్లో వరదనీరు, విరిగిన విద్యుత్తు స్తంభాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు విద్యుత్తు పంపిణీ సంస్థలకు తీవ్ర ఆస్తి నష్టం వాటిల్లింది. టీజీ ఎస్పీడీసీఎల్ పరిధిలో నాలుగు సబ్‌స్టేషన్లు నీటమునిగాయి. 419 విద్యుత్తు స్తంభాలు విరిగిపోయాయి. మొత్తంగా 16 సబ్‌స్టేషన్లలో, 75 చోట్ల 33 కేవీ ఫీడర్లు, 37 చోట్ల 11కేవీ ఫీడర్లలో నష్టం వాటిల్లింది. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో 218 విద్యుత్తు స్తంభాలు విరిగిపోయాయి.

- ఖమ్మం దానవాయిగూడెం, మధిర సబ్‌స్టేషన్లలోకి వరదనీరు చేరింది. కామారెడ్డి జిల్లా బీర్కూర్ సబ్‌స్టేషన్ సైతం నీటముగినింది.
- మహబూబాబాద్ జిల్లాలో 33/11 కేవీ తొర్రూరు డివిజన్ ఉల్లేపల్లి సబ్‌స్టేషన్ పూర్తిగా నీటమునిగింది.



- ఖమ్మం సమీపంలోని ధంసలాపురం 33/11 కేవీ సబ్‌స్టేషన్ నీట మునిగింది.
- కామారెడ్డి జిల్లాలో అన్నారం 33 కేవీ ఫీడర్‌లోవిద్యుత్తు స్తంభం నేలకూలింది.
- భూపాలపల్లి జిల్లాలో తాడ్వాయి 33 కేవీ ఫీడర్‌పై చెట్టు విరిగిపడటంతో 16 విద్యుత్తు స్తంభాలు, కండక్టర్‌లు డ్యామేజ్ అయ్యాయి. ములుగు జిల్లా ఏటూరు నాగారం, రామకృష్ణాపూర్‌లో రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయాయి.



హైదరాబాద్‌లో కూలిన కాంగ్రెస్ పార్టీ గాంధీభవన్ గోడ

గ్రేటర్‌లో భారీ వర్షం

- బీహెచ్‌ఈఎల్‌లో అత్యధికంగా 8.53 సెంటీమీటర్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు వాన దంచికొట్టింది. దీంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు బీహెచ్‌ఈఎల్‌లో అత్యధికంగా 8.53 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మలక్‌పేటలో అత్యధికంగా 4.68 సెంటీమీటర్ల వర్షం కురిసిందని టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. గ్రేటర్‌లో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వానలు తగ్గుముఖం పట్టాయి. తీరం దాటిన వాయుగుండం 24 గంటల్లో బలహీనపడి, అల్పపీడనంగా మారే అవకాశం ఉన్నదని, దీని ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్టు అధికారులు వివరించారు. మరోవైపు, ఆదివారం ఉదయం దానకిశోర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, కలెక్టర్ అనుదీప్, ఇతర అధికారులు విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సహాయక చర్యలకు 610 అధికారిక బృందాలు ఫీల్డ్‌లో ఉన్నాయని దానకిశోర్ తెలిపారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకి రావొద్దని సూచించారు.

రాజధానిలో చినుకుపడితే.. చీకటే..

గ్రేటర్ హైదరాబాద్‌లో చినుకుపడితే చీకటే అన్నట్టుగా పరిస్థితి తయారైంది. వానొచ్చినా, వరదొచ్చినా అంధకారం నెలకొంటున్నది. శని, ఆదివారాల్లో చెట్లు, చెట్ల కొమ్మలు విరిగి పడుతుండటంతో పలుచోట్ల విద్యుత్తు లైన్లు చెడిపోయాయి. ఆయా చెట్లను తొలగించేందుకు అర్ధరాత్రి సిబ్బంది శ్రమిస్తున్నారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం సహాయచర్యలకు ఆటంకం కలిగిస్తోంది.

డెంగ్యూతో ముగ్గురి మృతి


సందేశ్ (ఫైల్)


శ్రీలత (ఫైల్)

మల్లాపూర్/ ముత్తారం/కామారెడ్డి రూరల్, సెప్టెంబర్ 1: రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం డెంగ్యూతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం చిట్టాపూర్‌కు చెందిన మైలారపు సందేశ్(25) ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి, నెల రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. డెంగ్యూ పాజిటివ్ రాగా, నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రానికి చెందిన మామిడి శ్రీలత(40) కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నది. శుక్రవారం హన్మకొండలోని ఓ ప్రైవేటు దవాఖానలో చేర్పించగా, డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారించారు. శనివారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందింది. కామారెడ్డి మండలం టేక్రియాల్‌కు చెందిన చౌకి సుజిత్ (16) పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. డెంగ్యూ నిర్ధారణ కావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు.


సన్మానగ్రహీతలతో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, మాజీ ఐఏఎస్ మురళి, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్ తదితరులు

దేశంలో నిజాయితీపరుల సంఖ్య పెరగాలి

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ
- వైపీసీ ఆధ్వర్యంలో నిజాయితీ అధికారులకు సత్కారం

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : దేశంలో నిజాయితీ అధికారులు, ప్రజాప్రతినిధుల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇల్లు, స్కూల్‌లోనే దానికి బీజం పడాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని బేగంపేట హరితప్లాజాలో ఆదివారం యూత్ ఫర్ యాంటీ కరప్షన్(వైపీసీ) సంస్థ ఆధ్వర్యంలో 16 మంది నిజాయితీ అధికారులను సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రాజకీయాల్లో సంస్కరణలతో అవినీతిని నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. ప్రజల ఆలోచనా విధానం మారాలని, ప్రజా ఉద్యమాలను చేపట్టే వ్యక్తులను ప్రోత్సహించాలని సూచించారు. మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి మాట్లాడుతూ.. సమాజంలో అవినీతి జరుగుతుందని ప్రతి ఒక్కరూ అంటుంటారు.. కానీ, కండ్ల ముందు జరుగుతున్న అవినీతిని ప్రశ్నించడానికి మాత్రం ఎవరూ ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వశాఖల్లో నిజాయితీపరులు ఎక్కడున్నారో వెతకడం కష్టమని, చాలామంది తప్పులు చేస్తూనే నిజాయితీగా ఉన్నట్టు నటిస్తారని చెప్పారు. చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్ మాట్లాడుతూ.. మంచి సమాజం ఏర్పడాలంటే మంచి వ్యక్తులు కావాలని, ఆ వ్యక్తులకు గుర్తింపు ఉండాలని, ఆ గుర్తింపు వైపీసీ ఇస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. వైపీసీ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి మాట్లాడుతూ.. తెలుగు రాష్ర్టాల్లో అవినీతిరహితంగా, నిజాయితీగా పనిచేస్తున్న అధికారులను 14ఏండ్లుగా సన్మానిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైపీసీ అవార్డు కమిటీ చైర్మన్ దన్నపనేని అశోక్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బక్కిని నర్సింహులు, డాక్టర్ స్రవంతి, డాక్టర్ స్నిగ్ధ, లక్ష్మీకళ, మీడియా కార్యదర్శి జయరాం, కోమటి రమేశ్‌బాబు, కొన్నె దేవేందర్, జీ హరిప్రకాశ్, వరికుప్పల గంగాధర్, బత్తిని రాజేశ్, చింతల రమేశ్, ఎం విక్రమ్, సీహెచ్ ప్రేమ్, కొక్కుల ప్రశాంత్, సూర రాజేందర్, నాగేంద్ర, నియామత్ బాషా, ఇలియాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా?

- గురుకుల పాఠశాలలను పట్టించుకోరా?
- మాజీ మంత్రులు హరీశ్, జగదీశ్‌రెడ్డి మండిపాటు
- కొండభీమనపల్లి బీసీ బాలుర గురుకులం పరిశీలన
- 13 మందిని ఎలుకలు కొరికిన ఘటనపై ఆరా
- సమస్యలు తెలుసుకొని విద్యార్థులకు పరామర్శ


దేవరకొండ మండలం కొండభీమనపల్లి బీసీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, కమలాకర్, బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భాస్కర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి

దేవరకొండరూరల్, సెప్టెంబర్ 1 : రాష్ట్రంలో గురుకులాల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైనా పట్టించుకోరా? అని మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. విద్యార్థుల ప్రాణాలతో ఎన్నాళ్లు చెలగాటమాడుతారని నిలదీశారు. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండభీమనపల్లి బీసీ బాలుర గురుకుల పాఠశాలలో రెండు రోజుల క్రితం 13 మంది విద్యార్థులను ఎలుకల కరిచిన విషయం తెలిసిందే. దీంతో మాజీ మంత్రి గంగుల కమలాకర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆదివారం వారు గురుకుల పాఠశాలను సందర్శించి ఎలుకలు కొరికిన విద్యార్థులను పరామర్శించారు. గురుకులంలో సమస్యలను తెలుసుకున్నారు. ఫ్యాన్లు పనిచేయక పోవడం వల్ల కిటికీలు తెరిచి పడుకుంటే వాటిలోంచి ఎలుకలు వస్తున్నాయని విద్యార్థులు తెలిపారు. కిటికీలకు దోమ తెరలు లేక నిద్రకూడా సరిగా పోతలేమని వివరించారు. రగ్గులు, ట్రాక్ సూట్లు, కాస్మోటిక్ చార్జీలను ఇంతవరకు ఇవ్వలేదని వాపోయారు. భోజనం ఎలా ఉన్నదని 9వ తరగతి విద్యార్థిని అడుగగా గతంలో రైస్ బాగుండేదని, ఇప్పుడు బాగోలేదని తెలిపాడు. బాత్‌రూమ్ డోర్లు సరిగా లేవని, విద్యుత్తు పోయినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించి హెల్త్‌సూపర్‌వైజర్‌ను అడుగగా, మందులు మాత్రమే ఇస్తామని, ఇంజెక్షన్స్ తమ వద్ద ఉండవని చెప్పారు. పాము, తేలు కాటుకు సంబంధించి యాంటీవీనమ్ ఇంజెక్షన్స్ కూడా తమ వద్ద లేవని, దగ్గర్లోని తూర్పుపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్తానని ఆమె తెలిపారు. పాఠశాల చుట్టూ చెట్లు, పొదలు ఉన్నందున పాములు, తేళ్లు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్నదని, యాంటీవీనమ్ ఇంజెక్షన్స్‌ను అందుబాటులో ఉంచడంపైనా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నదని మాజీ మంత్రులు మండిపడ్డారు. విద్యార్థులను పరామర్శించినవారిలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, గాదరి కిశోర్ కుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వం మొద్దునిద్ర : గంగుల కమలాకర్

కేసీఆర్ హయాంలోనే గురుకులాలను బలోపేతం చేసి నాణ్యమైన విద్యను అందించారని, 9 నెలల పాలనలో గురుకులాల పరిస్థితిపై ప్రభుత్వం ఒక్క సమీక్ష కూడా పెట్టలేదని గంగుల కమలాకర్ తెలిపారు. విద్యార్థులు ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వం మొద్దు నిద్రలో మునిగిపోయిందని విమర్శించారు.

పట్టించుకునే నాథుడే లేడు : ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

తొమ్మిది నెలల నుంచి గురుకులాలను పట్టించునే నాథుడే లేడని, కేసీఆర్ హయాంలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దిన గురుకులాలు కాంగ్రెస్ పాలనలో అస్తవ్యస్తంగా తయారయ్యాయని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. గురుకులాలను పట్టించుకోకుండా, ఇంత వరకు ఆ శాఖకు మంత్రిని నియమించకుండా సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, ఆయనకు హైదరాబాద్, ఢిల్లీ చక్కర్లు కొట్టేందుకే సమయం సరిపోతున్నదని మండిపడ్డారు. బోధనోపాధ్యాయులకు సమయానికి జీతాలు అందడం లేదని, వంట చేసేవారికి జీతాలు లేవని, కరెంట్ బిల్లులు, అద్దె బిల్లులు రాక గురుకులాల పరిస్థితి దయనీయంగా మారిందని తెలిపారు.

లడఖ్‌లో వాడగూడెం వాసి పర్వతారోహణ

మంగపేట, సెప్టెంబర్1: ములుగు జిల్లా మంగపేట మండలం వాడగూడేనికి చెందిన వాసం వివేక్ జమ్మూకశ్మీర్ లడఖ్‌లోని 20వేల అడుగులకుపైగా ఎత్తులో ఉన్న రెండు పర్వతాలను అధిరోహించి జాతీయ స్థాయిలో పేరు సాధించాడు. వివేక్ ఆగస్టు 24న లడఖ్‌లో 20,600 అడుగుల ఎత్తులో ఉన్న కంగ్‌యాత్సే-2 శిఖరాన్ని అధిరోహించాడు. తర్వాత మూడో రోజునే ఆగస్టు 27న (21 వేల అడుగుల ఎత్తులోని కంగ్‌యాత్సే-1 శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించాడు. ఇవేగాక ఇంకా చాలా పర్వతాలను వివేక్ అధిరోహించాడు.


కంగ్ యాత్సే-1 పర్వతంపై వివేక్

టానిక్ ఎలైట్ మద్యం షాపు సీజ్

రూ.1.70 కోట్ల మద్యం స్వాధీనం

హైదరాబాద్, సెప్టెంబర్ 1(నమస్తే తెలంగాణ) : జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-36లోని టానిక్ ఎలైట్ మద్యం షాపును ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని పేర్కొంటూ నిర్వాహకులు ఇచ్చిన రెన్యూవల్ దరఖాస్తును తిరస్కరించారు. ఈ మేరకు శనివారం రాత్రి రిజెక్షన్ ఆర్డర్ పంపి.. ఆదివారం ఉదయం దుకాణంలోని రూ.1.70 కోట్ల విలువైన వివిధ బ్రాండ్లకు చెందిన 10,291 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక అనుమతితో 2016 నుంచి ఈ షాపు కొనసాగుతుండగా.. ఆగస్టు 31న గడువు ముగిసింది. దీంతో సెప్టెంబర్ 1 నుంచి షాపు నడపడం చట్టరీత్యా నేరమని మీడియా సమక్షంలో మద్యం సీసాల లెక్కింపు అనంతరం దుకాణానికి సీల్ వేశారు. కార్యక్రమాన్ని హైదరాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శాస్త్రి, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్‌రెడ్డి, సీఐ వాసుదేవరావు పర్యవేక్షించారు.

యూ బిట్ కాయిన్ పేరిట మోసం

ఆర్మూర్ ఎక్సైజ్ ఎస్సై సహా ఐదుగురి అరెస్టు

ఆర్మూర్‌టౌన్/నిర్మల్(నమస్తే తెలంగాణ), సెప్టెంబర్ 1: క్రిప్టో కరెన్సీ, బిట్‌కాయిన్ పేరిట అధిక వడ్డీ ఆశ చూపి అమాయకులతో ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టిస్తూ మోసాలకు పాల్పడుతున్న బిట్‌కాయిన్ ముఠా గుట్టును నిర్మల్ జిల్లా పోలీసులు రట్టు చేశారు. నిందితుల్లో ఆర్మూర్ ఎక్సైజ్ ఎస్సై గంగాధర్ కూడా ఉన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జానకీ షర్మిల వివరాలు వెల్లడించారు. కడెం మండలంలోని నవాబ్‌పేట్‌కు చెందిన సల్ల రాజ్‌కుమార్, సాయికిరణ్‌తోపాటు నిర్మల్‌కు చెందిన కండెల నరేశ్, గంగాధర్, మహేశ్ బిట్‌కాయిన్ పేరిట ఆన్‌లైన్ మోసాలకు పాల్పడ్డారని తెలిపారు. రూ. లక్ష పెట్టుబడి పెడితే ప్రతి నెలా రూ.14 వేలు వస్తాయని చాలా మంది అమాయకులను దందాలోకి దించినట్టు గుర్తించామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా రూ.50 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టినట్టు ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. కొంత మంది అప్పు లు చేసి మరీ ఇందులో పెట్టుబడి పెట్టినట్టు తమ దృష్టికి రావడంతో విచారణ జరిపామని, ఎక్సైజ్ ఎస్సై గంగాధర్‌తో సహా ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు.

అధికారుల్లో హైడ్రా చిచ్చు

- మా ఉద్యోగులపై కేసులెట్లా పెడ్తరు?
- కబ్జా చేసినోళ్లను వదిలి మావాళ్లపై కేసులా
- హైడ్రాపై రాష్ట్రస్థాయి అధికారి తీవ్ర ధ్వజం



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అధికారుల్లో ఇప్పుడు హైడ్రా చిచ్చు మొదలైంది. రాష్ట్రంలో మునుపెన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం 'హైడ్రా' పేరుతో ప్రత్యేక వ్యవస్థను తీసుకొచ్చి హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేయించటం, చెరువులు, నాలాలను కబ్జా చెర నుంచి విడిపించే ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, కొందరినే లక్ష్యంగా చేసుకొని హైడ్రా పనిచేస్తున్నదన్న ఆరోపణలు వస్తుండగా, ఆరుగురు మున్సిపల్, రెవెన్యూ అధికారులపై కేసు పెట్టడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తమ శాఖల అధికారులపై కేసు పెట్టడం ఉన్నతాధికారుల్లో ఒకింత అసహనం వ్యక్తమవుతున్నట్టు తెలుస్తున్నది. రాష్ట్రంలో ఈ తరహా కేసు పెట్టడం ఇదే తొలిసారి కాగా, ఎప్పుడో ఇచ్చిన అనుమతులపై ఇప్పుడు కేసులు నమోదు చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక నిర్మాణాల్లో అనేక ఉల్లంఘనలు ఉన్నాయని, వారందరిపైనా ఇవే కేసులు పెడతారా? అన్న ప్రశ్న తలెత్తుతున్నది. అధికారులపై కేసు.. ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య వివాదంగా మారినట్టు సమాచారం. తమకు తెలియకుండానే కేసులు నమోదు చేయటంపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారి ఒకరు పోలీసులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. హైడ్రా కమిషనర్, పోలీస్ ఉన్నతాధికారులను పిలిచి ఇదేం పద్ధతి అని నిలదీసినట్టు సమాచారం. 'మీరు ఇట్లా కేసులు పెట్టేముందు మాకెందుకు చెప్పలేదు. ఇట్లా కేసులు పెట్టి ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు ఎలాంటి మెసేజ్ పంపిస్తున్నట్టు?' అని ప్రశ్నించినట్టు తెలిసింది. ఒక్క వీరితోనే ఆపేస్తారా? ఒక్క వీళ్లు మాత్రమే తప్పు చేశారంటారా? అని పలువురు ఐఏఎస్‌లు హైడ్రా అధికారులను నిలదీసినట్టు సమాచారం. ఐఏఎస్‌లను కాదని, ఐపీఎస్‌ను ప్రభుత్వం కమిషనర్‌గా పెట్టడంపైనా పలువురు ఐఏఎస్‌లు తప్పుపడుతున్నట్టు తెలిసింది. అడ్మినిస్ట్రేషన్‌లో ఇంత పెద్ద బాధ్యత ఒక ఐపీఎస్ చేతిలో పెట్టడం ఏమిటి? అని ఇటీవల సచివాలయంలో అత్యంత కీలకమైన ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించినట్టు తెలిసింది.

కట్టిన బిల్డర్లపై చర్యలుండవా?

బిల్డర్లపై హైడ్రా ఎందుకు కేసులు పెట్టడం లేదన్న చర్చ జరుగుతున్నది. చెరువుల వద్ద ఇండ్లు కట్టిన, అపార్ట్‌మెంట్లు, వెంచర్లు వేసి, భవనాలు కట్టినవారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి.. అధికారులను లక్ష్యంగా చేసుకోవడమేమిటన్న చర్చ ఉద్యోగ వర్గాల్లో జరుగుతున్నది. ఇదే విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో రాష్ట్ర ఉన్నతాధికారి ఒకరు స్వయంగా అన్నట్టు తెలిసింది. అధికారులపై కేసులు పెట్టేముందు వారి శాఖలతో సంబంధం ఉన్న అధికారులకు సమాచారం ఇవ్వడం కనీస మర్యాద, పద్ధతి అని స్పష్టం చేసినట్టు సమాచారం. ఉద్యోగులపై కేసులు పెట్టడం ప్రభుత్వ పాలసీ కాదని, తాను రాష్ట్రంలో ఉన్నతాధికారిగానే ఉన్నానని పేర్కొన్నట్టు తెలిసింది.

కొత్త సీఈఐజీగా ఏపీ అధికారి!

- ఆంధ్రా వ్యక్తికే వత్తాసు పలికిన రిటైర్డ్ అధికారి
- కీలక పోస్టు ఎగరేసుకుపోయే ప్రయత్నాలు
- పోస్టులు తెలంగాణవి.. పెత్తనం ఏపీవాళ్లదా?
- రెడ్‌కో వీసీ అండ్ ఎండీ అంశంలో ఉద్యోగుల ఆగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు శాఖలో అత్యంత కీలకమైన తెలంగాణ విద్యుత్తు ప్రధాన తనిఖీ అధికారి (సీఈఐజీ) పోస్టు ఎవరికి దక్కుతుందన్న అంశమిప్పుడు హాట్ టాపిగా మారింది. ఈ పోస్టును ఓ ఆంధ్రా అధికారి ఎగరేసుకుపోయేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. తెలంగాణ అధికారిని కాదని, తనకే ఆ పోస్టు కట్టబెట్టాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల పదవీ విరమణ చేసిన సీఈఐజీ కూడా ఏపీ అధికారికే మద్దతుగా నిలవటం, ఆయన్నే కొత్త సీఈఐజీగా నియమించాలని ప్రభుత్వానికి లేఖ రాయటం చర్చనీయాంశంగా మారింది. ఇదివరకు పనిచేసిన సీఈఐజీ ఆగస్టు 31న పదవీ విరమణ పొందారు. దీంతో కొత్త సీఈఐజీని నియమించాల్సి ఉన్నది. తెలంగాణ ఆవిర్భావం నుంచి సీఈఐజీ పోస్టులో ఏపీ అధికారులే కొనసాగుతూ వచ్చారు. ఈసారి తెలంగాణ అధికారులకే అవకాశం కల్పిస్తారని అంతా భావించారు. కానీ, మళ్లీ ఆంధ్రా అధికారి ఈ పోస్టు కోసం ప్రయత్నాలు చేయటం తెలంగాణ అధికారులను కలవరపెడుతున్నది. రిటైర్డ్ అధికారి ఏపీ అధికారిని నియమించాలని సిఫారసు చేయడం గతంలో ఎప్పుడూ జరగలేదు. ఇదే మొదటిసారి. దీనిపై తెలంగాణ ఉద్యోగులు భగ్గుమంటున్నారు. తెలంగాణవారికే సీఈఐజీ పోస్టును కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఒక్కొక్కటిగా ఎసరు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత విద్యుత్తు సంస్థల్లో ఏపీ అధికారులకు పెద్దపీట వేస్తున్నారు. ఇన్నేండ్లు సైలెంట్‌గా ఉన్న ఆంధ్రా అధికారులు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఒక్కోదానికి ఎసరుపెడుతున్నారు. ఆంధ్రా మత్తులో జోగుతున్న తెలంగాణ సర్కారు పెద్దలు కీలక స్థానాలను వారికే అప్పగిస్తున్నారు. తెలంగాణ బిడ్డల నోట్లో మట్టికొడుతున్నారు. దీంతో పోస్టులు తెలంగాణవి.. పెత్తనం ఆంధ్రా అధికారులది అన్నట్టు తయారైంది పరిస్థితి. ఇప్పటికే టీజీఎస్పీడీసీఎల్‌లో ముగ్గురు ఆంధ్రా అధికారులను ఇన్‌చార్జి డైరెక్టర్లుగా కొనసాగిస్తున్నారు. ఇటీవలే టీజీ రెడ్కో వైస్ చైర్మన్ అండ్ ఎండీగా సీమాంధ్ర మూలాలున్న డీఈని నియమించారు. దీనిపై ఇప్పటికే తెలంగాణ ఉద్యోగులు మండిపడుతున్నారు. సోషల్‌మీడియాలో పెద్దఎత్తున తమ నిరసన వ్యక్తంచేస్తున్నారు. 'తెలంగాణ ఇచ్చిన పార్టీ అని ఓటేస్తే తెలంగాణ వాదాన్ని పూర్తిగా మరుగునపడేసింద్రు. మా ఉద్యోగాలు మాకే అన్న నినాదాన్నే గాలికొదిలేసింద్రు. ఆంధ్రా వాళ్లు వెళ్లిపోయింద్రని అనుకుంటే చింత చచ్చినా.. పులుపుచావలే అనుకున్నట్టే' అని ఓ విద్యుత్తు ఉద్యోగి ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రావాళ్లు లేకుండా పాలన చేసుకోలేరంటూ బెత్తంపట్టుకొని కిరణ్ కుమార్‌రెడ్డి అన్న మాటలను నేటి కాంగ్రెస్ పాలన నిజం చేస్తున్నదని మరో అధికారి విస్మయం వ్యక్తంచేశారు.



పరవళ్లు తొక్కుతున్న పొచ్చెర

భారీ వర్షాలకు ఆదివారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పొచ్చెర జలపాతం పరవళ్లు తొక్కుతున్నది. పర్యాటకులు సమీపంలోకి రాకుండా అధికారులు అప్రమత్తమయ్యారు.
– మంచిర్యాల, నమస్తేతెలంగాణ ప్రతినిధి

సీపీఎస్ మాకొద్దు.. పాత పెన్షనే ముద్దు

గన్‌పార్క్ వద్ద ధర్నాలో ఎంప్లాయిస్ జేఏసీ




పాత పెన్షన్ అమలుచేయాలని గన్‌పార్క్ వద్ద ధర్నా చేస్తున్న తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్), యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్) ఏదీ వద్దు.. పాత పెన్షన్‌నే అమలుచేయాలని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ డిమాండ్ చేసింది. పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద ధర్నా నిర్వహించారు. కుండపోతగా పడుతున్న వర్షాన్ని లెక్కచేయకుండా తరలివచ్చిన ఉద్యోగ సంఘాల నేతలు సీపీఎస్‌కు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఎస్‌ను రద్దుచేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. పెండింగ్ సమస్యలను సర్కారు పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ధర్నాలో జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, ఎస్‌ఎం హుస్సేని, ఎనుగుల సత్యానారాయణ, పింగిలి శ్రీపాల్‌రెడ్డి, గంగాపురం స్థితప్రజ్ఞ, కల్వల శ్రీకాంత్, చావా రవి, వంగ రవీందర్‌రెడ్డి, జీ సదానందంగౌడ్, జ్ఞానేశ్వర్, డాక్టర్ పీ మధుసూదన్‌రెడ్డి, మార్రెడ్డి అంజిరెడ్డి, కటకం రమేశ్, రాజభానుచంద్రప్రకాశ్, కనకచంద్రం తదితరులు పాల్గొన్నారు.

'సీపీఎస్ రద్దుకు కృషిచేయండి'

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల పెన్షన్ హక్కులను హరిస్తున్న కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దుచేసేందుకు కృషిచేయాలని తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కోరింది. పాత పింఛన్ అమలుచేసేలా ప్రభుత్వాన్ని ఒప్పించాలని విజ్ఞప్తిచేసింది. సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఆదివారం హైదరాబాద్‌లో స్పీకర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ సీపీఎస్‌తో 20 ఏండ్లుగా సామాజిక భద్రత కరవై, ఎన్నో కుటుంబాలు రోడ్డునపడ్డాయని వాపోయారు. విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని స్పీకర్ హామీ ఇచ్చినట్టు స్థితప్రజ్ఞ తెలిపారు. కోశాధికారి నరేశ్‌గౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు, అశోక్‌రెడ్డి, సుశీల్ తదితరులు స్పీకర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

'ఎస్‌వోఐ' గెజిటెడ్ ప్రధాన కార్యదర్శిగా రమేశ్‌గౌడ్



హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 1: సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖలోని సర్వే ఆఫ్ ఇండియా(ఎస్‌వోఐ) గెజిటెడ్ అధికారుల సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా గోటూరి రమేశ్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. పొరుగు దేశాల మధ్య ఉండే అంతర్జాతీయ సరిహద్దుల నిర్వహణ, ఏదైనా వివాదం ఉత్పన్నమైనప్పుడు పరిష్కరించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తుంది. రమేశ్‌గౌడ్ ప్రస్తుతం బీఎంఎస్ ఉపాధ్యక్షుడిగా, స్వావలంబి భారత్ అభియాన్‌కు రాష్ట్ర కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.


సీఎం రేవంత్‌రెడ్డితో శ్రీనివాస్‌రెడ్డి

సీఎంను కలిసిన మీడియా అకాడమీ చైర్మన్

జర్నలిస్టుల సంక్షేమంపై చర్చ

హైదరాబాద్, సెప్టెంబర్ 1(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంక్షేమంపై చర్చించినట్టు తెలిసింది. 8న రవీంద్రభారతిలో నిర్వహించనున్న జేఎన్‌జే హెచ్‌ఎస్ స్థలాల అప్పగింత కార్యక్రమంపై, రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఆరోగ్య పథకం ఇతర సంక్షేమాలకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగినట్టు సమాచారం.

పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్

హైదరాబాద్, సెప్టెంబర్ 1(నమస్తే తెలంగాణ): పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుండు లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఆదివారం నారాయణగూడలోని పీఆర్టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో లక్ష్మణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లక్ష్మణ్ ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు ఉద్యోగ విరమణతో ఈ పోస్టుకు ఖాళీ ఏర్పడింది. అక్టోబర్ 7న రాష్ట్ర శాఖకు ఎన్నికలు జరగనున్నాయి. అప్పటివరకు ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్ కొనసాగుతారని రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి ప్రకటించారు. సమావేశంలో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు బీ మోహన్‌రెడ్డి, పూల రవీందర్, మాజీ అధ్యక్షుడు పీ వెంకట్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఉపాధ్యాయ మాసపత్రిక ప్రధాన సంపాదకుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి పాల్గొన్నారు.

పేదల బతుకుల్లో మన్నుపోసిన సీఎం

పేదల ఇండ్లను కూలిస్తే ఖబర్దార్: ఎంపీ ఈటల

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): హైడ్రా పేరిట సీఎం రేవంత్‌రెడ్డి ఆడుతున్నది డ్రామా తప్ప సమాజహితం కోసం కాదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. బందిపోట్లలాగా ఇండ్లను కూల్చుతూ పేదల బతుకుల్లో ముఖ్యమంత్రి మన్నుపోశాడని విమర్శించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్మశానవాటికకు, గుడికి, క మ్యూనిటీ హాల్‌కు కూడా నోటీసు ఇచ్చారంటే రేవంత్‌రెడ్డికి ఎంత తెలివి ఉన్నదో తెలుస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్రమ నిర్మాణాలకు కారకులకు శిక్ష వేయాలని, వారి నుంచే రికవరీ చేయాలని, చట్టబద్ధంగా నడుచుకోవాలని సూచించారు. పేదల పక్షాన మాట్లాడే వారి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం తమ సోషల్ మీడియాలో నెగెటివ్ ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. పేదల ఇండ్లు కూలిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

ప్రాణం తీసిన టీవీ చానల్ గొడవ

ఛాతిలో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి

నార్నూర్, సెప్టెంబర్ 1: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని కొలాంగూడకు చెందిన సేదం లక్ష్మణ్(35) ఆదివారం మధ్యాహ్నం పక్కనే ఉంటున్న కొడప జైతు ఇంట్లో టీవీ చూడడానికి వెళ్లాడు. అప్పటికే జైతు, రాములు టీవీ చూస్తున్నారు. లక్ష్మణ్ టీవీ చానల్ మార్చాలని రాముతో గొడవపడ్డాడు. తాగిన మత్తులో ఉన్న మాడావి రాము చంపేస్తానని లక్ష్మణ్ ఛాతిపై పిడికిలితో బలంగా కొట్టి, గొంతు నొక్కాడు. లక్ష్మణ్ స్పృహ కోల్పోయాడు. గమనించిన రాము అక్కడి నుంచి పారిపోయాడు. లక్ష్మణ్‌ను దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. లక్ష్మణ్ భార్య మంతుబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రహీం పాషా తెలిపారు.

ఐసెట్ వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఐసెట్ వెబ్ కౌన్సెలింగ్ ఆదివారం నుంచి ప్రారంభమైంది. తొలిరోజు 3,057 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. 8 వరకు ప్రాసెసింగ్ ఫీజును చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవచ్చు. 3 నుంచి 9వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను చేపడతారు.

ఖమ్మంలో జలప్రళయం

ఊళ్లకు ఊళ్లను ముంచెత్తిన వరద • ఉప్పొంగిన వాగులు, నదులు, ఏరులు

మున్నేరు, పరీవాహకాల మహోగ్రరూపం • ఆకేరు ఉధృతికి మునిగిన రాకాసితండ

ఆరుగురి గల్లంతు.. మూడు మృతదేహాల గుర్తింపు • సీతారామ కాలువలకు గండ్లు



ఖమ్మం నగరంలోని కాల్వొడ్డులో నీట మునిగిన లోతట్టు ప్రాంతం



ఖమ్మం నగరంలో మున్నేరు వాగు ఉధృతితో నీట మునిగిన గంగమ్మ గుడి

ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ ఖమ్మం/ తిరుమలాయపాలెం/ కూసుమంచి, సెప్టెంబర్ 1: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కురిసిన భీకర వర్షం జలప్రళయాన్ని తలపించింది. శనివారం అర్ధరాత్రి నుంచి మొదలైన వరద రాత్రికి రాత్రే ఊళ్లను, కాలనీలను ముంచెత్తింది. జిల్లాలో గరిష్ఠంగా 32 సెంటీమీటర్ల వర్షం కురిసింది. 51 వేల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఖమ్మం నగర సమీపంలోని మున్నేరు మహోగ్రరూపం దాల్చింది. మున్నేరుపై ప్రకాశ్‌నగర్ వద్ద ఉన్న వంతెన పైనుంచి వరద ప్రవహించింది. ఈ వంతెనపై ఓ మహిళ సహా ఐదుగురు వ్యక్తులు చిక్కుకుపోయారు. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి దగ్గర సుమారు ఆరుగురు, వాల్యాతండా వద్ద 10 మంది, ఖమ్మం నగరంలోని డాబాల్లో సుమారు 50 మంది చిక్కుకుపోయారు. వారిని రక్షించేందుకు విశాఖపట్నం నౌకాదళానికి చెందిన హెలికాప్టర్లను రప్పించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చర్యలు చేపట్టారు. వరద ఉధృతి కారణంగా ఖమ్మంలో కరుణగిరి వద్ద మున్నేరు వంతెన కంపించింది. ఖమ్మం నగరం సహా జిల్లాలో జలదిగ్బంధంలో చిక్కుకున్న చాలామందిని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. మున్నేరు పరీవాహక ప్రాంతాలన్నింటినీ వరద ముంచెత్తింది. పలు కాలనీల్లో అనేక ఇండ్లు మునిగిపోయాయి. బాధితులు డాబాలపైకి ఎక్కి హాహాకారాలు చేశారు. కొన్నిచోట్ల వాహనాలు కూడా పూర్తిగా నీటమునిగాయి. గోళ్లపాడు కాలువలోకి వర్షపు నీరు చేరడంతో మురుగు పోటెత్తింది. అదంతా స్థానిక ఇళ్లోలోకి చేరింది. ఇంకొందరు కట్టుబట్టలతో ఇళ్లను వదిలి రోడ్ల పైకి వచ్చారు. ఖమ్మం రూరల్ మండలం పెద్ద తండా పంచాయతీలోని అనేక కాలనీలు వరదనీటిలో చిక్కుకోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలను బైపాస్‌రోడ్డులోని రాంలీలా ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి అధికారులు తరలించారు.

ఆకేరు ఉధృతికి మునిగిన రాకాసితండా

తిరుమలాయపాలెం మండలంలో మునుపెన్నడూ లేనివిధంగా భారీ వర్షం కురిసింది. మండలంలోని బీరోలు పెద్ద చెరువు, ఊర చెరువులకు గండిపడి పంటపొలాలు కొట్టుకుపోయాయి. బంధంపల్లి ఎస్సీ కాలనీ మునిగిపోయింది. కాకరవాయిలో రెండు కోళ్లఫారాలు మునిగి కోళ్లు చనిపోయాయి. ఆకేరు ఉధృతంగా ప్రవహించడంతో ఆదివారం తెల్లవారుజామున రాకాసితండా నీట మునగడంతో తండావాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గుట్టలు, డాబాలు ఎక్కి ఆర్తనాదాలు చేశారు. వారిని పడవల ద్వారా రక్షించి, 80 మందిని పునరావాస కేంద్రానికి తకలించారు.

'పాలేరు'కు వరద పోటు


పాలేరు రిజర్వాయర్‌కు వరద పోటెత్తడంతో రాత్రికి రాత్రే ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చింది. పాలేరు పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా 28 అడుగులకు పైగా నీరు వచ్చి చేరింది. సమీపంలోని ప్రజలు కట్టుబట్టలతో ఇండ్లు వదిలివెళ్లారు. నాయకన్‌గూడెంలో గుడి సమీపంలో ఇటుకలు తయారు చేస్తున్న కుటుంబం వరదలో చిక్కుకున్నది. వారిలో ఒకరిని ఎన్‌డీఆర్‌ఎస్ ఆధికారులు కాపాడారు. మరో ఇద్దరు కొట్టుకొని పోగా వారి ఆచూకీ లభ్యం కాలేదు. పెట్రోల్‌బంక్‌లో చిక్కుకున్న వ్యక్తిని మత్స్యకారులు, అధికారులు కాపాడారు. పరిస్థితి గురించి మంత్రి పొంగులేటి ఆరా తీశారు. నాయకన్‌గూడెం వద్ద పాలేరు వరద పోటెత్తి ఓ ఇంటిని చుట్టుముట్టడంతో యాఖూబ్, సైదాబీ దంపతులు, వారి కుమారుడు షరీఫ్ వెంటనే ఇంటిపైకి ఎక్కి హాహాకారాలు చేశారు. కొంతసేపటికి వరద పెరిగి ఇల్లు కూలడంతో కొట్టుకుపోయారు. వారిలో షరీఫ్ ప్రాణాలతో బయటపడగా, సైదాబీ, యాకూబ్ ఆచూకీ లభించలేదు. పాలేరు మినీ హైడెల్ వద్ద పెద్ద కాలువకు ఒకటో గండి, హట్యాతండా వద్ద రెండో గండి పడ్డాయి. దీంతో హట్యాతండా వాసులు తండాను ఖాళీ చేసి బయటకు వెళ్లారు. కూసుమంచి మండలంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా 20కి పైగా గ్రామాల్లోకి వరద నీరు వచ్చింది.

తల్లడిల్లిన భద్రాద్రి కొత్తగూడెం

భారీ వర్షం ధాటికి భద్రాద్రి జిల్లా కూడా అతలాకుతలమైంది. లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. తెల్లరేసరికి మణుగూరు పట్టణం చుట్టూ వరదనీరు చుట్టుముట్టింది. అశ్వాపురం మండలంలోని వాగులో పడి గల్లంతైన ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. అదే మండలంలో 200 మేకలు, 30 ఎద్దులు మృతిచెందాయి. బూర్గంపహాడ్ మండలం కృష్ణసాగర్‌లో 30 ఆవులు మృత్యువాతపడ్డాయి. సింగరేణికి భారీ నష్టం వాటిల్లింది. 40 వేల టన్నుల ఉత్పత్తికి ఆటంకం కలిగింది. వరద ఉధృతికి సీతారామ కాలువ కొట్టుకుపోయింది. మణుగూరు సుందరయ్య నగర్ ప్రాంతానికి చెందిన నందికొల్ల రాము మంచం మీదనే మృతిచెందాడు. అశ్వాపురం మండలంలో చింతకుంట చెరువు తెగిపోవడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. టేకులపల్లిలో గుండాలకు వెళ్లే రహదారి కొట్టుకుపోయింది. వాగు పక్కనే ఓ రైతు కట్టేసిన ఎద్దులు అక్కడికక్కడే మృతిచెందాయి. ములకలపల్లి మండలంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలే ప్రారంభించిన సీతారామ పంపుహౌస్ కాలువకు గండి పడింది. సుమారు 20 వేల ఎకరాల పంటలు దెబ్బతిన్నాయి. పాల్వంచ మండలంలోని బంద్రిగొండ వద్ద కూడా సీతారామ కాలువకు గండి పడింది. ఇక్కడ కూడా సుమారు 30 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది.

ముగ్గురు మంత్రులుండి ఏం లాభం?

- వరదలపై అవగాహనలేమి
- ఖమ్మం జిల్లా అతలాకుతలం
- మధ్యాహ్నం వరకు హైదరాబాద్‌లోనే పొంగులేటి
- డిప్యూటీ సీఎం వెళ్లినా రక్షణ చర్యలు శూన్యం
- మంత్రి తుమ్మలను ఘెరావ్ చేసిన బాధితులు
- రక్షించేవారెవరంటూ ఆర్తనాదాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులున్నా వరదల నుంచి కాపాడేందుకు ఎందుకూ పనికిరారని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులను ఇచ్చామని నాడు సీఎం రేవంత్ రెడ్డి చెప్పినా.. వాళ్లు మాత్రం మున్నేరు వరదల నుంచి దేవుడే ప్రజలను కాపాడాలని చేతులు ఎత్తివేశారని మండిపడుతున్నారు. తమను ఎవరు కాపాడుతారో తెలియక, రక్షించేవారికోసం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని, బిల్డింగులపైకి ఎక్కి ఆర్తనాదాలు చేస్తున్నారు. తిండిలేక హహాకారాలు చేస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచే ఉమ్మడి ఖమ్మం జిల్లా అటు గోదావరి, ఇటు మున్నేరు నదుల వరదల్లో చిక్కుకున్నట్టు వార్తలు వచ్చినా ముగ్గురు మంత్రులకు చీమకుట్టినట్టు కూడా లేదని జనాలు ఆగ్రహం వ్యక్తంచేశారు. డిప్యూటీ సీఎం పర్యటన వర్షాల కారణంగా శనివారం సాయంత్రమే రద్దు కాగా.. ఆయన ఖమ్మంలోనే ఉన్నా ప్రజలను అప్రమత్తం చేయడంలో, యంత్రాంగాన్ని పరుగులు పెట్టించడంలో పూర్తిగా విఫలమయ్యారు. పేరుకు రెండు, మూడు ప్రాంతాలకు వెళ్లినా ఖమ్మం నగరాన్ని మాత్రం విస్మరించారు.

అవగాహన లేదు.. అంచనా లేదు

రాష్ట్రంలో ఎప్పుడు భారీ వర్షాలు వచ్చినా, ఖమ్మంలో అతి భారీ వర్షం కురిసినా ముందుగా ప్రభావితమయ్యేది మున్నేరు పరివాహక ప్రాంతమే. అటు ఖమ్మం నగరంలోని ప్రకాశ్‌నగర్, ఇటు హైదరాబాద్‌వైపు వెళ్లే గ్రామాలు వరదలతో తీవ్ర ఇబ్బందులు పడుతుంటాయి. గత పదేండ్లలో ఖమ్మంలో ఎప్పుడు భారీ వర్షం వచ్చినా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రజలు, అధికారులను అప్రమత్తం చేసేవారు. లోతట్టు ప్రాంతాలవారిని పోలీసుల సహకారంతో సురక్షిత ప్రాంతాలకు తరలించేవారు. ముందుస్తు చర్యలు పకడ్బందీగా తీసుకునేవారు. ఇప్పుడు ముగ్గురు మంత్రులున్నా అరకొరగానే ముందస్తు ఏర్పాట్లు చేశారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని భారత వాతావరణశాఖ, హైదరాబాద్ వాతావరణ కేంద్రం వారం నుంచి హెచ్చరిస్తున్నా వరదలపై అవగాహన లేక, ముందస్తు అంచనా లేక జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లోనే గడిపారు. తీరా ఇప్పుడు దేవుడిపైనే భారం వేశారు. పరిస్థితి చేయిదాటి పోతుండటంతో పొంగులేటి ఖమ్మం చేరుకొని, కొన్ని వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు.

సీఎం డౌన్ డౌన్.. తుమ్మల గోబ్యాక్

మొదటిపేజీ తరువాయి...

బాధితులు పెద్దసంఖ్యంలో రోడ్డు మీదకు వచ్చి ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, భట్టి విక్రమార్క ఉన్నా పనికిరారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండ్రోజుల నుంచి భారీ వర్షాలు కురిసి వరదలు వచ్చి ఇండ్లు కొట్టుకపోతున్నా ఏ ఒక్క మంత్రి కూడా ఇక్కడికి రాలేదని, వారు వెంటనే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ డౌన్‌డౌన్.. ఎమ్మార్వో డౌన్‌డౌన్.. అంటూ నినాదాలు చేశారు. ఆందోళనకారులను సముదాయించడానికి ప్రయత్నం చేసిన పోలీసులపైనా ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది ఇదేవిధంగా వరదలు వచ్చి ఇబ్బందుల్లో ఉంటే పువ్వాడ అజయ్ గిర్రు గిర్రున తిరుగుతూ వరద నీటిలోనే ప్రజలను ఆదుకున్నారని పలువురు మహిళలు గుర్తుచేసుకున్నారు. అలాంటోడిని వదిలి ఈ కాంగ్రెస్సోడికి ఓటేస్తే ఎవడూ రాలేదేం? అని ధ్వజమెత్తారు.

'తుమ్మల గోబ్యాక్' అంటూ నినాదాలు

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు చేదు అనుభవం ఎదురైంది. ఆదివారం రాత్రి వరద బాధితులను పరామర్శించేందుకు ఖమ్మం నగరంలోని ప్రకాశ్‌నగర్‌కు వెళ్లగా.. అక్కడ ఉన్న బాధితులు తుమ్మలను చూసి ఇప్పుడా వచ్చేది తుమ్మల గారు, గోబ్యాక్ మంత్రి తుమ్మల అంటూ నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. వరదల్లో చిక్కుకొని ఆర్తనాదాలు చేస్తుంటే జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఉండి ఏం చేస్తున్నారు? అని నిలదీశారు. తక్షణమే తమవారిని కాపాడేందుకు హెలికాప్టర్ కావాలని ఘెరావ్ చేశారు. అయితే, హెలికాప్టర్ వచ్చే పరిస్థితులు లేవని చావు కబురు చల్లగా చెప్పారు. దీంతో తన కున్న పలుకుబడితో ఏపీ సీఎం చంద్రబాబును సాయం కోరినట్టు చెప్పినా ఆదివారం రాత్రి వరకు విశాఖపట్నం నుంచి ఒక్క హెలికాప్టర్ కూడా రాలేదు. ఆఖరుకు కొందరు జర్నలిస్టులు ఇచ్చిన సమాచారంతో మున్నేరులో చిక్కుకున్న బాధితులను కాపాడేందుకు అగ్నిమాపక ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి.

కష్టాల్లో ఆదుకోని మంత్రులు ఎందుకు?



విద్యార్థిని రిషిక

కష్ట సమయంలో ప్రజలను ఆదుకోని మంత్రులు ఎందుకు? జిల్లాలో ముగ్గురున్నా లాభం లేదు. ఖమ్మంలో మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో ప్రకాశ్‌నగర్ ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప ట్టించుకోరా? వరదల్లో చిక్కుకున్న వా రిని రక్షించడంలో వైఫల్యం చెందారు. కేవలం భోజనం పెట్టి చేతులు దులుపుకొంటే సరిపోతుందా? మంత్రి తుమ్మల ఎందుకు వచ్చిండో చెప్పాలి

- రిషిక, ఇంటర్ విద్యార్థిని, ఖమ్మం

సహాయక చర్యల్లో వేగం పెంచండి

- ఖమ్మం, మహబూబాబాద్‌లో ఐదుగురి మృతి విషాదం
- నిరాశ్రయులకు షెల్టర్లు ఏర్పాటుచేయాలి
- రాజ్యసభ సభ్యులు వద్దిరాజు



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : భారీ వానలు, వరదలతో అతలాకుతలమైన ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టి బాధితులను ఆదుకోవాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర డి మాండ్ చేశారు. భారీ వ రదల కారణంగా మున్నే రు నది పోటెత్తడంతో ఐదుగురు మృత్యువాత పడడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఖమ్మంలో వందలాది ఇండ్లు ముంపునకు గురై, వేలాది మంది నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. నిరాశ్రయులకు షెల్టర్లు ఏర్పాటుచేయాలని, తాగునీరు, ఆహారం అందించాలని, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన రాష్ట్ర ప్రభుతాన్ని కోరారు.

మానుకోట అతలాకుతలం

- రోడ్డు, రైలు మార్గాలన్నీ బంద్
- కేసముద్రం మండలం ఇంటికన్నె వద్ద కొట్టుకుపోయిన రైల్వేట్రాక్
- జలదిగ్బంధంలో రావిరాల గ్రామం
- రాజుకొత్తపల్లి కట్ట తెగి తీవ్రనష్టం



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నె రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాల కింద కోతకు గురైన నేల

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: భారీవర్షాలతో మహబూబాబాద్ జిల్లా అతలాకుతలమైంది. జనజీవనం స్తంభించింది. జిల్లాలో 29.67 సెంటీమీటర్లు సగటు వర్షపాతం నమోదవగా, అత్యధికంగా చిన్నగూడూరులో 45.06 సెంటీమీటర్లు కురిసింది. రైలు, రోడ్డు మార్గాలన్నీ పూర్తిగా బంద్ అయ్యాయి. చెరువులకు గండ్లు పడి వేలాది ఎకరాల పంట నీట మునిగింది. సుమారు 20 వేల ఎకరాల్లో వరి, 10 వేల ఎకరాల్లో ఇతర పంటలు నీట మునిగినట్టు ప్రాథమిక అంచనా. కేసముద్రం మండలం ఇంటికన్నె వద్ద రెండు చోట్ల రైల్వే ట్రాక్ కొట్టుకుపోయింది. ఇంటికన్నె వద్ద 417వ మైలురాయి నుంచి 418వ మైలురాయి వరకు, 418వ నుంచి 420వ మైలురాయి వరకు రెండు చోట్ల ట్రాక్ కొట్టుకుపోయింది. మహబూబాబాద్, తాళ్ల పూసలపల్లి మధ్య మంద కొమురమ్మ నగర్ వద్ద ఉన్న 432వ, 433వ మైలురాయి వరకు ట్రాక్ దెబ్బతిన్నది. పట్టాల మధ్యలో బుంగ పడి కుంగిపోయింది. దీంతో సిబ్బంది సమాచారంతో కొన్ని రైళ్లు డోర్నకల్ జంక్షన్‌లో, మరికొన్ని మహబూబాబాద్, మరో రెండు రైళ్లు కేసముద్రం రైల్వేస్టేషన్లలో నిలిచిపోయాయి. ఆయా చోట్ల రైల్వే ప్రయాణికులు అర్ధరాత్రి వేళ అవస్థలు పడ్డారు. స్థానికులతోపాటు పలు వ్యాపార, వాణిజ్య సంస్థలు, కుల సంఘాలు ఆహారాన్ని తీసుకొచ్చి ప్రయాణికులకు అందజేశారు. నెల్లికుదురు మండలం రావిరాల గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకున్నది. నెల్లికుదురు మండలంలోని రాజుకొత్తపల్లి చెరువుకట్ట తెగి సమీప ప్రాంతాల్లోని ఇండ్లలోకి చేరాయి. సుమారు 36 గొర్రెలు నీటిలో కొట్టుకుపోగా, 19 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. నాలుగు ఇండ్లు నేలమట్టమయ్యాయి.



మహబూబాబాద్ శివారులో వాగు ఉధృతికి మునిగిన వంతెన

జలదిగ్బంధంలో చిక్కుకున్న 9 మంది సేఫ్

ఖమ్మం, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి వద్ద మున్నేరు వాగులో చిక్కుకున్న 9 మంది సురక్షితంగా బయటపడ్డారు. ఉదయం నుంచి ఆర్తనాదాలు చేసినా రాత్రి 10 గంటల వరకు అధికారులు స్పందించలేదు. వరదలో చిక్కుకున్నా తమను పట్టించుకోవడం లేదని, కనీస సహాయక చర్యలు లేవంటూ బాధిత కుటుంబాలు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును నిలదీశాయి. ప్రభుత్వంపై నమ్మకం లేక స్థానికులు, బంధువులు గజ ఈతగాళ్లను పంపించారు. రాత్రి 10 గంటలకు వర్షం తగ్గుముఖం పట్టడంతో ఫ్లడ్ లైట్ల వెలుగులో జేసీబీ సాయంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది చేరుకోగా అప్పటికే స్థానికుల సహకారంతో వారు బయటపడ్డారని నిర్ధారించి వెనక్కి వచ్చారు. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ఏం ప్రయో జనమని బాధిత కుటుంబాలు ధ్వజమెత్తాయి.

గజ ఈతగాళ్లే రక్షించారు!

ఖమ్మంలో మున్నేరు వరదలో చిక్కుకున్న మరో 11 మంది బాధితులనూ బంధువులే రక్షించుకున్నారు. కరుణగిరి సాయికృష్ణనగర్ వాటర్ ట్యాంకు వద్ద ఓ ఇల్లు రెండో ఫ్లోర్ వరకూ నీరు చేరింది. తమను రక్షించాలని దివ్యాంగుడు సహా ఐదుగురు పెద్దలు, ఐదుగురు పిల్లలు వేడుకుంటూ ఉదయం వారు పెట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రభుత్వం స్పందించకపోవడంతో బంధువులు డబ్బులు చెల్లించి వైరా ప్రాంతం నుంచి ముగ్గురు గజ ఈతగాళ్లను రప్పించి బాధితులను బయటకు తీసుకొచ్చారు.

రాళ్లవాగులో ఒకరి గల్లంతు..

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండల శివారు ఈదుల పూసపల్లి రోడ్డులో ఉన్న రాళ్లవాగులో ఆదివారం రాత్రి ఏపీకి చెందిన డీసీఎం వ్యాన్ చిక్కుకుపోయింది. ఐదుగురిలో ముగ్గురు వ్యాన్‌ను, మిగతా ఇద్దరు చెట్టును పట్టుకొని ఉన్నారు. వారిలో ఒకరు గల్లంతు కాగా మిగతా నలుగురిని ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది కాపాడారు.

వరదలో కొట్టుకుపోయిన తండ్రీకూతురు

- కూతురు మృతదేహం లభ్యం
- తండ్రి ఆచూకీ కోసం గాలింపు
- భారీ వర్షాలకు 13 మంది మృతి
- వరదలో మరో 10 మంది గల్లంతు

న్యూస్ నెట్‌వర్క్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): భారీ వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం 13 మంది మృతి చెందారు. మరో 10 మంది గల్లంతయ్యారు. వందల సంఖ్యలో మూగజీవాలు ప్రాణాలు కోల్పోయాయి. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గంగారం తండాకు చెందిన తండ్రి, కూతురు నూనావత్ మోతీలాల్ (45), నూనావత్ అశ్విని (26) వాగు వరదనీటిలో గల్లంతయ్యారు. అశ్విని ఛత్తీస్‌గఢ్‌లోని రాయగఢ్ వ్యవసాయ యూనివర్సిటీలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నది. ఆమె సోదరుడికి నిశ్చితార్థానికి వచ్చి ఆదివారం తెల్లవారుజామున తండ్రి మోతీలాల్‌తో కలిసి హెదరాబాద్ విమానాశ్రయానికి కారులో బయలుదేరింది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం వద్ద బ్రిడ్జీ పైనుంచి పారుతున్న ఆకేరు వాగులోనే కారును పోనిచ్చారు. వరద ఉధృతికి కారు కొట్టుకుపోయింది. తమను రక్షించాలని కుటుంబ సభ్యులకు తండ్రి, కూతురు ఫోన్ చేశారు. కొద్దిసేపటికి వారి ఫోన్ స్విచ్ఆఫ్ వచ్చింది. పోలీసుల సహాయంతో గ్రామస్తులు గాలింపు చేపట్టారు. సమీపంలోని తోటలో అశ్విని మృతదేహం లభించింది. తండ్రి మోతీలాల్ ఆచూకీ కోసం పోలీసులు, రెస్క్యూ బృందాల సభ్యులు గాలిస్తున్నారు. భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం వెంకటాపురంలోని తోగువాగు ఉప్పొంగడంతో తాటి ఆదెమ్మ (70), కల్లూరి నీలమయ్య (60) కొట్టుకుపోగా 200 మేకలు, 30 పశువులు గల్లంతయ్యాయి. వారి మృతదేహాలు వాగు ఒడ్డున చెట్ల వద్ద దొరికాయి. మేకలు, పశువులు మృతిచెంది చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లాలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరు గల్లంతయ్యారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెంకటాపురంలో నర్సయ్య, హనుమకొండ జిల్లా పరకాల మండలం రాజీపేటలో గువ్వ రాములు (58), పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన చెప్యాల పవన్, కరీంనగర్ జిల్లా బొమ్మకల్‌కు చెందిన గోస్కుల కుమార్ (45), కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చాపేటకు చెందిన కైరంకొండ శివరాములు (55), సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లికి చెందిన సందరి లక్ష్మణ్ (55) గల్లంతయ్యారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లిలో జెర్రిపోతుల మల్లికార్జున్ (38), వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం గిర్నిబావిలో వృద్ధురాలు కొండ్రు సమ్మక్క, రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఆరీఫ్ మన్సూర్ (14 నెలలు), నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం ఎక్కమేడ్‌లోతల్లి హన్మమ్మ(60), కూతురు అంజమ్మ (40), సిద్దిపేట జిల్లా కోహెడ మండల రాంచంద్రాపూర్‌లో బొబ్బల కనకారెడ్డి (60) మృతిచెందారు. కాగా.. ఉమ్మడి జిల్లాల పరిధిలో 61 పశువులు, నాలుగు బర్రెలు, 1500 కోళ్లు, 422 గొర్రెలు వరద నీటిలో చిక్కుకొని మృత్యువాత పడగా.. మరో 156 గొర్రెలు వర్షపునీటిలో కొట్టుకుపోయాయి.



ఇంటింటికీ తిరిగి సంతకాలు సేకరిస్తున్న గోషామహల్‌వాసులు

ఉస్మానియా దవాఖాన మాదగ్గరొద్దు

- ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ

అబిడ్స్, సెప్టెంబర్ 1: గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా దవాఖాన నిర్మాణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వినోద్‌యాదవ్, కోటి శైలేశ్ కురుమ, పశుపతి, వీరేందర్, కిరణ్, వాసుయాదవ్ గోషామహల్ ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి సంతకాలు సేకరించారు. దవాఖాన ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకునేంత వరకు ఆందోళన చేపడ్తామని వారు హెచ్చరించారు. దవాఖాన మార్చురీతో దుర్గంధం వ్యాప్తి చెంది ఇక్కడి ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ స్థలం ఎంపిక చేసి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

కుటుంబాన్ని బలిగొన్న బెట్టింగ్

గాజులరామారంలో విషాద ఘటన



బాధిత కుటుంబం (ఫైల్‌ఫోటో)

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 1: ఆన్‌లైన్ బెట్టింగ్ ఏకంగా ఓ కుటుంబాన్నే బలితీసుకున్నది. ఈ విషాద ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. బాలానగర్ ఏసీపీ హనుమంత్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న మంచిర్యాల వాసి వెంకటేశ్ (37) తన భార్య వర్షిణి (33)తోపాటు పిల్లలు రిషికాంత్ (11), విహాన్ (3)తో కలిసి గాజులరామారం బాలాజీ లేఅవుట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో మూడేండ్ల నుంచి అద్దెకు ఉంటున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడ్డ వెంకటేశ్.. కొంత కాలం నుంచి తన జీతంతోపాటు తెలిసినవారి నుంచి తెచ్చిన అప్పులను సైతం బెట్టింగ్‌లలో పెట్టి తీవ్రంగా నష్టపోయాడు. దీనిపై భార్యభర్తల మధ్య మనస్పర్ధలు తలెత్తడంతో తీవ్ర మనోవేదనకు గురైన వెంకటేశ్.. కుటుంబమంతా చనిపోవాలని నిర్ణయించుకున్నట్టు శనివారం తెల్లవారుజామున తన తండ్రికి మెసేజ్ పంపాడు. అనంతరం భార్యతోపాటు ఇద్దరు పిల్లలను ముఖంపై దిండుతో అదిమిపెట్టి చంపిన వెంకటేశ్.. ఆ తర్వాత తాను కూడా ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫోన్ ద్వారా వెంకటేశ్ తండ్రి అందించిన సమాచారం మేరకు వాచ్‌మన్ వెళ్లి ఆ అపార్ట్‌మెంట్ తలుపులు కొట్టినా సమాధానం లేకపోవడంతో స్థానికుల సాయంతో పోలీసులకు ఫోన్ చేశారు. వారు వచ్చి బలవంతంగా తలుపులు తెరవడంతో అప్పటికే జరగరానిది జరిగిపోయింది. వేర్వేరు గదుల్లో వెంకటేశ్, ఆయన భార్య, పిల్లలు విగతజీవులై కనిపించడంతో మృతదేహాలను గాంధీ దవాఖానకు తరలించారు. వెంకటేశ్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా వ్యవసాయ శిక్షణ

- ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ), వ్యవసాయ యూనివర్సిటీ: వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా యువతకు శిక్షణ ఇస్తున్నామని భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఎడ్యుకేషన్) డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్ తెలిపారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్) 49వ వ్యవస్థాపక దినోత్సవానికి ముఖ్యఅతిథిగా అగర్వాల్ హాజరై మాట్లాడారు. వ్యవసాయ డిప్లొమా కోర్సులతో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు, స్వయం ఉపాధి దొరుకుతాయని వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ పద్మరాజు చెప్పారు. ఏ-ఐడియా ద్వారా దేశవ్యాప్తంగా 321 స్టార్టప్‌లకు సహకారాన్ని అందిస్తున్నామని నార్మ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. ప్రైవేటు వ్యవసాయ విశ్వవిద్యాలయంతో పాటు 56 ఐసీఏఆర్ ఇనిస్టిట్యూట్‌లతో అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుని ముందుకు సాగుతున్నామన్నారు. ఈ సందర్భంగా బెస్ట్ ఇన్నోవేటివ్ రైతులు, స్టార్టప్, ప్రింట్ మీడియా, పీజీ స్టూడెంట్‌లకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో నార్మ్ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ రమాసుబ్రహ్మణ్యం, వివేక్ పూర్వర్, జాకీర్‌కిల్జీ పాల్గొన్నారు.


ప్రముఖ పర్యావరణవేత్త కిషన్‌రావు మృతి

- పటాన్‌చెరు కాలుష్యంపై అలుపెరగని పోరాటం



ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ కిషన్‌రావు (ఫైల్)

పటాన్‌చెరు, సెప్టెంబర్ 1: ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ అల్లాని కిషన్‌రావు (86) తీవ్ర అనారోగ్యంతో ఆదివారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం నందిగామలో మరణించారు. 1938లో పటాన్‌చెరు పట్టణ సమీపంలోని మన్మోల్‌లో జన్మించారు. ఎంబీబీఎస్ చదివి 1977లో పటాన్‌చెరులో యశోద దవాఖాన ఏర్పాటు చేశారు. 1980 నుంచి ఏర్పాటు చేసిన పరిశ్రమలు తీవ్రస్థాయిలో కాలుష్యం వదలడంతో ఆయన పోరుబాట పట్టారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి ధర్నాలు, ఆందోళనలు చేపట్టారు. 1986లో ప్రముఖ పర్యావరణవేత్త పురుషోత్తంరెడ్డి మార్గదర్శకత్వంలో డాక్టర్ కిషన్‌రావు సిటిజన్స్ ఎగెనెస్ట్ పొల్యూషన్ ఫోరంలో చేరారు. పటాన్‌చెరు-బొల్లారం కాలుష్యాన్ని వెలుగులోకి తెచ్చి సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేశారు. ప్రముఖ పర్యావరణవేత్త దివంగత చిదంబరంతో కలిసి ప్రజా ఉద్యమాలను నిర్వహించారు. సుప్రీంకోర్టు, గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి కాలుష్య నివారణకు అనేక ఆర్డర్లు తీసుకొచ్చి కాలుష్య పీడిత గ్రామాలకు ఉచితంగా తాగునీరు అందేలా కృషిచేశారు. 'పటాన్‌చెరు ఏ హెల్ ఆన్ ఎర్త్' పుస్తకాన్ని రాసి అంతర్జాతీయ సింపోజియమ్‌లలో పత్రాలను సమర్పించారు. స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు అందజేయాలని పారిశ్రామికవేత్తలతో, ప్రభుత్వాలతో పోరాటం కొనసాగించారు. వృద్ధాప్యం రావడంతో ఆయన నందిగామ గ్రామం కేంద్రంగా గోశాల ఏర్పాటు చేసి గోవులకు సేవలందిస్తూ జీవించారు. ఈ ఏడాది జూలై 5న డాక్టర్ కిషన్‌రావుకు నల్సార్ యూనివర్సిటీ ఎర్త్ ఎన్విరాన్‌మెంట్ నేషనల్ అవార్డును అందజేసింది. అనారోగ్యంతో ఆయన మంచానికే పరిమితం కావడంతో ఆయన సోదరుడు అవార్డును స్వీకరించారు. డాక్టర్ కిషన్‌రావు మృతిపై పర్యావరణవేత్తలు, ప్రకృతి ప్రేమికులు, ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



డీఎస్పీల ప్రమోషన్లకు రంగం సిద్ధం

- 78మంది పదోన్నతికి ప్రపోజల్

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): పోలీసుశాఖలో మరోసారి పదోన్నతులకు రంగం సిద్ధమైంది. ఈసారి 78 మంది డీఎస్పీ స్థాయి(సివిల్) అధికారులకు అడిషనల్ ఎస్పీ(నాన్‌కేడర్)లుగా ప్రమోషన్ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. 78 మంది అర్హులైన డీఎస్పీల లిస్టును ఏసీబీ క్లియరెన్స్ కోసం డీజీ సీవీ ఆనంద్‌కు డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) పంపినట్టు తెలిసింది. అర్హులైన డీఎస్పీలకు పదోన్నతులు కల్పించాలని అన్ని కమిషనరేట్లు, ఎస్పీ ఆఫీసులకు డీజీపీ కార్యాలయం లేఖ పంపింది. ఇదే విషయాన్ని మల్టీజోన్ ఐజీలకు, ట్రైనింగ్ డైరెక్టర్‌కు ఫ్యాక్స్ ద్వారా తెలియజేసింది. లిస్టులో జతచేసిన అధికారుల ట్రాక్ రికార్డులు, క్రిమినల్ చర్యలను దృష్టిలో పెట్టుకొని పదోన్నతులపై తుది జాబితాను డీజీపీ కార్యాయాలనికి ఏసీబీ అధికారులు అందజేయనున్నారు.

ముగ్గురు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

- భర్త తాగుడుతో విసుగుచెంది బలవన్మరణం
- నలుగురి మృతితో ఉలిక్కిపడిన రుద్రారం



ఆంజనేయులు కుటుంబం (ఫైల్)

పటాన్‌చెరు, సెప్టెంబర్ 1: భర్త తాగుడుతో విసుగుచెందిన ఆ ఇల్లాలు.. తన ముగ్గురు పిల్లలకు విషమిచ్చి చంపి తానూ ఆత్మహత్య చేసుకున్నది. ఒకే కుటుంబంలో నలుగురు చనిపోవడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొన్నది. ఈ ఘటన ఆదివారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలో చోటుచేసుకున్నది. సదాశివపేట మండలం ఆత్మకూర్‌కు చెందిన ఆంజనేయులు (35) ఇస్నాపూర్‌లో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య సువర్ణ (28), జస్వంత్ (5), చిన్మయి (3), చిత్ర (3) పిల్లలు ఉన్నారు. చిన్మయి, చిత్ర కవల పిల్లలు. ఆంజనేయులు మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగొద్దని భార్య చాలా సార్లు వారించడంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. కొంతకాలంగా ఆంజనేయులు ఆరోగ్యం దెబ్బతిన్నది. కుటుంబ కలహాలు పెరిగాయి. మెకానిక్ పని కూడా సరిగ్గా చేయడం లేదు. ఆంజనేయులును రిహాబిలిటేషన్ సెంటర్‌లో చేర్చారు. ఆర్థిక ఇబ్బందులు తీవ్రం కావడంతో విసుగుచెందిన సువర్ణ ముగ్గురు పిల్లలకు ఆదివారం మధ్యాహ్నం విషం ఇచ్చి చంపేసింది. పిల్లలు చనిపోయారని నిర్ధారించుకున్నాక.. తానూ గదిలోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకున్నది. ఇరుగుపొరుగువారు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తలుపులు పగులకొట్టి గది లోపలికి వెళ్లి చూసేసరికి తల్లి, ముగ్గురు పిల్లలు విగతజీవులుగా ఉన్నారు. పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు దవాఖానకు తరలించారు.

సీఎంఆర్‌ఎఫ్ స్కాంలో ఇద్దరి అరెస్టు

- పోలీసుల అదుపులో ఆర్‌ఎంపీ, ప్రైవేట్ దవాఖాన సూపర్‌వైజర్
- నకిలీ బిల్లులు, రబ్బర్‌స్టాంపులు, కంప్యూటర్లు హార్డ్‌డిస్క్‌లు స్వాధీనం

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): నకిలీ బిల్లులు సమర్పించి సీఎంఆర్‌ఎఫ్ నిధులను స్వాహా చేసిన కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. వారిలో మిర్యాలగూడలో ఆర్‌ఎంపీ వైద్యునిగా పని చేస్తున్న గొట్టి గిరి, నవీన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సూపర్‌వైజర్ లేకిరెడ్డి సైదిరెడ్డి ఉన్నట్టు సీఐడీ డీజీ శిఖాగోయెల్ ఆదివారం వెల్లడించారు. వారి నుంచి పలు నకిలీ మెడికల్ బిల్లులు, రబ్బర్ స్టాంపులు, కంప్యూటర్లు, హార్డ్‌డిస్క్‌లు, ప్రింటర్లు, లెటర్‌హెడ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నవీన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌తోపాటు నల్లగొండలోని అమ్మ హాస్పిటల్ పేరుతో నిందితులు 19 నకిలీ బిల్లులతో ప్రభుత్వానికి దరఖాస్తులు పంపి డబ్బులు పొందారని, ఆ బిల్లులను తయారు చేసినవారికి రూ.4 వేల చొప్పున ఇచ్చారని పోలీసులు గుర్తించారు. నిందితులను నల్లగొండలోని స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరుపర్చి, రిమాండ్ కోరామని, ఈ కుంభకోణంలో ప్రమేయం ఉన్న ఇతర నిందితుల కోసం ఆరా తీస్తున్నామని శిఖాగోయెల్ తెలిపారు.

హెచ్‌ఏఎల్ ఎండీగా హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి



డాక్టర్ సునీల్

కొండాపూర్, సెప్టెంబర్ 1: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి డాక్టర్ డీకే సునీల్ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులైనట్టు వర్సిటీ యాజమాన్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. వర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ విభాగం సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎలక్ట్రానిక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీలో 2019లో ప్రొఫెసర్ సామ్రాట్ ఎల్ సబత్ పర్యవేక్షణలో సునీల్ పీహెచ్‌డీ పూర్తి చేశారు. సునీల్‌కు వర్సిటీ యాజమాన్యం అభినందనలు తెలిపింది.

రాబడి

ఈటీఎఫ్‌లంటే ఏంటో తెలుసా?

- ఈటీఎఫ్‌లు ఈక్విటీ, డెట్, కమోడిటీస్ వంటి వివిధ రకాల సాధనాల కోసం అందుబాటులో ఉంటాయి.
- సాధారణంగా వీటికయ్యే వ్యయభారం తక్కువే. అయితే ఈటీఎఫ్‌ల క్రయవిక్రయాల్లో బ్రోకరేజీ ఫీజులు, ఇతరత్రా ట్రేడింగ్ ఖర్చులు తప్పవు.
- ట్రేడింగ్ జరిగే రోజున ఈటీఎఫ్‌లను నాటి మార్కెట్ ధరల వద్దే కొనవచ్చు.. అమ్మవచ్చు.
- ఒక సూచీ ప్రదర్శనను ప్రతిబింబించడమే ఈ ఈటీఎఫ్‌ల లక్ష్యం.
- మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే దేశంలో అందుబాటులో ఉన్న ఈటీఎఫ్‌లు పరిమితం.
- ఆన్‌లైన్ బ్రోకర్లు, సంప్రదాయ బ్రోకర్-డీలర్ల ద్వారా ట్రేడ్ అవుతాయి.
- ఇండివీడ్యువల్స్ తమ రిటైర్మెంట్ ఖాతాల్లోనూ వీటిని కొనవచ్చు.





లాభాల స్వీకరణకు అవకాశం!

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస లాభాల్లో దూసుకుపోతున్నాయి. మదుపరులు కొనుగోళ్ల జోష్‌లో ఉన్నారు. ఫలితంగానే గత వారం సూచీలు ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడ్డాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,279.56 పాయింట్లు లేదా 1.57 శాతం ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా 82,365.77 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 412.75 పాయింట్లు లేదా 1.66 శాతం ఎగిసి తొలిసారి 25,235.90 దగ్గర ముగిసింది. కాగా, మార్కెట్లు నూతన గరిష్ఠాల వద్ద ఉండటంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేసే వీలుందని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ వారం కరెక్షన్‌కు అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. కాగా, అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,850 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,500-25,700 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.





ఇలా.. ప్లాన్ చేసుకోండి

సీనియర్ సిటిజన్ల పెట్టుబడికున్న 10 అత్యుత్తమ మార్గాలివే

ఆర్థిక ప్రణాళికలో పొదుపు, పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. అవగాహన, వివేకంతో ముందుకెళ్తే ఆకర్షణీయ స్థాయిలో రాబడులను పొందవచ్చు. ఇక సాధారణ సిటిజన్స్‌తో చూస్తే సీనియర్ సిటిజన్ల పెట్టుబడులకున్న 10 అత్యుత్తమ మార్గాలను ఒక్కసారి పరిశీలిస్తే వాటిలో..

1

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం

పదవీ విరమణ పొందినవారు ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల గురించే ఆరా తీస్తూ ఉంటారు. సురక్షిత, స్థిరమైన ఆదాయ వనరును కోరుకుంటారు. అలాంటి వాటిలో సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం (ఎస్‌సీఎస్ఎస్) ఒకటి. ఇదో కేంద్ర ప్రభుత్వ పథకం. పూర్తిగా రిస్క్ లేని రుణ సాధనం. 60 ఏండ్లు, ఆపై వయసువారి కోసమే తెచ్చారు. ప్రస్తుత వడ్డీరేటు 8.20 శాతం. ప్రతీ 3 నెలలకోసారి సవరిస్తారు. కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ఠం రూ.30 లక్షలు. ఈ స్కీం గరిష్ఠ పరిమితి 5 ఏండ్లు. ఈ పెట్టుబడి మొత్తాలు పన్ను పరిధిలోకి రావు. అయితే వీటిపై పొందే వడ్డీ ఆదాయం వారివారి ఐటీ స్లాబుల ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది.

2

పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం

తపాలా శాఖ అందించే ఈ స్కీంలో పెట్టుబడులకుగాను నెలనెలా నిర్ణీత స్థాయిలో వడ్డీ ఆదాయాన్ని పొందవచ్చు. రిటైర్మెంట్ వయసులో ఆర్థిక భద్రతకు చక్కని అవకాశం. అయితే సీనియర్ సిటిజన్లకే కాదు.. 10 ఏండ్లు దాటిన భారతీయ పౌరులెవరైనా ఇందులో పెట్టుబడులకు దిగవచ్చు. దీని వార్షిక వడ్డీరేటు 7.40 శాతంగా ఉన్నది. ప్రతీ 3 నెలలకోసారి మారడానికి ఆస్కారం ఉన్నది. కనీస పెట్టుబడి రూ.1,500. గరిష్ఠ పెట్టుబడి రూ.4.5 లక్షలు. జాయింట్ అకౌంట్‌లో రూ.9 లక్షలదాకా పెట్టుబడులు పెట్టవచ్చు. కాలపరిమితి 5 ఏండ్లు. ఆ తర్వాత మరో 5 ఏండ్లు కూడా పొడిగించుకోవచ్చు. వడ్డీ ఆదాయంపై పన్నులుంటాయి.

3



ఫిక్స్‌డ్ డిపాజిట్లు

రెగ్యులర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లే (ఎఫ్‌డీ) ఇవి. బ్యాంకుల్లో సాధారణ పౌరులతో పోల్చితే సీనియర్ సిటిజన్లకు ఆయా కాలపరిమితుల ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు ఎక్కువగా లభిస్తాయి. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఎఫ్‌డీలలో పెట్టుబడులకు పన్ను మినహాయింపున్నది. ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అలాగే నెలవారీగా, 3 నెలలవారీగా, వార్షిక ప్రాతిపదికన నగదునూ పొందవచ్చు. మార్కెట్ రిస్క్‌లకు దూరంగా ఉంటూ సురక్షితమైన పెట్టుబడులను, స్థిరమైన ఆదాయాన్ని ఆశించేవారు ఈ ఎఫ్‌డీలను పరిశీలించవచ్చు.

4



సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్

సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్), ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఫీచర్లుంటాయి. ఒకేసారి పెద్ద మొత్తాల్లో డిపాజిట్లకు బదులు చిన్నచిన్న మొత్తాల్లోనూ డిపాజిట్లకు ఇందులో వీలుంటుంది. నెలనెలా మనం చేసే ప్రతీ డిపాజిట్‌ను ఓ ఎఫ్‌డీగానే చూస్తారు. తక్కువలో తక్కువగా రూ.5వేలతో ఈ మంత్లీ డిపాజిట్లను ప్రారంభించవచ్చు. ఇక ఇందులో రెండు వేరియంట్లుంటాయి. ఒకటి సింగిల్ మెచ్యూరిటీ స్కీం, మరొకటి మంత్లీ మెచ్యూరిటీ స్కీం. వార్షిక వడ్డీరేట్లు 8.50 శాతందాకా ఉన్నాయి. ఏడాది నుంచి ఐదేండ్ల కాలపరిమితితో పెట్టుబడులు పెట్టవచ్చు.

5




నేషనల్ పెన్షన్ సిస్టమ్

నేషనల్ పెన్షన్ సిస్టమ్ అనేది కేంద్ర ప్రభుత్వం అందించే రిటైర్మెంట్ సేవింగ్స్ స్కీం. పదవీ విరమణ కాలంలో స్థిరమైన ఆదాయ వనరుగా ఉంటుంది. సంఘటిత, అసంఘటిత రంగాల్లోని ఉద్యోగులకు ఇది చక్కని పథకమనే చెప్పవచ్చు. ఉద్యోగుల నుంచి, వారి సంస్థల తరపు నుంచి ఇందులోకి నగదు జమవుతుంది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ, సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద పన్ను ప్రయోజనాలు దక్కుతాయి.

6

సీనియర్ సిటిజన్ ఎఫ్‌డీ స్కీం



60 ఏండ్లు, ఆపై వయసున్నవారికి రెగ్యులర్ ఇన్‌కమ్‌ను అందించడానికి వచ్చినదే ఈ సీనియర్ సిటిజన్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) స్కీం. బ్యాంకులను బట్టి డిపాజిట్లకున్న కనీస, గరిష్ఠ పరిమితులు ఆధారపడి ఉంటాయి. కాలపరిమితి 7 రోజుల నుంచి 10 ఏండ్లదాకా ఉంటుంది. వార్షిక వడ్డీరేట్లు 9.75 శాతం వరకున్నాయి. అత్యవసర పరిస్థితిలో ఎఫ్‌డీని వెనక్కి తీసుకోవచ్చు. అయితే జరిమానాలను చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఎఫ్‌డీల తనఖాపై రుణాలనూ పొందవచ్చు. మీ డిపాజిట్లపై రుణ మొత్తాలు ఆధారపడి ఉంటాయి. రూ.50వేల దాకా పన్ను మినహాయింపుంటుంది.


7



ట్యాక్స్ ఫ్రీ బాండ్లు

ట్యాక్స్ ఫ్రీ బాండ్లలో పెట్టుబడి పెట్టేవారికి చెల్లించే వడ్డీకి పన్ను మినహాయింపు ఉంటుంది. ప్రభుత్వ రంగ కార్యక్రమాలు, ప్రభుత్వ సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు ఈ బాండ్లను ప్రభుత్వం తరపున జారీ చేస్తాయి. కాబట్టి ఇదో భద్రత కలిగిన పెట్టుబడి సాధనం.

8



ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం (ఈఎల్ఎస్ఎస్) అనేది ఓ ట్యాక్స్-సేవింగ్ మ్యూచువల్ ఫండ్ స్కీం. స్టాక్ మార్కెట్లు లేదా వాటి సంబంధిత సాధనాల్లో పెట్టుబడులను పెట్టడం జరుగుతుంది. అయితే ఇందులో రిస్క్ ఉంటుందన్న విషయం మరువద్దు. అయినప్పటికీ వేచిచూస్తే పెట్టుబడులపై మంచి ఆదాయాన్ని సొంతం చేసుకోవచ్చు. తక్కువ రిస్కుతో ఎక్కువ రాబడులను అందుకోవచ్చు మరి. ఇక ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఏటా రూ.1.5 లక్షల దాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అయితే వీటిల్లో లాకిన్ పీరియడ్స్ ఉంటాయి.

9



మ్యూచువల్ ఫండ్స్

మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌లకు లోబడి ఉంటాయి. పెట్టుబడులు పెట్టే ముందే సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం మంచిది. నిజానికి రిస్క్‌లకు దూరంగా ఉండాలనుకునే మదుపరులకు ఇవి పనికిరావు. ఈక్విటీ, రుణ మార్కెట్లలో మీ సొమ్మును మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్ట్ చేయడమే ఇందుకు కారణం. అయితే ధైర్యంతో నిర్ణయాలు తీసుకుంటే దీర్ఘకాలంలో ఆకర్షణీయ రాబడులనే అందిస్తాయని చెప్పవచ్చు. కాబట్టి నిపుణుల సలహా మేరకు మీ ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోలో మ్యూచువల్ ఫండ్స్‌కూ కొంత భాగం ఇవ్వవచ్చు. లాభాలపై మూలధన లాభాల పన్నులుంటాయి.

10

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

సీనియర్ సిటిజన్లకు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) కూడా ఆకర్షణీయమైన పెట్టుబడి సాధనాల్లో ఒకటి. ఇదో సురక్షిత పెట్టుబడి మార్గం. పీపీఎఫ్‌లో పెట్టుబడి ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదాకు అవకాశాన్నిస్తుంది. పీపీఎఫ్ ఖాతా పరిమితి 15 ఏండ్లు.

స్థానిక ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే!



కేసీఆర్ మళ్లీ రావాలి

- తెలంగాణ తిరుగులేని శక్తిగా ఎదగాలి
- రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ అనిల్

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ మళ్లీ రావాలని, తెలంగాణ తిరుగులేని శక్తిగా ఎదగాలని రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. సుదీర్ఘకాలం పోరాడి తెలంగాణను సాధించి, రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపిన కేసీఆర్ మార్గదర్శనం అవసరాన్ని సమాజం గుర్తించిందని పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం పరితపించిన సాధారణ పౌరుడిగా కేసీఆర్ తిరిగి తెలంగాణకు దిశానిర్దేశం చేయాలని ఆకాంక్షించారు. మరో పది, పదిహేనేండ్లు కేసీఆర్ తెలంగాణకు మార్గదర్శనం చేయాలని అభిలషించారు.

మొదటిపేజీ తరువాయి...

పరిస్థితి ఏమిటని నిలదీస్తున్నారు. రుణమాఫీ అయిన వారి కంటే కానీ వారే ఎక్కువగా ఉన్నారని, ఆ ప్రభావం ఎన్నికలపై పడుతుందని క్షేత్రస్థాయి క్యాడర్ సమాచారం ఇచ్చినట్టుగా పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఎన్నికలకు వెళ్లాలంటే రాబోయే రోజుల్లో రుణమాఫీకి రూ.14 వేల కోట్లు, రైతు భరోసాకు దాదాపు రూ. 10 వేల కోట్లు అవసరమవుతాయని వ్యవసాయ అధికారులు లెక్కలు వేశారు. వీటికే మొత్తం రూ.24వేల కోట్ల వరకు అవసరమవుతాయి. హామీ ఇచ్చినట్టుగా ఆసరా పింఛన్‌ను రూ. 4 వేలకు పెంచాల్సి ఉంటుంది. దీనికి అదనంగా రూ. 1000 కోట్లు అవసరమవుతాయని తేల్చారు. వీరి సంఖ్య దాదాపు 45 లక్షలుగా ఉన్నది. కాబట్టి పెన్షన్ పెంచి ఇవ్వకుంటే ఆ ప్రభావం ఎన్నికలపై పడుతుందని, వారు బీఆర్ఎస్ వైపు మళ్లే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. దీనికితోడు ఉద్యోగులకు ఐదు డీఏలు, కల్యాణలక్ష్మిలో భాగంగా తులం బంగారం ఇలా అనేకం అంశాలు ప్రభుత్వం మెడపై కత్తిలా వేలాడుతున్నాయి. ప్రజలు ఇంత ఆగ్రహంగా ఉన్న సమయంలో ఎన్నికలకు వెళ్తే పార్టీకి ప్రతికూల ఫలితాలు వస్తాయని పార్టీ సీనియర్లు, ఎమ్మెల్యేలు చెప్పినట్టు తెలిసింది.



ఎన్నికలను త్వరగా నిర్వహిద్దామని మొదట అనుకున్నా, ఇప్పట్లో ఎన్నికల జోలికి వెళ్లవద్దన్న ఆలోచన చేసి వెనక్కి తగ్గినట్టుగా చెప్తున్నారు. దీంతో వచ్చే ఏడాది మొదటి త్రైమాసికం కల్లా రుణమాఫీ, రైతు భరోసా నిధులను జమచేసి ఆ తరువాత ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్టుగా సమాచారం.

కొత్త కమిషన్‌తో మరింత ఆలస్యం?

రెండు రోజుల క్రితమే బీసీ కమిషన్ గడువు ముగిసింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సుప్రీంకోర్టు ఆదేశించిన విధంగా ట్రిపుల్ టెస్ట్‌కు డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఉన్న కమిషన్ గడువు పొడిగించి ఉంటే త్వరగా నివేదిక వచ్చి ఉండేది. కానీ ఆ కమిషన్ గడువు పొడగించలేదు. ఇది కూడా ఎన్నికలు ఇప్పట్లో లేవనడానికి ఆధారమని చెప్తున్నారు. కొత్త కమిషన్ నియామకానికి ప్రభుత్వం మొగ్గు చూపినట్టుగా సమాచారం. కమిషన్ నియామకం తరువాత ట్రిపుల్ టెస్ట్, సుప్రీంకోర్టు తీర్పు, ఇతర రాష్ట్రాలు ఏ విధంగా చేశాయి? తదితర అంశాలపై అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఈ తరువాత గ్రామాల్లో ఓటరు జాబితా ఆధారంగా కానీ, లేదంటే బీసీ గణన ప్రకారం కానీ రిజర్వేషన్ ఖరారు చేయాల్సి ఉంటుంది. ఈ నెల 21 తరువాత తుది ఓటరు జాబితా ప్రచురిస్తారు. ఆ తరువాత ఓటరు జాబితా ప్రకారమా లేదా జనాభాలో బీసీ గణన చేయడమా అన్నది నిర్ణయించాల్సి ఉంటుంది. కులగణన అయితే కనీసం ఆరేడు నెలల సమయం పడుతుందని, ఓటరు జాబితా ప్రకారం తీసుకున్నా కనీసం రెండు నెలల సమయం పడుతుందని బీసీ సంఘాల నాయకులు అంచనా వేస్తున్నారు. ఇదంతా కాకుండా హడావుడిగా మమ అనిపించేస్తే జరిగే పొరపాట్లపై కోర్టుకు వెళ్లే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకసారి కోర్టుకు వెళ్తే ప్రక్రియ మొదటికి వచ్చే అవకాశం ఉందని, ఇప్పట్లో ఎన్నికలు ఉండవని చెప్తున్నారు. ఇలా ఏ విధంగా చూసినా స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో ఉండవని, వచ్చే సంవత్సరమే జరిగే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

42 శాతానికి పడని అడుగులు

రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై ఎలాంటి స్పష్టత రాలేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు ఇస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో అర్భాటంగా ప్రకటించారు. అచరణకు వచ్చేసరికి ప్రభుత్వం కుంటి సాకులు చెప్తున్నదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ప్రభుత్వపరంగా రిజర్వేషన్లు సాధ్యం కాదని, పార్టీపరంగా రిజర్వేన్లు ఇద్దామని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడాన్ని బట్టి చూస్తే బీసీలకు గతంలో కంటే రిజర్వేషన్లు పెరిగే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు.

వ్యవస్థను నిర్మించిన కేసీఆర్‌పై విమర్శలా?

- ప్రజలకు కాంగ్రెస్ ఏం చేసింది
- ఒక్క హామీనైనా అమలు చేశారా?
- మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మాజీమంత్రి ఈశ్వర్

కరీంనగర్ కార్పొరేషన్, సెప్టెంబర్ 1: ఉమ్మడి రాష్ట్రంలో ధ్వంసమైన వ్యవస్థలను.. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కేసీఆర్ రాజ్యాంగబద్ధంగా నిర్మించారని, అలాంటి గొప్ప నాయకుడిపై విమర్శలు చేస్తారా? అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఫైర్ అయ్యారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని ఆ పార్టీ నాయకులను నిలదీశారు. ఎన్నికల హామీల్లో ఒక్కటైనా పూర్తిస్థాయిలో అమలు చేశారా? అని ప్రశ్నించారు. ఏ ముఖం పెట్టుకొని కేసీఆర్ ప్రజల్లోకి వస్తారని ప్రశ్నిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. అసలు అధికారంలో ఉండి ఏం ఘనకార్యం చేశారని మంత్రులు, కాంగ్రెస్ నేతలు ప్రజల్లో తిరుగుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క గ్రామంలోనైనా రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేశారా? అని నిలదీశారు. రాష్ట్రంలో 40 శాతానికి మించి రుణమాఫీ కాలేదని చెప్పారు. కేసీఆర్ హయాంలో రూ.16 వేల కోట్లతో 30 లక్షల మందికి, రూ.19 వేల కోట్లతో 37 లక్షల మంది రైతులకు రుణమాఫీ అందించామని గుర్తుచేశారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ రవీందర్‌సింగ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పాలమాకులలో హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తదితరులు

ఆ 'టీచర్ల'ను సస్పెండ్ చేయాలి

రంగారెడ్డి కలెక్టర్‌కు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆదేశం

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 1 : ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులను కులం పేరుతో అవమానించిన టీచర్లను వెంటనే సస్పెండ్ చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఆదివారం శంషాబాద్ మండలం పాలమాకుల కస్తుర్బా గాంధీ హాస్టల్‌ను వెంకటయ్య సందర్శించారు. హాస్టల్‌లోని వాష్‌రూమ్‌లు, డైనింగ్ హాల్‌తోపాటు భోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. విద్యార్థినులను అవమానించిన టీచర్ ప్రశాంతి, ఎస్‌వో మాధవి, ఏఎన్‌ఎం శాంతమ్మలను సస్పెండ్ చేయాలని కలెక్టర్‌ను ఆదేశించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాబోధన సరిగా లేదని విద్యార్థులు తన దృష్టికి తెచ్చినట్టు చెప్పారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించడంతోపాటు వారికి నాణ్యమైన విద్య, భోజనం అందించాలని ఆదేశించారు. పిల్లలకు ప్రతిరోజూ ఫిల్టర్ నీళ్లు ఇవ్వాలని, మూత్రశాలలు పెంచాలని సూచించారు. అనంతరం డీఈవో, ఆర్డీవో, ఎస్సీ డీడీలతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులతోపాటు దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ తదితరులు ఉన్నారు.

చేపపిల్లల పంపిణీకి స్పందన కరువు

- ఐదు జిల్లాలకు టెండర్లు శూన్యం
- మిగిలిన జిల్లాలకూ నామమాత్రమే
- 27 జిల్లాలకు 84 టెండర్లు దాఖలు
- ఆగస్టు ముగిసినా సర్కారు మీనమేషాలు
- ఆలస్యమైతే చేపల పెరుగుదలకు ఇబ్బందే
- ఈసారి రొయ్యపిల్లల పంపిణీ లేనట్టే



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఉచిత చేపపిల్లల పంపిణీ టెండర్లకు స్పందన అంతంత మాత్రంగానే లభించింది. నిరుటి బిల్లులు చెల్లించకపోవడంతో పంపిణీదారులు పెద్దగా ముందుకు రాలేదు. దీంతో 5 జిల్లాలకు కనీసం ఒక్క టెండర్ కూడా దాఖలు కాలేదు. ఇక మిగిలిన జిల్లాలకు కూడా నామమాత్రంగానే టెండర్లు దాఖలైనట్టు తెలిసింది. ఈ ఏడాది హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో ఉచితంగా 85 కోట్ల చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ గతంలో రెండుసార్లు టెండర్లను పిలిచింది. అప్పట్లో కేవలం 3 టెండర్లు మాత్రమే రావడంతో మరోసారి టెండర్లను ఆహ్వానించి, ఈ నెల 13 వరకు గడువు ఇచ్చింది. ఆ గడువు ముగియడంతో టెండర్లను ఓపెన్ చేసింది. వాటిలో మెదక్, సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట జిల్లాలకు కనీసం ఒక్క టెండరు కూడా రాలేదని తెలిసింది. మిగిలిన 27 జిల్లాలకు 84 టెండర్లు దాఖలైనట్టు సమాచారం. అంటే.. సగటున ఒక్కో జిల్లాకు 3 టెండర్లు మాత్రమే దాఖలయ్యాయి. నిరుడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏకంగా 140 టెండర్లు వచ్చాయి. ఈ ఏడాది టెండర్లు తక్కువ దాఖలవడంతో చేపల పిల్లల కొనుగోలు ధర పెరగవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం టెండర్లు రాని జిల్లాలను పక్క జిల్లాల టెండర్‌దారులకు అప్పగించాలని మత్స్యశాఖ యోచిస్తున్నట్టు తెలిసింది.

ఆగస్టు పూర్తయింది.. పంపిణీ ఎప్పుడు?

వాస్తవానికి ఈ ఏడాది ఇప్పటికే చెరువుల్లో చేపపిల్లలను విడుదల చేయాల్సి ఉన్నది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా టెండర్లకే పరిమితమవడంతో ఈ ప్రక్రియ పూర్తయ్యేదెప్పుడు? చేపపిల్లల పంపిణీని ప్రారంభించేదెప్పుడు? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే సమయం మించిపోయిందని, మరింత ఆలస్యమైతే చేపపిల్లల పెరుగుదలపై ప్రభావం పడి లాభాలు తగ్గుతాయని మత్స్యకారులు చెప్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చొరవతో టెండర్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, చేపపిల్లల పంపిణీని ప్రారంభించాలని కోరుతున్నారు.

రొయ్యపిల్లల పంపిణీకి స్వస్తి

ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం రొయ్యపిల్లల పంపిణీకి స్వస్తి పలికింది. నిరుటి వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేపపిల్లలతోపాటు రొయ్యపిల్లలను కూడా పంపిణీ చేసింది. కానీ, ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం రొయ్యపిల్లల పంపిణీకి టెండర్లు పిలవలేదు. దీంతో ఈసారి పంపిణీ లేనట్టేనని మత్స్యశాఖ వర్గాలు చెప్తున్నాయి.

బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే

- ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి
- బీసీ నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్
- ఆమరణ దీక్ష చేస్తున్న బీసీ నేతలకు పరామర్శ
- ఎమ్మెల్యే కూనంనేని సహా అన్ని పార్టీల నేతల మద్దతు



హైదరాబాద్, సెప్టెంబర్1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టి, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లపై వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల పెంపు, కులగణన కోసం డిమాండ్ చేస్తూ గాంధీ దవాఖానలో 8వ రోజు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బీసీ హిందూ మహాసభ అధ్యక్షుడు సిద్దేశ్వర్, బీసీయూత్ అధ్యక్షుడు సంజయ్‌ను ఆదివారం ఆయన పరామర్శించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కులగణన చేసి రిజర్వేషన్లను పెంచడానికి అభ్యంతరమేమిటని ప్రశ్నించారు. వీటిని పట్టించుకోకపోవడమంటే బీసీల వ్యతిరేక చర్యేనని మండిపడ్డారు. బీసీ నేతలు 8 రోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బీసీల పట్ల వివక్ష కనిపిస్తున్నదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసి, బీసీ రిజర్వేషన్ల పెంపు నిర్ణయం ప్రకటించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఎన్నికల వాగ్దానంపై జాప్యం ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ సీనియర్ నేత హనుమంతరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేశం, బీసీ నాయకులు రవియాదవ్, బీఆర్ఎస్, సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు వారిని పరామర్శించి మద్దతు తెలిపారు.

5 నెలలుగా బిల్లుల చెల్లింపుల్లేవ్!

- మార్చి నుంచి నిలిచిన గ్యాస్, కూరగాయల బిల్లులు
- వెంటనే చెల్లించాలి అంగన్‌వాడీ టీచర్ల డిమాండ్
- దాదాపు ఏడు వేల అంగన్‌వాడీలలో పోస్టులు ఖాళీ
- పెరిగిన పనిభారంతో ఇబ్బంది పడుతున్న సిబ్బంది



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ఐదు నెలలుగా గ్యాస్, కూరగాయల బిల్లులు చెల్లించటం లేదని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్చి నుంచి ఆగస్టు వరకు చెల్లించాల్సిన బిల్లులను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని పేర్కొంటున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇవే పరిస్థితులు ఉన్నాయని స్పష్టం చేస్తున్నారు. కొన్ని జిల్లాల్లోనైతే జనవరి నుంచి ఇప్పటి వరకు బిల్లులు రావటం లేదని తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సంఘం నాయకులు చెప్తున్నారు. మంత్రులు, అధికారులను కలిసినా ప్రయోజనం లేదని, ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని సకాలంలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

పెరిగిన పనిభారం

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 35,700 టీచర్లు, 35,700 మంది హెల్పర్ పోస్టులు ఉన్నాయి. రెండు నెలల క్రితం వరకు అన్ని పోస్టులు నిండుగానే ఉన్నాయి. కాని కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన చట్టం ప్రకారం 65 ఏండ్లు దాటిన వాటిని విధుల నుంచి తొలగించారు. దాంతో 7000 వరకు ఖాళీలు ఏర్పడ్డాయి. ఆ స్థానాల్లో కొత్తవారిని ఎంపిక చేయలేదు. ఉన్నవారితోనే అదనపు సేవలు వినియోగించుకుంటున్నారు. దీంతో ఒకటి కంటే ఎక్కువ కేంద్రాల్లో టీచర్‌గా, ఆయాగా పని చేయాలంటే సాధ్యం కావటం లేదని, పనిభారం పెరుగుతున్నదని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అంగన్‌వాడీల్లో అదనపు సిబ్బందిని నియమించాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): అంగన్‌వాడీ కేంద్రాల్లో జనాభా ప్రాతిపదికన సిబ్బందిని అదనపు నియమించాలని అంగన్‌వాడీ టీచర్లు డిమాండ్ చేస్తున్నారు. చాలా అంగన్‌వాడీల్లో ఒక టీచర్, ఒక ఆయా మాత్రమే ఉండటంతో అందరికీ పోషకాహారాన్ని అందించడం సాధ్యం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలవారీగా జనాభాను లెక్కించి అంగన్‌వాడీ కేంద్రాలను హేతుబద్ధీకరించేందుకు లేదా అదనపు అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అంగన్‌వాడీల్లోని సిబ్బందితో పనులు చేయించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు రకాల యాప్‌లను ఏర్పాటు చేశాయి. పిల్లలు, తల్లులు వివరాలను ఈ రెండు యాప్‌లలో అప్‌లోడ్ చేయాల్సి వస్తుండటంతో అంగన్‌వాడీల సిబ్బందిపై పనిభారం పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోరుతున్న వివరాలను సమర్పించేందుకు రెండు రకాల యాప్‌లను కాకుండా సింగిల్ యాప్ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వర్షాలపై సోయిలేదు.. ఢిల్లీకి చక్కర్లా?

- మ్యానిఫెస్టోలో ఎన్ని హామీలు అమలు చేసిండ్రు?
- కేసీఆర్ ప్రజల్లోకి వస్తారంటేనే కాంగ్రెస్‌కు భయం
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్
- రేవంత్ భాషను మంత్రులకు నేర్పుతున్నరు
- హైడ్రాకు చట్టబద్ధత ఉన్నదా? : ఎమ్మెల్యే వివేకానంద



మీడియా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తూ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సీఎం, మంత్రులకు సోయిలేదు కానీ ఢిల్లీకి మాత్రం 20 సార్లు చక్కర్లు కొట్టారంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ విమర్శించారు. వర్షాలతో మహబూబాబాద్ జిల్లా తీవ్రంగా నష్టపోయిందని, అక్కడి ప్రజలను, రైతులను ఆదుకోవాలని కోరారు. కేసీఆర్ ప్రజలల్లోకి వస్తారని కాంగ్రెస్ నాయకులకు భయం పట్టుకున్నదని ఎద్దేవాచేశారు. ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానందతో ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల్లోకి ఎందుకు రాకూడదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చినందుకు రావద్దా అంటూ నిలదీశారు. కేసీఆర్ గురించి మాట్లాడే నైతిక హక్కు సీఎం, మంత్రులకు లేదని, కేసీఆర్ కొట్లాడి రాష్ట్రం తెస్తేనే సీఎం, మంత్రులు అయ్యారనే విషయాన్ని భట్టి గుర్తు పెట్టుకోవాలని హితవుపలికారు. కేసీఆర్‌కు ప్రజల్లో ప్రత్యేక స్థానం ఉన్నదని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు తన వంతు బాధ్యత నిర్వర్తిస్తారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మనస్తాపం చెందినప్పుడు ఏదో ఒకటి మాట్లాడుతారంటూ ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ నేతలను చూసి ప్రజలు ఓట్లెయ్యలేదని, ఆ పార్టీ మ్యానిఫెస్టోను చూసి ఓట్లేసి మోసపోయారని చెప్పారు. మ్యానిఫెస్టోలో ఉన్న హామీల్లో ఎన్ని అమలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రుణమాఫీపై వ్యవసాయ శాఖ మంత్రిని రైతులు అడ్డుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై ఇష్టంవచ్చినట్టు మాట్లాడిన రేవంత్‌రెడ్డికి సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టిందని, అయినా ఆయనలో మార్పు రాలేదని విమర్శించారు.

సీఎం పదవి అప్రతిష్టపాలు

దేశంలో అత్యంత అవినీతి ప్రభుత్వంగా తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ నిలిచిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి దిగజారి మాట్లాడుతున్నారని, సీఎం పదవిని అప్రతిష్టపాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి తన భాషను డిప్యూటీ సీఎం, మంత్రులకు నేర్పించి, వారితో కేసీఆర్‌ను తిట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవాచేశారు. రేవంత్ పాలనపై ప్రజలు విసుగుచెంది, కేసీఆర్ పాలన మళ్లీ రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. వర్షాలు, వరదలపై సీఎం, మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యటన చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద రేవంత్‌రెడ్డి స్థాయి తగ్గిపోయిందని, ఇప్పటి వరకు మంత్రులను, టీపీసీసీ చీఫ్ పదవులను ఆయన భర్తీ చేసుకోలేకపోవడమే ఇందుకు నిదర్శమని తెలిపారు. హైడ్రాకు మార్గదర్శకాలేవీ లేవని, చట్టబద్ధత కూడా లేదని, హైడ్రా పేరుతో కాంగ్రెస్ నాయకులు దందాలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం తమ్ముడి ఇంటికి నోటీసులు మాత్రమే ఇచ్చారని, పేదల ఇండ్లను మాత్రం చెప్పాపెట్టకుండా కూల్చివేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్ ఎప్పుడూ అభివృద్ధి చెందలేదని గుర్తుచేశారు. ఎక్కువ కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీయే నగరంలో అత్యధిక అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ నేతలు చెరువులను కబ్జా చేసి ఇండ్లు నిర్మించారని, రియల్ ఎస్టేట్ కోసమే ఫోర్త్ సిటీ అని ఆరోపించారు. స్క్వేర్ ఫీట్‌కు వంద చొప్పున బిల్డర్ల నుంచి వసూలు చేస్తున్నారని, కాంగ్రెస్ నేతల దందాలను బయటపెడతామని వివేకానంద ప్రకటించారు.

అధిష్ఠానానిది ఓ దారి.. అనుములది మరో దారి

మొదటిపేజీ తరువాయి...

వ్యాఖ్యలు వంటివి అధిష్ఠానం ఆగ్రహానికి కారణమని సమాచారం. ఓవైపు ఢిల్లీలో కటీఫ్.. మరోవైపు అనుభవలేమి.. ఇంకోవైపు సహకరించని మంత్రులు.. ఫలితంగా రాష్ట్రంలో పాలన గాడి తప్పిందనే భావన ప్రజల్లో మొదలైంది. దీంతో తాను 'టఫ్' సీఎంను అని నిరూపించుకునేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నట్టు విశ్లేషకులు చెప్తున్నారు. ఈ క్రమంలో తీసుకుంటున్న 'హైడ్రా' ఏర్పాటు వంటి చర్యలు బూమరాంగ్ అవుతున్నాయని, పార్టీలో చర్చ జరుగుతున్నది. తన స్వభావానికి విరుద్ధంగా ఎంత ఓపికగా ప్రయత్నాలు చేస్తున్నా అధిష్ఠానం ప్రసన్నం కావడం లేదు. సొంత పార్టీలోనే తన స్థానానికి ఎసరు పెట్టే నేతలపై రేవంత్ దృష్టిపెట్టినట్టు రాజకీయ విశ్లేషకులు చెప్పుకుంటున్నారు. కొందరితో కాంప్రమైజ్ అవుతుంటే, మరికొందరిని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు.

ఢిల్లీ మద్యం విధానంపైనా

- ఢిల్లీ మద్యం విధానం పేరుతో తెరమీదకి వచ్చిన కుంభకోణం మొత్తం బీజేపీ చేసి న కుట్ర అని కాంగ్రెస్ మొదటి నుంచీ వాదిస్తున్నది. పార్లమెంట్‌లోనూ గట్టిగా పోరాడుతున్నది. కానీ ఇందుకు విరుద్ధంగా రేవంత్‌రెడ్డి ఢిల్లీ మద్యం విధానంలో ఎమ్మెల్సీ కవితపై, కేసీఆర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేయడాన్ని అధిష్ఠానం తప్పుబడుతున్నట్టు తెలుస్తున్నది.



సుప్రీంకోర్టుపై వ్యాఖ్యలు

- సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం మధ్య కొంతకాలంగా ఘర్షణ వాతావరణం కనిపిస్తున్నదని న్యాయ నిపుణులు చెప్తున్నారు. ఇలాంటి సమయంలో కవిత బెయిల్ విషయంలో రేవంత్ చేసిన వ్యాఖ్యలు ఇరుకున పెట్టినట్టు చర్చ జరుగుతున్నది.

'బడేభాయ్'పై గుర్రు

- సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని 'బడే భాయ్' అంటూ సంబోధించడంపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు చెప్తున్నారు. కీలకమైన లోక్‌సభ ఎన్నికలకు ముందు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం, రేవంత్‌రెడ్డి బీజేపీతో టచ్‌లో ఉన్నారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో జాతీయ స్థాయిలో తమకు ఇబ్బంది ఎదురైందని వారు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

బుల్డోజర్ రాజకీయాలు

- ఉత్తరప్రదేశ్‌లో బుల్డోజర్ రాజకీయాలు మొదలైనప్పటి నుంచీ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ముఖ్యంగా రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ సందర్భం వచ్చిన ప్రతిసారి బుల్డోజర్ రాజ్ అంటూ మండిపడుతున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ బుల్డోజర్ రాజకీయాలపై కాంగ్రెస్ పోరాడుతున్నది. ఇలాంటి సమయంలో రేవంత్‌రెడ్డి హైడ్రా పేరుతో బుల్డోజర్ రాజకీయాలకు తెరలేపడంపై అధిష్ఠాన పెద్దలు గుర్రుగా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు.

సహకరించని మంత్రులు

సీఎం పదవి రేవంత్‌రెడ్డికి అప్పగించినప్పటి నుంచి పలువురు మంత్రులు ఆయనకు సహకరించడం లేదన్నది బహిరంగ రహస్యం. తమకే తెలియకుండా తమ శాఖల పరిధిలో పాలసీ నిర్ణయాలు జరిగిపోతుండడంపై కొంద రు మంత్రులు గుర్రుగా ఉన్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వొద్దనే ఉద్దేశంతో బయటికి కలిసిపోయినట్టు కనిపిస్తున్నా, విబేధాలు కొనసాగుతున్నాయని సచివాలయ వర్గాలు చెప్తున్నాయి. సీఎం రేవంత్ ఎక్కువ కాలం కొనసాగరని తమకే అవకాశం వస్తుందని పలువురు మంత్రులు తమ సన్నిహితుల వద్ద చెప్పుకుంటున్నారట. తాము సీనియర్లమని.. కనీసం మంత్రిగా ఒక్కరోజు కూడా పనిచేయని ఓ జూనియర్ తమపై పెత్తనం చెలాయించడం ఏమిటని వారు కుతకుతలాడుతున్నట్టు చెప్పుకుంటున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ నేతలు ప్రభుత్వంపై విరుచుకుపడుతుంటే.. సీఎం తప్ప మంత్రులెవరూ పెద్దగా స్పందించడం లేదని గుర్తు చేస్తున్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో మహిళలపై సీఎం చేసిన వ్యాఖ్యలకు సంబంధించి గొడవ జరుగుతున్నా మంత్రులు కల్పించుకోకపోగా.. భట్టి విక్రమార్క తన వ్యాఖ్యలతో మరింత ఆజ్యం పోశారని గుర్తు చేస్తున్నారు. ఇంకో పదేండ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని, తానే సీఎంగా ఉంటానని రేవంత్‌రెడ్డి పదే పదే చెప్పుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఆయన ఎక్కువ కాలం కొనసాగరని తరుచూ ఎవరో ఒకరు వ్యాఖ్యానిస్తున్నట్టు విశ్లేషకులు చెప్తున్నారు. రెండు రోజుల కిందటే.. 'భవిష్యత్తులో ఉత్తమ్‌కుమార్ రెడ్డి సీఎం అవుతారు' అంటూ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. ఇటీవల ఓ వ్యాపారవేత్త తనకు ఇండస్ట్రియల్ పార్క్‌లో కేటాయించిన స్థలాన్ని ఇప్పించాలని ఓ కాంగ్రెస్ నేత ద్వారా ఒక మంత్రి దగ్గరికి వెళ్లారట. విషయం మొత్తం చెప్పిన తర్వాత 'సార్.. ఈ విషయాన్ని ఓసారి సీఎం దృష్టికి కూడా తీసుకెళ్లాలా?' అని ఆ నేత అడగ్గా, ఆయనకు చెప్పేదేముంది? నేనే సీనియర్‌ను, ఆయన ఎక్కువ కాలం కొనసాగేది ఉందా? అంటూ వ్యాఖ్యానించినట్టు ప్రచారం జరుగుతున్నది. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఓ ప్రజాప్రతినిధి తనకు కొన్ని పనులు కావాలంటూ ఇద్దరు మంత్రుల దగ్గరికి వెళ్లగా.. 'నువ్వు ఎవరి ద్వారా పార్టీలో వస్తే మాకేంటి. రమ్మనడానికి ఆయనెవరు? రావడానికి నువ్వెవరు?' అంటూ ముఖం మీదే చెప్పేశారట. దీంతో ఆయనకు కాంగ్రెస్ తత్వం బోధపడి.. ఘర్ వాపసీ కోసం ప్రయత్నించినట్టు వార్తలు వచ్చాయి. ఇదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఒంటెత్తు పోకడలపై మంత్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారట. ఇటీవల తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన భూమిపూజ ఒంటరిగా చేయడాన్ని తప్పుబడుతున్నారట. హడావుడిగా రాత్రికి రాత్రి నిర్ణయం తీసుకొని తమను జిల్లాల్లో ఇరికించి, మొత్తం క్రెడిట్ కొట్టేయాలని భావించారని గుర్రుగా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. మరోవైపు ఒక సీనియర్ మంత్రి శాఖ తప్ప.. మిగతా శాఖల బిల్లులన్నీ జనవరి వరకు పెండింగ్‌లో పెట్టాలని మౌఖిక ఆదేశాలు జారీ అయినట్టు చెప్పుకుంటున్నారు. దీంతో ఒకరి ద్దరికి వెసులుబాటు ఇవ్వడం ఏమిటని మిగతా మంత్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.

అదానీతో ఒప్పందాలు

అదానీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో, బయట పోరాటం చేస్తున్నారు. కానీ, సీఎం రేవంత్ రెడ్డి ఏకంగా అదానీ సంస్థతో రూ.12వేల కోట్లకుపైగా ఒప్పందాలు చేసుకోవడం, రాష్ట్రంలోకి రెడ్ కార్పెట్ వేసి ఆహ్వానించి పాతబస్తీలో బిల్లుల వసూలు ప్రాజెక్టు అప్పగించడంతో రాహుల్‌గాంధీ నొచ్చుకున్నట్టు చెప్తున్నారు.

రేవంత్.. రివర్స్ గేమ్

రాష్ట్రంలో తను బలహీన పడుతున్న కారణంగా అధిష్ఠానాన్ని నమ్ముకోవడం కన్నా రాష్ట్ర స్థాయిలోనే తేల్చుకోవాలని రేవంత్ నిర్ణయించుకున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. సొంత పార్టీలోనే తనకు రాజకీయంగా అడ్డుగా వచ్చే నేతలపై దృష్టి పెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. ఇందులో భాగంగా ఒకరిద్దరు సీనియర్ మంత్రులతో కాంప్రమైజ్ అయినట్టు సమాచారం. రాజకీయంగా, ఆర్థికంగా బలం గా ఉండి, భవిష్యత్తులో ముప్పుగా మారుతారనుకున్న నేతలపై నజర్ పెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. ఇందులో భాగంగానే కాబోయే సీఎం, నెంబర్ 2, క్రైసిస్ మేనేజర్, చేరికల పర్యవేక్షకుడిగా చెప్పుకుంటున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని టార్గెట్ చేశారని గుసగుసలు వినిపిస్తున్నాయి. 'పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిది తెలంగాణలో డీకే శివకుమార్ పాత్ర. తర్వాతి ముఖ్యమంత్రి ఆయనే' అని ఇటీవల బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి రేవంత్‌రెడ్డి ముందుగానే పొంగులేటి సామర్థ్యాన్ని గుర్తించి స్నేహం చేశారని, కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయిందని చెప్తున్నారు. దీంతో హైడ్రాలో పొంగులేటిని ఇరికించినట్టు ప్రచా రం జరుగుతున్నది. ఇక డబ్బు, కాంగ్రెస్‌లో తరాల చరిత్ర ఉన్న ఓ దళిత ఎమ్మెల్యేను కూడా అడ్డు తప్పించుకునేందుకు హైడ్రాలో ఇరికించడం, మంత్రి పదవి ఇవ్వకుండా అడ్డుకోవడం వంటివి చేస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. 'చెరువులపై అక్రమ నిర్మాణాల్లో మా ప్రభుత్వంలోని భాగస్వాములకు చెందినవి కూడా కూల్చేస్తాం' అని సీఎం చెప్పడం దీనికి ఉదాహరణగా చెప్తున్నారు.

వాణిజ్య సిలిండర్ రూ.39 పెంపు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1: వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కిలోల సిలిండర్ ధరపై కేంద్రం రూ.39 పెంచింది. దీంతో హైదరాబాద్‌లో వాణిజ్య సిలిండర్ ధర రూ.1,919కి చేరుకుంది. మరోవైపు విమాన ఇంధన ధర కిలోలీటరుకు రూ.4,495 (4.58 శాతం) తగ్గించింది. దీంతో న్యూఢిల్లీలో కిలో లీటర్ ఏటీఎఫ్ ధర రూ.93,480కి తగ్గింది. ప్రభుత్వ చమురు సంస్థలు గృహ వినియోగ వంటగ్యాస్ ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. ప్రస్తుతం 14.2 కిలోల సబ్సిడీ సిలిండర్ ధర హైదరాబాద్‌లో రూ.855గా ఉంది.

పూరీ రత్న భాండార్‌కు బంగారు తలుపులు

పూరీ: ఒడిశాలోని శ్రీ జగన్నాథ దేవాలయంలోని రత్న భాండార్‌లో తలుపులకు రెండు వైపులా బంగారు తాపడం చేయించబోతున్నారు. జగన్నాథుని గురించి విస్తృతంగా ప్రచారం చేయడం కోసం ప్రత్యేకంగా ఓ ఎఫ్ఎం రేడియోను కూడా ప్రారంభించబోతున్నారు. శ్రీ జగన్నాథ్ దేవాలయ నిర్వహణ కమిటీ (ఎస్‌జేటీఎంసీ) ఈ నిర్ణయాలను ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.413 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది.

ఆగస్టులో జీఎస్టీ వసూళ్లు 1.75 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు ఆగస్టు నెలలో రూ.1.75 లక్షల కోట్లుగా ఉందని కేంద్రం ఆదివారం ప్రకటించింది. గత ఏడాది ఆగస్టుతో పోల్చుకుంటే వసూళ్లు 10 శాతం ఎక్కువగా ఉన్నాయని తెలిపింది. దేశీయ లావాదేవీల ద్వారా స్థూల జీఎస్టీ ఆదాయం 9.2 శాతం పెరిగి, రూ.1.25 లక్షల కోట్లకు చేరినట్లు, దిగుమతులపై పన్ను ఆదాయం 12.1 శాతం పెరిగి రూ.49,976 కోట్లకు చేరినట్లు వివరించింది. ఆగస్టులో రిఫండ్స్ రూ.24,460 కోట్లు అని, ఇది గత ఏడాది కన్నా 38 శాతం ఎక్కువ అని తెలిపింది. రిఫండ్స్‌ను సర్దుబాటు తర్వాత నికర జీఎస్టీ రెవెన్యూ రూ.1.5 లక్షల కోట్లు అని వివరించింది.

రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో విషాదం.. 11మంది మృతి

రాంచీ: జార్ఖండ్‌లో ఎక్సైజ్ కానిస్టేబుల్ నియామకాల తీరు వివాదాస్పదంగా మారింది. శారీరక దారుఢ్య పరీక్షకు హాజరైన అభ్యర్థుల్లో పలువురు ప్రాణాలు కోల్పోవటం తీవ్ర కలకలం రేపింది. ఆగస్టు 22 నుంచి 30 వరకు వివిధ కేంద్రాల్లో నిర్వహించిన టెస్ట్‌ల్లో 11 మంది అభ్యర్థులు చనిపోయారని జార్ఖండ్ పోలీస్ శాఖ ఆదివారం ప్రకటించింది. మరణాలపై దర్యాప్తు చేపట్టామని ఉన్నతాధికారి అమోల్ వీ హోమ్కార్ తెలిపారు. ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టనందువల్లే పలువురు అభ్యర్థులు ప్రాణాలు కోల్పోయారని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

మణిపూర్‌లో మళ్లీ హింస

ఇద్దరి మృతి, 9 మందికి గాయాలు

ఇంఫాల్: మణిపూర్‌లో మళ్లీ హింస రేగింది. పశ్చిమ ఇంఫాల్ జిల్లాలో అనుమానిత కుకీ తీవ్రవాదులు ఆదివారం జరిపిన డ్రోన్, తుపాకీ, బాంబు దాడుల్లో ఓ మహిళ సహా ఇద్దరు మరణించారు. గాయపడిన తొమ్మిది మందిని దవాఖానకు తరలించారు. తీవ్రవాదులు కొండలపై నుంచి లోయలోకి విచక్షణారహితంగా కాల్పులు జరిపారని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో కొన్ని ఇళ్లు కూడా దెబ్బతిన్నాయని చెప్పారు. అనుకోకుండా జరిగిన ఈ ఘటనతో గ్రామస్థులంతా సురక్షిత ప్రాంతానికి పరుగులు తీశారని పేర్కొన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేస్తే 50 వేలు

న్యూఢిల్లీ: ఢిల్లీలో ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపర్చడంతోపాటు ట్రాఫిక్ ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు సరికొత్త పథకం ప్రకటించారు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసినవారికి రూ.50 వేలు నజరానాగా ఇవ్వనున్నట్టు తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచే ఇది అందుబాటులోకి వచ్చింది. ఇందుకోసం 'ట్రాఫిక్ ప్రహరీ' యాప్‌లో ట్రాఫిక్ ఉల్లంఘనుల ఫొటోలు, వీడియోలు, వాహనం రిజిస్ట్రేషన్ నంబర్ తదితర సమగ్ర వివరాలు అప్‌లోడ్ చేయాలి.

కోర్టుల్లో వాయిదా సంస్కృతి పోవాలి

- ఓ తరం గడిచాక రేప్ కేసుల్లో తీర్పు
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన
- సుప్రీంకోర్టు కొత్త జెండా, చిహ్నం ఆవిష్కరణ



సుప్రీంకోర్ట్ కొత్త చిహ్నన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్రపతి ముర్ము, సీజేఐ జస్టిస్ చంద్రచూడ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1: రేప్ కేసుల్లో కోర్టు తీర్పులు వెలువడటానికి ఓ తరం పడుతున్నదని, కోర్టుల్లో వాయిదా సంస్కృతి పోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. న్యాయ ప్రక్రియలో సున్నితత్వం లోపించిందన్న భావన సామాన్యుల్లో ఏర్పడిందని చెప్పారు. సత్వర న్యాయం కోసం తగిన కృషి చేయాల్సిన అవసరముందని ముర్ము అభిప్రాయపడ్డారు. జిల్లా న్యాయవ్యవస్థలో పెండింగ్ కేసులు భారీగా పెరిగిపోవటం పెద్ద సవాల్‌గా మారిందని అన్నారు. ఆదివారం జిల్లా న్యాయ వ్యవస్థపై ఏర్పాటుచేసిన సదస్సులో ఆమె ప్రసంగిస్తూ, రేప్ కేసులు సహా అత్యంత హేయమైన నేరాల్లోనూ తీర్పులకు చాలా సమయం పడుతున్నదని, దీనివల్ల బాధితుల్లో సంతోషం మిగలదని ముర్ము అన్నారు. 'పెండింగ్ కేసులను తగ్గించేందుకు పరిష్కార మార్గం వెతకాలి. తరుచూ లోక్ అదాలత్‌లు నిర్వహించాలి' అని చెప్పారు. సుప్రీంకోర్టు ఏర్పాటై 75 ఏండ్లు అయిన సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం నూతన చిహ్నన్ని, జెండాను రాష్ట్రపతి ఆవిష్కరించారు. అశోక చక్ర, సుప్రీంకోర్టు భవనం, రాజ్యాంగం పుస్తకాలతో కూడిన ఈ జెండాను న్యూఢిల్లీలోని 'నిఫ్ట్' డిజైన్ చేసింది.

జాతీయస్థాయి రిక్రూట్‌మెంట్ అవసరం: సీజేఐ డీవై చంద్రచూడ్

జిల్లా కోర్టుల్లో ఖాళీల భర్తీకి జాతీయస్థాయి రిక్రూట్‌మెంట్ విధానాన్ని తీసుకురావాలని సీజేఐ డీవై చంద్రచూడ్ అన్నారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ, పెండింగ్ కేసుల పరిష్కారానికి నైపుణ్యం కలిగిన సిబ్బందిని ఆకర్షించటం అత్యంత కీలకమని చెప్పారు. దేశవ్యాప్తంగా ఒక నియామక క్యాలెండర్‌ను రూపొందించాల్సిన సమయం వచ్చిందన్నారు. జిల్లా కోర్టులు మొత్తం న్యాయవ్యవస్థకు వెన్నెముక వంటివని అన్నారు. జిల్లా స్థాయిలో జ్యుడిషియల్ ఖాళీలు 28శాతం, నాన్-జ్యుడిషియల్ ఖాళీలు 27 శాతమున్నాయని, పూర్తిస్థాయి సిబ్బంది ఉంటేనే కేసుల సత్వర పరిష్కారానికి అవకాశముంటుందని, ఈ విషయాలన్నింటిపైనా సదస్సులో చర్చించామని సీజేఐ చెప్పారు. కొన్ని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కేసులను క్లియర్ చేయడానికి యాక్షన్ ప్లాన్ చేపట్టామని, 2025లో మూడో దశ చేపడుతున్నామని తెలిపారు. జిల్లా కోర్టుల్లో మౌలిక వసతులు మారాలని, దేశంలో కేవలం 6.7 శాతం కోర్టులు మాత్రమే మహిళలకు అనుకూలంగా ఉన్నాయని సీజేఐ ఆందోళన వ్యక్తం చేశారు.

రాత్రి విధుల్లో ఉన్న నర్సుపై వేధింపులు

బెంగాల్‌లో మరో దారుణ ఘటన



కోల్‌కతా : ఆర్‌జీ కర్ దవాఖానలో పీజీటీ వైద్యురాలిపై హత్యాచారం యావత్తు దేశాన్ని కుదిపేస్తున్న తరుణంలో పశ్చిమ బెంగాల్‌లో మరో దుర్ఘటన జరిగింది. బీర్‌భూమ్‌లోని ఇలంబజార్ ఆరోగ్య కేంద్రంలో విధి నిర్వహణలో ఉన్న నర్స్‌పై రోగి దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కథనం ప్రకారం, ఆమె ఈ దవాఖానలోని ఎమర్జెన్సీ వార్డులో శనివారం రాత్రి సేవలందిస్తున్నారు. డాక్టర్ సూచనల మేరకు ఓ రోగికి సెలైన్ పెట్టేందుకు వెళ్లారు. ఆమె ఆ రోగికి సెలైన్ పెడుతుండగా, ఆయన ఆమె ప్రైవేట్ పార్ట్స్‌ను అనుచితంగా తాకాడు. మాటలతో దూషించాడు. ఆ సమయంలో ఆయన కుటుంబ సభ్యులు అక్కడే ఉన్నప్పటికీ, ఆయనను నిలువరించే ప్రయత్నం చేయలేదు. భద్రత లేకపోవడం వల్లే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న దవాఖాన అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

మైనర్ బాలికపై ల్యాబ్ టెక్నీషియన్ వేధింపులు

బెంగాల్‌లోని హౌరాలో ఓ ల్యాబ్ టెక్నీషియన్ అత్యంత నీచానికి తెగబడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, 13 ఏళ్ల బాలిక ఓ దవాఖానలో నిమోనియాకు చికిత్స పొందుతున్నది. ఆమెను శనివారం రాత్రి సీటీ స్కాన్ కోసం తీసుకెళ్లగా ఆ ల్యాబ్ టెక్నీషియన్ ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. నిందితుడు ఈ దవాఖానలో కాంట్రాక్టుపై ఉద్యోగం చేస్తున్నాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

కేరళ కాంగ్రెస్‌లో క్యాస్టింగ్ కౌచ్!

- అధిష్ఠానంతో 'సన్నిహిత' సంబంధాలు ఉన్న వారికే పదవులు
- లేకపోతే వేధింపులు.. సీనియర్ మహిళా నేత తీవ్ర ఆరోపణలు
- పార్టీ నుంచి బహిష్కరణ



రోజ్‌బెల్

తిరువనంతపురం, సెప్టెంబర్ 1: మహిళా నటులపై కొందరు హీరోలు, ఇతర సిబ్బంది లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారంటూ జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదిక ఇప్పటికే మాలీవుడ్‌ను కుదిపేస్తుండగా, తాజాగా ఆ మకిలి కాంగ్రెస్ పార్టీకి కూడా అంటుకుంది. అధినేతలతో 'సన్నిహిత' సంబంధాలు ఉన్న మహిళలకే పార్టీలో అవకాశాలు వస్తాయంటూ, లేకపోతే వేధింపులు తప్పవంటూ ఒక మహిళా కాంగ్రెస్ నేత చేసిన ఆరోపణలు ఆ పార్టీని తీవ్రంగా కుదిపేస్తున్నాయి. దీంతో ఆరోపణలు చేసిన ఆమెను పార్టీ అధిష్ఠానం పార్టీ నుంచి బహిష్కరించడం గమనార్హం.

పార్టీలోనూ అదే పరిస్థితి

'క్యాస్టింగ్ కౌచ్' ఆరోపణలు మలయాళ సినీ పరిశ్రమలో సంచలనం సృష్టించగా, కాంగ్రెస్ పార్టీలో కూడా అలాంటి పరిస్థితే ఉందని, సినీ పరిశ్రమకు అదేమీ తీసిపోదంటూ ఆ పార్టీ సీనియర్ నేత సిమీ రోజ్‌బెల్ జాన్ విమర్శలు చేశారు. తాజాగా ఆమె మీడియాతో మాట్లాడుతూ పార్టీలో చాలా మంది మహిళలు తాము ఎదుర్కొన్న బాధాకరమైన అనుభవాలను తనతో పంచుకున్నారని తెలిపారు. పార్టీకి సంబంధించిన మహిళలపై కొందరు పురుష నేతలు అభ్యంతరకరంగా ప్రవర్తించారని, పదవులు ఆశ చూపి కొంతమంది సీనియర్ నేతలు మహిళలను ప్రలోభాలకు గురిచేస్తున్నారన్నారు. వీటికి సంబంధించిన ఆధారాలు తగిన సమయంలో బయటపెడతానని చెప్పారు. తనపై ఫిర్యాదు ఇచ్చిన వారు కూడా దీనిని గమనించాలన్నారు. ఈ సందర్భంగా ఆమె ఎంపీ జేబీ మేథర్ పేరును, మరికొందరి పేర్లను ప్రస్తావిస్తూ పార్టీలో వారికి అనవసర గౌరవాలు దక్కాయని ఆరోపించారు. మహిళా కాంగ్రెస్‌లో ఎనిమిదేళ్ల క్రితమే చేరినప్పటికీ ఆమెను యూత్ కాంగ్రెస్‌కు అఖిల భారత కార్యదర్శిగా నియమిస్తే తామంతా మౌనంగా ఉండిపోయామని అన్నారు. అధిష్ఠానం ఆదేశాలను అనుసరించడానికి నిరాకరించిన మహిళలపై కొందరు నేతలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు. అదే సమయంలో కొంత మంది మహిళల పట్ల అలవిమాలిన ప్రేమను కనబరుస్తున్నారని విమర్శించారు. కాగా, ఆమె చేసిన ఆరోపణలపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేయడంతో రోజ్‌బెల్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు కేపీసీసీ తెలిపింది.

నేడు సచివాలయం ఎదుట యూడీఎఫ్ ధర్నా

జస్టిస్ హేమ కమిటీ నివేదిక ప్రకారం లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుండా వారికి రక్షణ కల్పించడానికి కేరళలోని పినరయి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఆరోపించింది. సోమవారం సచివాలయం ఎదుట నిరసన వ్యక్తం చేయనున్నట్టు తెలిపింది. ఈ ఆందోళనలో యూడీఎఫ్ కన్వీనర్ ఎంఎం హస్సేన్, కేపీసీసీ అధ్యక్షుడు కే సుధాకరన్ తదితరులు పాల్గొంటారు.



మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నా: మమ్ముట్టి

మాలీవుడ్‌లో ఇటీవల జరుగుతున్న పరిణామాలపై ప్రముఖ నటుడు మమ్ముట్టి స్పందించారు. మలయాళ చిత్ర పరిశ్రమలో 'పవర్ గ్రూప్' ఉందని జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఈ మేరకు ఫేస్‌బుక్‌లో ఒక పోస్ట్ పెట్టారు. జస్టిస్ హేమ కమిటీని నియమించిన ప్రభుత్వాన్ని ఆయన ప్రశంసిస్తూ కమిటీ చేసిన సిఫార్సులు, చూపిన పరిష్కారాలకు తాను మనస్ఫూర్తిగా మద్దతు తెలియజేస్తున్నానని తెలిపారు.

హేమ కమిటీ గురించి తెలియదు: రజనీకాంత్

కేరళ ఏర్పాటు చేసిన జస్టిస్ హేమ కమిటీ గురించి, అలాంటి కమిటీయే తమిళనాడులో ఏర్పాటు చేయాలన్న డిమాండ్ గురించి తనకు తెలియదని సూపర్‌స్టార్ రజనీకాంత్ తెలిపారు.

తాత మద్యం సేవిస్తే మనుమలపై దుష్ప్రభావం!



న్యూఢిల్లీ: మద్యపానం దుష్ప్రభావాలు తరతరాలు వెంటాడతాయని అధ్యయనాలు చెప్తున్నాయి. అతిగా మద్యం సేవిస్తే అది మనుమల జీవితాలను కూడా ప్రభావితం చేస్తుందని తెలుస్తున్నది. తాత, తండ్రి వంటి పితృ సంబంధీకులు మద్యపానానికి అలవాటు పడితే, దాని ప్రభావం వారి సంతానం ఆరోగ్యం, ప్రవర్తనలపై పడుతుందని వెల్లడైంది. టెక్సాస్ ఏ అండ్ ఎం విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మైఖేల్ గోల్డింగ్ మాట్లాడుతూ, తల్లిదండ్రులిద్దరూ అతిగా మద్యం సేవించేటట్లయితే, వారి పిల్లలు వేగంగా వృద్ధులవుతారని, వ్యాధులబారిన త్వరగా పడతారని తమ పరిశోధనలో తేలిందన్నారు. అమెరికా దేశంలోని 11 శాతం మంది యువత ఆల్కహాల్ వినియోగ రుగ్మతతో బాధపడుతున్నారు. అతిగా మద్యం సేవించడం వల్ల కాలేయ వ్యాధులు, గుండె సమస్యలు, వేగంగా వృద్ధాప్యం రావడం వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. తల్లిదండ్రులు ఈ ఆరోగ్య సమస్యలను తమ పిల్లలకు వారసత్వంగా అందిస్తారు. గర్భస్థ పిండాలకు ఈ రోగాలు సంక్రమించడం వల్ల టైప్-2 మధుమేహం, గుండె జబ్బులు త్వరగా వస్తాయి.

రూ.10 వేలు ఇస్తేనే కాపాడుతా!

వ్యక్తి ప్రాణం తీసిన గజ ఈతగాడి దురాశ

లక్నో: మనిషి ప్రాణాల కన్నా డబ్బుకే ఎక్కువ విలువ ఇచ్చే దురాశపరుడి వల్ల ఓ వ్యక్తి గంగా నదిలో మునిగి, ప్రాణాలు కోల్పోయారు. మీడియా కథనాల ప్రకారం, ఉత్తర ప్రదేశ్ ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆదిత్య వర్ధన్ సింగ్ ఆదివారం తన మిత్రులతో కలిసి ఉన్నావ్‌లోని నానామావ్ ఘాట్ వద్ద గంగా నదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. అనుకోకుండా ప్రవాహం పెరగడంతో ఆయన నీటిలో మునిగిపోయారు. అక్కడే ఉన్న గజ ఈతగాడు సునీల్ కాశ్యప్ సహాయపడటానికి ముందుకు వచ్చాడు. అయితే ఆన్‌లైన్‌లో రూ.10,000 తనకు బదిలీ అయ్యే వరకు తాను ఆయనను కాపాడబోనని చెప్పాడు. సింగ్ నదిలో కొట్టుకుపోతూ ఉంటే, రూ.10,000 తనకు బదిలీ అయ్యే వరకు సునీల్ వేచి చూశాడు. దీంతో ఆయన నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు.

ఐపీఎస్ అధికారి కుమార్తె అనుమానాస్పద మృతి



లక్నో, సెప్టెంబర్ 1: ఐపీఎస్ అధికారి కుమార్తె, లా విద్యార్థిని ఒకరు హాస్టల్ రూమ్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన యూపీలోని లక్నోలో చోటుచేసుకుంది. ఎన్‌ఐఏలో ఐజీగా ఉన్న సంతోష్ రస్తోగి కుమార్తె అనికా రస్తోగి (19) లక్నోలోని రామ్ మనోహర్ లోహియా నేషనల్ లా యూనివర్సిటీలో లా మూడో సంవత్సరం చదువుతున్నది. శనివారం రాత్రి ఆమె హాస్టల్ రూమ్‌లోని నేలపై అచేతనంగా పడి ఉండటంతో దవాఖానకు తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్టు డాక్టర్లు ప్రకటించారు. ఆమె మృతికి కారణాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆషియానా పోలీసులు తెలిపారు.

హైదరాబాద్ వస్తున్న విమానానికి బాంబు బెదిరింపు

నాగ్‌పూర్‌లో అత్యవసర ల్యాండింగ్

జబల్‌పూర్: మధ్యప్రదేశ్‌లో జబల్‌పూర్ నుంచి ఆదివారం హైదరాబాద్‌కు బయలుదేరిన 6ఈ 7308 నంబర్ విమానానికి బాంబు బెదిరింపు రావడంతో దానిని నాగ్‌పూర్‌కు మళ్లించి అత్యవసర ల్యాండింగ్ చేశారు. విమానంలోని ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నట్టు ఇండిగో అధికారులు తెలిపారు. విమానంలో బాంబు స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు జరిపారు. అయితే ఎలాంటి బాంబు లేకపోవడంతో వట్టి బెదిరింపుగా నిర్ధారించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు ఆహార, పానీయాలు అందించినట్టు అధికారులు చెప్పారు.

'మోదీ క్షమాపణలో అహంకారాన్ని చూశారా?'

ముంబై (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో సింధుదుర్గ్‌లో ఛత్రపతి శివాజీ 35 అడుగుల విగ్రహం కూలిన ఘటనపై ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఇండియా కూటమి పార్టీలు జోడ్ మారో(చెప్పుతో కొట్టండి) పేరుతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. మహా వికాస్ అఘాడీ అగ్రనేతలు శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే, నానా పటోలే ఇందులో పాల్గొన్నారు. విగ్రహం కూలిపోయేలా నిర్మించి శివాజీని అవమానించిన వారికి గుణపాఠం చెప్పడమే లక్ష్యంగా ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే తెలిపారు. విగ్రహం కూలడంపై ప్రధాని మోదీ చెప్పిన క్షమాపణలోని అహంకారాన్ని గమనించారా? అని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి పనుల్లో జరుగుతున్న అంతులేని అవినీతికి ఈ ఘటనే తార్కాణమని శరద్ పవార్ పేర్కొన్నారు.



మియాజాకీ

జపాన్ యానిమేటర్‌కు రామన్ మెగసెసె అవార్డు

మరో నలుగురికి కూడా...

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1: ఆసియన్ నోబెల్ ప్రైజ్‌గా భావించే రామన్ మెగసెసె అవార్డు 2024 సంవత్సరానికిగానూ ప్రముఖ జపాన్ యానిమేటర్ హయావో మియాజాకీని వరించింది. ఆయన స్పిరిటెడ్ వంటి చిత్రాలకు దర్శకత్వం వహించి ప్రశంసలు పొందారు. మరో ముగ్గురు వ్యక్తులకు, ఒక సంస్థకు ఈ అవార్డు దక్కింది. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేస్తామని అవార్డు నిర్వాహక కమిటీ తెలిపింది. వియత్నాం డాక్టర్ న్గుయెన్, మాజీ బౌద్ధ సన్యాసి కర్మ ఫుంట్‌షో, ఇండోనేషియాకు చెందిన ఫర్విజీ ఫర్హాన్‌కు అవార్డు లభించింది. అలాగే థాయ్‌లాండ్‌కు చెందిన రూరల్ డాక్టర్స్ మూమెంట్ సంస్థకు కూడా పురస్కారం దక్కింది.

అక్రమ నివాసితులకు 'వీసా ఆమ్నెస్టీ'

- ప్రకటించిన యూఏఈ ప్రభుత్వం
- నివాస స్థితి క్రమబద్ధీకరణకు అవకాశం
- జరిమానా చెల్లించకుండా దేశం విడిచి వెళ్లిపోవచ్చు



దుబాయ్, సెప్టెంబర్ 1: యూఏఈలో అక్రమంగా నివసిస్తున్న వారి కోసం అక్కడి ప్రభుత్వం రెండు నెలల వీసా ఆమ్నెస్టీ కార్యక్రమాన్ని ఈ నెల 1న ప్రారంభించింది. దీని ద్వారా అక్రమ నివాసితులెవరైనా తమ నివాస స్థితిని (రెసిడెన్సీ స్టేటస్) క్రమబద్ధీకరించుకోవచ్చు లేదా జరిమానా లేకుండా దేశం విడిచి వెళ్లిపోవచ్చు. ఈ నేపథ్యంలో భారత రాయబార కార్యాలయం(సీజీఐ) ఒక అడ్వైజరీ జారీ చేసింది. దాని ప్రకారం..


1. భారత్‌కు తిరిగి వెళ్లాలనుకొనేవారు ఎమర్జెన్సీ సర్టిఫికెట్(ఈసీ) కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. తమ నివాస స్థితిని క్రమబద్ధీకరించుకోవాలనుకొనేవారు స్వల్ప కాల పరిమితి పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
2. ఈసీ కోసం ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు. దుబాయ్‌లోని సీజీఐ, అవిర్ ఇమ్మిగ్రేషన్ సెంటర్‌లో సమాచార కేంద్రాలు ఏర్పాటవుతాయి. భారత రాయబార కార్యాలయంలోని సమాచార కేంద్రం ఈ నెల 2 నుంచి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పని చేస్తుంది.
3. దరఖాస్తుదారులు దరఖాస్తు సమర్పించిన మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య దుబాయ్‌లోని సీజీఐ నుంచి తమ ఈసీని తీసుకోవచ్చు.
4. దరఖాస్తుదారులు స్వల్ప కాల పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి దుబాయ్, నార్తన్ ఎమిరేట్స్‌లోని బీఎల్ఎస్ కేంద్రాలను ముందస్తు అపాయింట్‌మెంట్ అవసరం లేకుండా సంప్రదించవచ్చు. ఈ కేంద్రాలు అన్ని ఆదివారాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయి.
5. ట్రావెల్ డాక్యుమెంట్ సమాచారం కోసం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య 050-9433111 మొబైల్ నెంబర్‌లో సంప్రదించవచ్చు. ప్రతి రోజూ 24 గంటలు పనిచేసే పీబీఎస్‌కె హెల్ప్‌లైన్ 800-46342కు అయినా కాల్ చేయొచ్చు.

మాస్క్ ధరిస్తే నో ఎంట్రీ!

బెంగళూరులో మాల్స్ ముందు బోర్డులు



బెంగళూరు, సెప్టెంబర్ 1: మాస్క్ లేనిదే లోపలికి ప్రవేశం లేదు.. కొవిడ్ సమయంలో అన్ని షాపుల ముందు ఇలాంటి బోర్డులు కనిపించేవి. అయితే ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. మాస్క్ ధరిస్తే నో ఎంట్రీ అంటూ దుకాణాలు బోర్డులు పెడుతున్నాయి. బెంగళూరులో పలు సూపర్‌మార్కెట్లు, షాపింగ్స్ మాల్స్ ఎదుట ఇలాంటి బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఇటీవలి కాలంలో దొంగతనాలు పెరగడమేనని దీనికి కారణమని చెప్తున్నారు. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేసినప్పటికీ, చోరులు మాస్కులు ధరిస్తుండటంతో వారిని గుర్తించలేకపోతున్నామని, అందుకే మాస్కులతో వచ్చే వారిని అనుమతించడం లేదని కంగేరిలోని ఒక షాపింగ్ మాల్ యాజమాని తెలిపారు. ఇలా మాస్కులు ధరించి చిన్నచిన్న దొంగతనాలు చేసేవారిని పట్టుకోవడం కూడా కష్టమని ఒక పోలీస్ అధికారి చెప్పారు. ఇటీవల రామేశ్వరం కేఫ్‌లో జరిగిన బాంబు పేలుడులో కూడా నిందితుడు మాస్క్ ధరించే ఉన్నాడని, దొంగలకు ఇదొక యూనిఫాంగా మారిందని ఆయన పేర్కొన్నారు.



గంటలో మెదడు క్యాన్సర్ గుర్తించే రక్తపరీక్ష

న్యూఢిల్లీ: గ్లియోబ్లాస్టోమా అనే ప్రాణాంతక మెదడు క్యాన్సర్‌ను మొదట్లోనే కనిపెట్టగల కొత్త రక్త పరీక్షను పరిశోధకులు అభివృద్ధి చేశారు. యూనివర్సిటీ ఆఫ్ నాట్రె డామ్ పరిశోధకులు రూపొందించిన ఈ పరికరం గంటలోనే ఫలితాన్ని వెలువరిస్తుంది. కేవలం 100 మైక్రో లీటర్ల రక్తం ఈ పరీక్షకు అవసరం. 'మా సాంకేతికత నిర్దిష్టంగా గ్లియోబ్లాస్టోమా కోసం కాదు, ప్రారంభ దశలోనే దాన్ని కనిపెట్టే పరీక్షలు లేకపోవడంతో దానితోనే ప్రారంభించడం సమంజసం' అని అధ్యయనానికి నేతృత్వం వహించిన ప్రొఫెసర్ చాంగ్ తెలిపారు. ఆటోమేటెడ్ పరికరంలో ఉండే ఒక చిన్న బయో చిప్ ఎలక్ట్రోకైనెటిక్ సెన్సర్‌ను ఉపయోగించి విద్యుత్తు సాయంతో ఈ పరీక్షను నిర్వహిస్తుంది.

ఊబకాయులకు గుండె జబ్బుల ముప్పు

ముగ్గురిలో ఇద్దరి మరణాలకు ఇదే కారణం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1: ఊబకాయుల్లో ప్రతి ముగ్గురిలో ఇద్దరి మరణాలకు గుండెజబ్బులే కారణమని తాజా అధ్యయనం వెల్లడించింది. గత నాలుగు దశాబ్దాల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా స్థూలకాయుల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువై ప్రస్తుతం 100 కోట్లకు చేరిన తరుణంలో ఈ అధ్యయనం జరిగింది. లావుగా ఉండటం వల్ల గుండె వైఫల్యం, ఆకస్మిక గుండె పోటు, ధమనుల గోడల్లో కొవ్వు, కొలెస్ట్రాల్ పేరుకొనే వ్యాధి, రక్తం గడ్డ కట్టే వ్యాధి, గుండె కొట్టుకోవడంలో అసమతుల్యత కలిగే ప్రమాదం ఉందని అధ్యయనం తెలిపింది. గుండె నిర్మాణం, పనితీరుపైనా స్థూలకాయం ప్రభావం చూపుతుందని చెప్పింది. పలు సాంక్రమిక వ్యాధులు రావడానికి స్థూలకాయం ఒక కారణమని.. వివిధ అవయవాలపైనా అధిక బరువు ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపింది. మధుమేహానికి, స్థూలకాయానికి దగ్గరి సంబంధం ఉందని అధ్యయనం వివరించింది. 80-85 శాతం డయాబెటిస్ రోగులు స్థూలకాయులు లేదా అధిక బరువు ఉన్నవారని తెలిపింది. సాధారణ బరువున్న వారితో పోలిస్తే స్థూలకాయుల్లో టైప్-2 డయాబెటిస్ అభివృద్ధి కావడం మూడు రెట్లు ఎక్కువని వెల్లడించింది. 20-49 ఏండ్ల వయసు కలిగిన మగవారిలో 78 శాతం, ఆడవారిలో 65 శాతం అధిక రక్తపోటు రావడానికి అధిక బీఎంఐ కారణమై ఉండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.



వడోదరలో వరదలు జనావాసాల్లోకి మొసళ్లు

వడోదర: గుజరాత్‌లోని వడోదరలో గత నెల 27-29 మధ్య కురిసిన భారీ వర్షాల వల్ల మొసళ్లు జనావాసాల్లోకి కొట్టుకొచ్చాయి. విశ్వమిత్రి నది నీటి మట్టం పెరుగుతుండటంతో ఇవి బయటకు వచ్చేశాయి. అటవీ శాఖాధికారులు 24 మొసళ్లను పట్టుకున్నారు. విశ్వమిత్రి నదిలో దాదాపు 440 మొసళ్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అజ్వా ఆనకట్ట నుంచి నీటిని విడుదల చేయడంతో కొన్ని మొసళ్లు బయటకు వచ్చాయని వడోదర రేంజ్ అటవీ శాఖాధికారి కరణ్‌సింహ్ రాజ్‌పుత్ చెప్పారు. తాము పట్టుకున్న మొసళ్లలో అతి చిన్న దాని పొడవు రెండు అడుగులు అని, అతి పెద్దదాని పొడవు 14 అడుగులు అని వివరించారు. నీటి మట్టం తగ్గిన తర్వాత వీటిని తిరిగి నదిలో వదిలిపెడతామని చెప్పారు.

రష్యా నిఘా తిమింగలం హ్వాల్దిమిర్ మృతి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1: 'హ్వాల్దిమిర్' పేరుతో 2019లో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన బెలుగా రకపు తిమింగలం నార్వేలోని ఓస్లోఫ్జోర్డ్‌లో గత నెల 31న మరణించింది. 14 అడుగుల పొడవు, 2700 పౌండ్ల బరువు గల ఈ తిమింగలం మెడకు సెయింట్ పీటర్స్ బర్గ్ అనే లేబుల్ ఉండటంతో దాన్ని రష్యా నిఘా తిమింగలంగా అనుమానించారు. అయితే ఆ తిమింగలం తమదేనని రష్యా ఎలాంటి అధికార ప్రకటన చేయకపోవడంతో అది నిఘా తిమింగలమా లేదా వింత పరిస్థితుల్లో అలా చిక్కుకుపోయిందా అని ఎవరూ తేల్చుకోలేకపోయారు. 'హ్వాల్' అనే నార్వేజియన్ పేరు, 'వ్లాదిమిర్' అనే రష్యన్ పేరు కలిపి ఈ తిమింగలానికి హ్వాల్దిమిర్ అని పేరు పెట్టారు. సాధారణంగా అతి చల్లని ఆర్కిటిక్ జలాల్లో నివసించే బెలుగాలకు భిన్నంగా హ్వాల్దిమిర్ మనుషుల మధ్య సౌకర్యవంతంగా ఉండేది. 'ఇది హృదయ విదారకం. హ్వాల్దిమిర్ నార్వేలోని వేలాది మంది గుండెలను తాకింది' అని దాన్ని సంరక్షించిన మెరైన్ మైండ్ వ్యవస్థాపకుడు సెబాస్టియన్ స్ట్రాండ్ అన్నారు. హ్వాల్దిమిర్‌తో ఎలాంటి సంబంధాలు పెట్టుకోవద్దని గతేడాది నార్వే తన పౌరుల్ని కోరింది.

నమస్తే తెలంగాణ
జిందగీ
హైదరాబాద్ | సోమవారం 2 సెప్టెంబర్ 2024
www.ntnews.com

డాక్టర్ కావాలనుకుని యాక్టర్ అయినవాళ్లు చిత్ర పరిశ్రమలో చాలామంది ఉన్నారు. బుల్లితెర నటి నీరజ వాలిశెట్టి కూడా అంతే! ఈ చదువుల రాణి అనుకోకుండా బుల్లితెర మీదికొచ్చింది. తన సహజ నటనతో ప్రేక్షకుల మెప్పు పొందింది. ఇరవై నాలుగేళ్లుగా ప్రేక్షకులను అలరిస్తున్నది. జీ తెలుగులో ప్రసారమవుతున్న అమ్మాయిగారు సీరియల్‌లో ముత్యాలుగా అభిమానులకు వినోదం పంచుతున్న నీరజ జిందగీతో పంచుకున్న ముచ్చట్లు..

చిన్నతెర

నా పాత్రలన్నీ పాపులరే!

మా సొంతూరు మచిలీపట్నం. అమ్మానాన్నలు శ్యామల, కృష్ణమూర్తి. మేం నలుగురం అక్కాచెల్లెళ్లం. 1982లో హైదరాబాద్ వచ్చేశాం. నాన్న అమెరికాలో ఉండేవారు. అక్కడే వ్యాపారం చేసేవారు. అమ్మ, మేం ఇక్కడ ఉండేవాళ్లం. ఇంట్లో నేనే చిన్నదాన్ని కావడంతో గారాబం ఎక్కువ. బాగా చదివేదాన్ని. అమీర్‌పేట్ విద్యోదయ స్కూల్లో పదో తరగతి, మెహిదీపట్నం సెయింట్ ఆన్స్ కాలేజీలో ఇంటర్, డిగ్రీ చదివాను. చదువులో చురుగ్గా ఉండటంతో నాన్న నన్ను డాక్టర్ చేద్దామనుకున్నారు. కానీ నాకు ఇష్టం ఉండేది కాదు. బాగా చదువుతాను కాబట్టి, మంచి ఉద్యోగంలో సెటిల్ అవుతుందని అమ్మ అనుకునేది. కానీ, నేనేమో పరిశ్రమలోకి వచ్చాను. నటనలో ఎలాంటి శిక్షణ తీసుకోలేదు. అనుకోకుండా అవకాశం రావడంతో ఒప్పుకొన్నా. మోడల్‌గా కెరీర్ ప్రారంభించా. తర్వాత సీరియల్‌లో అవకాశం వచ్చింది. నా మొదటి సీరియల్ యండమూరి వీరేంద్రనాథ్ 'తులసీదళం'. అలా మొదలైన నా కెరీర్ 24 సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉంది.



తనతో చెప్పకుండా సీరియల్లో నటించినందుకు అమ్మ చాలా కోప్పడింది. ఈ ఫీల్డ్ గురించి బయట చాలా అపోహలు ఉన్నాయి. అందుకే అమ్మకు నచ్చలేదు. నటిగా నేను నిలదొక్కుకుంటానని నాన్న నమ్మారు. ఎంతగానో ప్రోత్సహించారు. మూడేళ్ల తర్వాత అమ్మ నా సీరియల్స్‌కు పెద్ద ఫ్యాన్ అయిపోయింది. తెలుగు టీవీ పరిశ్రమ నాకు మంచి జీవితాన్ని ఇచ్చింది. సంఖ్యాపరంగా నేను తక్కువ సీరియల్స్ చేసి ఉండొచ్చు! కానీ, అన్నీ బాగా పాపులర్ అయ్యాయి. కథలను జాగ్రత్తగా ఎంచుకుంటాను. నేను చేసిన ప్రతి పాత్రా వైవిధ్యమైనదే! అందుకే, అన్ని పాత్రలూ నాకు నచ్చేవే!!

చూసి నేర్చుకున్నా..

ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో నటన తెలియదు కాబట్టి నా సీనియర్స్‌ని చూసి నేర్చుకునేదాన్ని. మేకప్, డైలాగ్స్, ఉచ్చారణ కూడా కనిపెడుతూ ఉండేదాన్ని. నేను సహజంగా నటిస్తానని అందరూ అనేవారు. అదే నా కెరీర్‌కి గట్టి పునాదిగా మారింది. నాలుగైదు సినిమాల్లో కూడా చేశాను. కానీ, ఎందుకో అంతగా ఆసక్తి కలగలేదు. సినిమా చాలా పెద్ద ప్రపంచం. అందులో ఇమడటం చాలా కష్టం. సీరియల్ అయితే చాలాకాలం ఒకే టీమ్‌తో పనిచేయొచ్చు. అందరం ఒక కుటుంబంగా ఉంటాం. 12 ఏండ్ల నుంచి జీ తెలుగుతో పనిచేస్తున్నాను. పసుపు కుంకుమ, గుండమ్మ కథ, తూర్పు పడమర.. సీరియల్స్ చేశాను. ప్రస్తుతం 'అమ్మాయిగారు'లో నటిస్తున్నా. హాస్యరస పాత్ర లంటే నాకిష్టం.

అభిమానులే కారణం..

ఇన్నేళ్లుగా కెరీర్ కొనసాగిస్తున్నానంటే... అందుకు ప్రేక్షకులే కారణం. అభిమానుల వల్లే నేను ఇక్కడున్నా. చాలామంది మీ వాయిస్ బాగుంటుంది, సహజంగా నటిస్తారని మెచ్చుకుంటారు. నెగెటివ్ రోల్స్‌లో కూడా నటించాను. అయినా నన్ను అభిమానిస్తూనే ఉన్నారు. నా ఇల్లును మించిన ఫేవరెట్ ప్లేస్ లేదు. ఇల్లే స్వర్గంలా ఫీలవుతా. జంతువులంటే ఇష్టం. నేను పెంచుకునే మూడు కుక్కలంటే చాలా ఇష్టం. నేను కనకపోయినా అవే నా పిల్లలు. చనిపోయేలోపు కుక్కల కోసం ఏదో ఒకటి చేయాలనుకుంటున్నా. ఒకప్పుడు నాన్‌వెజ్ తినేదాన్ని. కానీ అది ఫుడ్ కాదు అని రియలైజ్ అయ్యాక మానేశాను. మూడేళ్లుగా పూర్తి శాకాహారిగా ఉంటున్నాను. వీగన్‌గా కూడా మారేందుకు ప్రయత్నిస్తున్నా. అదంత ఈజీ కాదనుకోండి! శ్రావణ మాసం పూజలు, వ్రతాలు అంటే ఇష్టం. నేను చేయడం కన్నా.. ఎవరైనా పేరంటానికి పిలిస్తే వెళ్లడం ఇష్టం.

నాతోనే నాన్న..

గుండె సంబంధ సమస్యతో రెండేళ్ల కిందట అమ్మ కన్ను మూశారు. ప్రస్తుతం నాన్న నాతోనే ఉంటున్నారు. ఇద్దరు అక్కలు అమెరికాలో ఉన్నారు. ఒకసారి అమెరికా వెళ్లాను. కానీ, ఎందుకో నచ్చలేదు. వాళ్లే వస్తూ ఉంటారు. మా అక్కల పిల్లలకు నేనే పేర్లు పెట్టాను. వాళ్లందరికీ నేనంటే చాలా ఇష్టం. ఈ తరం ఆడవాళ్లకు ప్రత్యేకంగా చెప్పేది ఏంటంటే.. మనుషుల్ని జాగ్రత్తగా అంచనా వేసి నమ్మాలి. ఒకరిమీద ఆధారపడొద్దు. మీకంటూ ఆర్థిక స్వేచ్ఛ కలిగి ఉండటం ముఖ్యం. అదేవిధంగా జంతువుల బాగోగులు చూడకపోయినా ఫర్వాలేదు కానీ, వాటికి హాని చేయకుండా ఉండండి.

.. హరిణి




ప్రాంజలి అవస్థీ

16 ఏళ్ల వయసు పిల్లలెవరూ కెరీర్ గురించి పెద్దగా ఆలోచన చేయరు. స్నేహితులతో సమయం గడపడం, చదువు మీద దృష్టిపెట్టడం, సినిమాలు, షికార్లు... ఇలాగే ఉంటుంది వాళ్ల ప్రపంచం. కానీ ప్రాంజలి అవస్థీ ఆలోచన మాత్రం చాలా భిన్నం. చిన్న వయసులోనే తన అభిరుచుల వేదికగా కెరీర్‌పై దృష్టి సారించింది. 11 సంవత్సరాల వయసులో భారత్ నుంచి ఫ్లోరిడా వెళ్లిందామె. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అంటే ఏమిటన్నది బయట ప్రపంచానికి పెద్దగా తెలియని కాలంలోనే దానిలో నైపుణ్యం సంపాదించింది. 16 సంవత్సరాల వయసులో 2022లో డెల్వ్ డాట్ ఏఐ (Delv.AI) పేరుతో ఏఐ స్టార్టప్‌ను స్థాపించింది. వినూత్నమైన ఆలోచనలు, అంకితభావంతో పనిచేసి తన స్టార్టప్‌ను కేవలం రెండు సంవత్సరాలలోనే రూ.100 కోట్ల టర్నోవర్ కలిగిన కంపెనీల జాబితాలో చేర్చింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో డేటా ఎక్స్‌ట్రాక్షన్‌ను మెరుగుపరచడం, డేటా సిలోస్(వ్యవస్థల మధ్య సమాచార మార్పిడిని అడ్డుకునే వ్యవస్థ)ను తొలగించడం డెల్వ్ డాట్ ఏఐ చేస్తుంది. ఆన్‌లైన్ కంటెంట్‌కు సంబంధించి వివిధ విషయాలు అందించడంలోనూ సహాయపడుతుంది. కేవలం పదిమంది ఉద్యోగులు మాత్రమే ఈ కంపెనీలో పనిచేస్తున్నారు. ఫ్లోరిడా వెళ్లిన అవస్థీ.. కంప్యూటర్ సైన్స్, గణితశాస్త్రం సబ్జెక్టులను రెండేళ్లు అభ్యసించింది. 13 ఏళ్ల వయసులో ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ రీసెర్చ్ ల్యాబ్స్‌లో ఇంటర్న్‌షిప్‌కి అడ్మిషన్ సాధించింది. ఆ ల్యాబ్‌లో పనిచేస్తున్న సమయంలోనే డెల్వ్ డాట్ ఏఐ స్థాపించాలనే ఆలోచన చేసింది. మెషిన్ లెర్నింగ్ ప్రాజెక్ట్‌లో పనిచేసి డేటా గురించి విస్తృతమైన పరిశోధనలు చేసింది. డేటా అనాలసిస్, ఆన్‌లైన్ కంటెంట్, డేటాకు సంబంధించిన పలు సమస్యల పరిష్కారంలో ఏఐ పాత్ర కీలకమని తెలుసుకుంది. ఆ సాధనే ఆమెకు కోట్లు తెచ్చి పెడుతున్నది. చిన్న వయసులో అద్భుతాలు సృష్టించాలని ఆరాటపడే వాళ్లకు అవస్తి మంచి ప్రేరణ అని చెప్పొచ్చు.



కాళ్లూ చేతులూ మెరిసేలా..

శరీర సౌందర్యంలో ముఖంతోపాటు కాళ్లూ, చేతులదీ కీలకపాత్రే. అమ్మాయి అందానికి అదనపు ఆకర్షణగా నిలిచే వీటి మీద చాలామంది సరైన శ్రద్ధ పెట్టరు. దానితోపాటు హార్మోన్ల ప్రభావం, చర్మ సమస్యలు, ఎండలో తిరగడంలాంటి వాటివల్ల ఈ ప్రాంతాల్లో మచ్చలు ఏర్పడుతుంటాయి. ఇవిపోయి... మెరిసే చర్మం సొంతం కావాలంటే కొన్ని చిట్కాలు పాటిస్తే సరి!



ఓట్స్ - పెరుగు

ఒక టీ స్పూన్ ఓట్స్‌ను మిక్సీలో వేసి పొడిగా చేసుకోవాలి. దానిలో పెరుగు కలపాలి. ఈ మిశ్రమాన్ని కాళ్లూ చేతులపై రాసి ఆరనివ్వాలి. తర్వాత చల్లటి నీళ్లతో శుభ్రంగా కడిగేయాలి. ఇలాచేస్తే చర్మంపై ఏర్పడిన మచ్చలు నెమ్మదిగా తగ్గుముఖం పడతాయి.

టమాటా స్క్రబ్..

ఒక టమాటా తీసుకుని మధ్యలో కోయాలి. దానిమీద చక్కెర చల్లి మచ్చలు ఉన్న ప్రదేశంలో స్క్రబ్ చేసుకోవాలి. లేదా టమాటాను మెత్తగా చేసి ఆ ప్రాంతంలో రాసినా ఫలితం ఉంటుంది. క్రమం తప్పకుండా దీన్ని ప్రయత్నిస్తే మచ్చలు మాయమవుతాయి.

శనగపిండి...

రెండు స్పూన్ల శనగపిండిలో కొద్దిగా నీళ్లు కలిపి పేస్టులా చేయాలి. ఈ పిండిని కాళ్లు, చేతులకు రాసి కాసేపు వదిలేయాలి. ఆరిన తర్వాత కొద్దికొద్దిగా నీళ్లు చల్లుతూ స్క్రబ్ చేయాలి. వారానికి కనీసం మూడుసార్లు ఇలా చేస్తే సమస్య తగ్గుముఖం పడుతుంది.

సన్‌స్క్రీన్

చాలామంది సన్‌స్క్రీన్ లోషన్‌ను కేవలం ముఖంపై మాత్రమే రాస్తుంటారు. కాళ్లు, చేతులకు కూడా ఉపయోగించే బాడీ సన్‌స్క్రీన్ లోషన్‌లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. బయటకు వెళ్లడానికి అరగంట ముందు ఇది రాసుకోవడం ద్వారా ఎండ నుంచి చర్మాన్ని కాపాడుకోవచ్చు.

ప్రకృతిలో అమ్మపాల తర్వాత గుడ్డు మాత్రమే...



ప్రకృతిలో అమ్మపాల తర్వాత గుడ్డు మాత్రమే నాణ్యమైన మాంసకృత్తులు అందించే పోషకాహారంగా పేరుమోసింది. నోటి మాటగా చెబుతున్న విషయం కాదిది! వివిధ ప్రొటీన్ల బయోలజికల్ వాల్యూలను పరిగణనలోకి తీసుకుని తేల్చిన సంగతి ఇది. తల్లిపాలతో సరిపోలే పోషకాలు ఇముడ్చుకున్న అండమే... ఈ బ్రహ్మాండంలో గొప్పది అనొచ్చు! అప్పటికప్పుడు పగులగొట్టుకుని తిన్నా.. సత్వర శక్తినిచ్చే పదార్థం ఇది. ఉడికించుకొని తింటే.. పంటికింద మెత్తగా నలుగుతూ రుచిని పంచుతుంది. ఆపై బలాన్ని పెంచుతుంది. ఆమ్లెట్ వేసుకొని లాగిస్తే.. అదనపు రుచి గ్యారెంటీ!
కూరగా చేసుకున్నా, చారులో వేసుకున్నా, బిర్యానీతో వండుకున్నా.. నానావిధ రుచులు చవిచూపుతూ.. ఏదోవిధంగా శరీరానికి ఘనమైన మేలు చేసే వెరీగుడ్డు పదార్థం గుడ్డు.

తల్లిపాలు పిల్లలకు వరం. మొదటి ఏడాది అమ్మ పట్టిన పాలు జీవితకాలం శ్రీరామరక్షగా నిలుస్తాయి. తల్లిపాల ద్వారా శరీరానికి సహజంగా సంప్రాప్తించిన శక్తి, రోగనిరోధక శక్తి కొడిగట్టకుండా చూసుకునే ప్రకృతిసిద్ధ పదార్థం గుడ్డు. అందుకే తల్లిపాలు మానేసిన తర్వాత పిల్లలకు ప్రతిరోజూ ఓ గుడ్డు అందిస్తే చాలు! అమ్మపాలు పట్టించినట్టే!! ఆరునెలల పసిబిడ్డ నుంచి పండుముసలి వరకు అందరూ దర్జాగా గుడ్డు తినొచ్చు. ఏ రూపంలో తింటారన్నది వాళ్ల చాయిస్. గుడ్డును సమతుల ఆహారంగా పరిగణిస్తారు.

> బయోలజికల్ వాల్యూ 70 కన్నా తక్కువగా ఉన్నవాటిని తక్కువ నాణ్యత కలిగిన ప్రొటీన్లుగా చెబుతారు. ఈ వాల్యూ పెరిగే కొద్దీ.. నాణ్యత హెచ్చుతుందన్నమాట. అమృతాన్ని మరిపించే అమ్మపాల బయోలజికల్ వాల్యూ 100గా తేలింది. ఆ తర్వాతి స్థానం దక్కించుకున్నది గుడ్డే! స్వచ్ఛతకు మారుపేరుగా చెప్పే ఆవుపాలు కూడా గుడ్డు తర్వాతే ఉండటం గమనార్హం. గుడ్డు బయోలజికల్ వాల్యూ 93.7 కాగా, ఆవుపాలది 87.4. ఆ తర్వాత కోడిమాంసం, గేదెపాలు, చేపలు ఇలా రకరకాల పదార్థాలు ఆక్రమించాయి.

పేదలకు అందుబాటు ధరలో ఉన్న పోషకాల గని ఇది. ప్రతిరోజూ ఒక ఉడకబెట్టిన గుడ్డు తీసుకుంటే.. శరీరానికి ఆరోగ్య కవచం తొడిగినట్టే.

ఒక కోడిగుడ్డులో 1.5 గ్రాముల పచ్చసొన, 213 మిల్లీగ్రాముల కొలెస్ట్రాల్, 75 క్యాలరీలు ఉంటాయి. పిల్లలకు అందించే ఆహారంలో కోడిగుడ్డు ఉండటం తప్పనిసరి అని నిపుణుల సూచన. ఇందులో ఉండే విటమిన్ ఎ, జియాక్సాంథిన్, ల్యూటిన్ లాంటి యాంటి ఆక్సిడెంట్లు కంటి సంబంధిత సమస్యలు రాకుండా కాపాడతాయి. మన శరీరంలో జీవక్రియలు సాఫీగా సాగాలంటే సరిపడా ప్రొటీన్లు అందాలి. తక్కువ క్యాలరీలు, ఎక్కువ ప్రొటీన్లు, ఖనిజాలు ఉండే గుడ్డు తినడం వల్ల.. జీవక్రియలు సజావుగా సాగుతాయి. అంతేకాదు, ఎముకలు, కండరాలు దృఢంగా తయారు కావడానికి గుడ్డు తోడ్పడుతుంది.


కోడిగుడ్డు తెల్ల సొనలో ప్రొటీన్లు, నియాసిన్, రైబోఫ్లేవిన్, క్లోరిన్, మెగ్నీషియం, పొటాషియం, సల్ఫర్, జింక్ తదితర ఖనిజాలు, విటమిన్లు ఉంటాయి. అలాగే పచ్చసొనలో విటమిన్ ఎ, డి, ఇ అధికంగా ఉంటాయి. వీటితోపాటు ఫోలిక్ యాసిడ్, ఐరన్, కాపర్, సల్ఫర్ కూడా ఉంటాయి. గుడ్డులో లభించే ఫోలేట్ పుట్టుకతో సంక్రమించే ఎన్నో వ్యాధులను నియంత్రించడంలో భేషుగ్గా పనిచేస్తుంది. అంతేకాదు, ప్రతి ఉదయం అల్పాహారంగా ఉడకబెట్టిన గుడ్డు తిన్నవాళ్లు బరువు కూడా తగ్గుతారని పలు అధ్యయనాల్లో తేటతెల్లం అయింది. గుడ్డు తినే మహిళల్లో క్యాన్సర్ రిస్క్ 24 శాతం తక్కువని పలు అధ్యయనాల్లో తేలింది. ఇందుకు కారణం గుడ్డులో సమృద్ధిగా దొరికే కోలిన్ అనే పదార్థం. ఇది గుడ్డులో 20 శాతం వరకు ఉంటుంది. కోలిన్ మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. నాడీవ్యవస్థని బలోపేతం చేస్తుంది. అంతేకాదు కాలేయ జబ్బులను నియంత్రిస్తుంది. ధమనులు దృఢంగా ఉండటానికి తోడ్పడుతుంది. ఇలా సింగిల్ ఎగ్.. మల్టిపుల్ ప్రయోజనాలను చేకూరుస్తుందన్నమాట!

సూర్యరశ్మి ద్వారా విటమిన్ డి అందుతుంది. ఆ తర్వాత చాలా తక్కువ పదార్థాలు విటమిన్ డి కలిగి ఉంటాయి. అందులో గుడ్డు ఒకటి. నాణ్యమైన

> బరువు తగ్గాలని భావించే వారికి గుడ్డు మంచి డైట్. ఎందుకంటే.. గుడ్డులోని ప్రొటీన్లు కడుపు నిండిన భావనను కలగజేస్తాయి. ఫలితంగా డైట్ కంట్రోల్‌లో ఉంటుంది. పప్పులోని ప్రొటీన్ల కన్నా.. గుడ్డులోని మాంసకృత్తులు త్వరగా జీర్ణమవుతాయి. కాబట్టి పిల్లలకు రోజుకో గుడ్డు తప్పకుండా ఇవ్వాలి. వయసు పెరిగే కొద్దీ కండరాలు బలహీనం అవుతాయి. రెగ్యులర్‌గా గుడ్డు తీసుకుంటే దానిని అరికట్టొచ్చు. గుడ్డు ద్వారా అందే ప్రొటీన్లు హార్మోన్ల విడుదలకు, ఎంజైమ్‌ల తయారీలో దోహదకారిగా పనిచేస్తాయి. కాబట్టి వయసుతో సంబంధం లేకుండా అందరూ గుడ్డు తినొచ్చు.


గుడ్డు పచ్చసొనలో 371 యూనిట్ల విటమిన్ డి ఉంటుందని పరిశోధకులు తేల్చారు. ఇది ఎముకల దృఢత్వానికి దోహదం చేస్తుంది. ఇక కోడిగుడ్డులో విటమిన్లతోపాటు మినరల్సూ ఎక్కువే. ఇవి పిల్లల ఎదుగుదలకు ఎంతో దోహదం చేస్తాయి. గర్భిణులు గుడ్డు తీసుకుంటే.. గర్భస్థ శిశువు ఆరోగ్యంగా పెరుగుతుంది. అలాగే ఇందులోని ఆల్బుమిన్‌లో ఉండే ప్రొటీన్లు రక్తప్రసరణ సాఫీగా సాగేలా చేస్తాయి. రక్తం గడ్డకట్టకుండా చూస్తాయి. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. కండరాలు బలంగా మారుతాయి.

చాలామంది గుడ్డుపచ్చసొనలో కొలెస్ట్రాల్ అధికంగా ఉంటుందన్న భావనతో ఉంటారు.



దాన్ని తీసేసి తెల్లసొన మాత్రమే తింటుంటారు. అయితే ఒక గుడ్డులో 180 మిల్లీగ్రాముల కొలెస్ట్రాల్ ఉంటుంది. ఇతర ఆహార పదార్థాల్లో ఇంతకుమించే ఉంటుంది. మన ఆహారం ద్వారా రోజుకు 300 మిల్లీగ్రాముల కొలెస్ట్రాల్ తీసుకోవచ్చు. మన శరీరం రోజుకు 800-1500 గ్రాముల కొలెస్ట్రాల్ తయారుచేసుకుంటుంది. ఈ నేపథ్యంలో గుడ్డు ద్వారా అందే.. కొలెస్ట్రాల్ తక్కువే! ఈ కొవ్వు నేరుగా రక్తంలో కలవకుండా అడ్డుకునే లెసిథిన్ వంటి రసాయనాలు గుడ్డులో ఉంటాయి. కాబట్టి.. గుడ్డుతో కొలెస్ట్రాల్ సమస్య ఉత్పన్నం కాదు. గుడ్డుతో ఇతర ఆహార పదార్థాలు తీసుకున్నప్పుడు వాటిల్లోంచి చక్కెర నెమ్మదిగా విడుదల అవుతుంది. ఇది మధుమేహులకూ మేలు చేస్తుంది. ఇక గుడ్డులో అన్నిరకాల అమైనో ఆమ్లాలు ఉంటాయి. శారీరక శ్రమ అధికం అయినప్పుడు సత్వరం శక్తి పుంజుకోవడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి.

మొత్తంగా అమ్మపాలకు ఎలాగైతే వంక పెట్టలేమో.. గుడ్డులోని పోషకాల గురించి కూడా ఏ శంకా అవసరం లేదు. కల్తీకి ఆస్కారమే లేని గుడ్లు ఆరోగ్య ప్రదాతలు. సమతుల ఆహారంగా పేరున్న గుడ్డు అందరిదీ! తక్కువ ధరలో ఎక్కువ పోషకాలు అందించే ఏకైక పదార్థం. అందుకే, సండే హో యా మండే రోజ్ ఖావో అండే.. ఏమంటారు!!



పౌష్టికాహార ప్రదాత



డా॥ బి.వి.రావు



సదా స్మరణీయుడు డా॥ బి.వి.రావు

మనిషికి సంకల్పం ఉంటే సరిపోదు. దానిని నెరవేర్చుకునే శక్తియుక్తులు ఉండాలి. శక్తి పుట్టాలంటే అంకితభావం అవసరం. యుక్తి పారాలంటే దూరదృష్టితోనే సాధ్యం. ఇవన్నీ సమపాళ్లలో ఉన్న వ్యక్తి ఉత్తమ నాయకుడు అనిపించుకుంటాడు. అలాంటి నాయకుడే భారత పౌల్ట్రీ రంగ పితామహుడు డాక్టర్ బి.వి.రావు. పౌల్ట్రీ రంగం కొత్త రెక్కలు తొడగడంలో ఆయన అహరహం శ్రమించారు. నేటి బాలలు రేపటి పౌరులుగా ఎదగాలంటే.. చదువు, క్రమశిక్షణ మాత్రమే సరిపోవు. పోషకాహారం కూడా అవసరమే! గుడ్ల ఉత్పత్తి విస్తృతంగా పెరిగితేనే.. ఆ పోషకాల గనులు చిన్నారులను చేరుతాయని భావించారు. అందుకే, పౌల్ట్రీ రంగంలో పెనుమార్పులకు శ్రీకారం చుట్టారు.

ఒకప్పుడు ఇండ్ల పెరటికే పరిమితమైన కోళ్ల పెంపకం.. ఆయన చలువతో వ్యాపార సామ్రాజ్యంగా ఎదిగింది. గుడ్ల ప్రాముఖ్యాన్ని చెబుతూ, భవిష్యత్ అవసరాలు వివరిస్తూ.. ఎందరో రైతులను పౌల్ట్రీ రంగంలోకి ఆహ్వానించారు. కోళ్ల పరిశ్రమను ఆయన వ్యాపారంగా చూడలేదు.. ప్రజలకు ఆరోగ్యాన్ని ప్రసాదించే వనరుగా భావించారు. తక్కువ ధరలో ఎక్కువ పోషకాలు అందించే గుడ్లు అందరికీ చేరాలనే ఉద్దేశంతో 'సండే హో యా మండే రోజ్ ఖావో అండే' అని ఆకర్షణీయమైన పిలుపునిచ్చి, ఆహారంగా గుడ్డు ప్రాధాన్యం ఎంతటిదో అందరికీ తెలియజేశారు.

సవాళ్లను ఎదుర్కోవడం బి.వి.రావుకు వెన్నతో పెట్టిన విద్య. పౌల్ట్రీ రైతుల సాధికారత కోసం ఎన్నో సవాళ్లను చిరునవ్వుతో ఎదుర్కొన్నారు. 'మై ఎగ్.. మై ప్రైస్.. మై లైఫ్' నినాదంతో వాటికి శాశ్వతమైన పరిష్కార మార్గాలను సూచించారు. ఆయన దూరదృష్టి కారణంగానే.. నేడు గుడ్ల ఉత్పత్తిలో భారతదేశం రెండవస్థానంలో ఉంది. ఈ రంగంలో సాంకేతికతను, ఆధునిక పద్ధతులను ప్రవేశపెట్టడంలో ఆయన ఎప్పుడూ ముందుండేవారు. ఆయన చేపట్టిన ప్రతి మార్పూ పరిశ్రమను ఆర్థికంగా నిలబెట్టిందే! పని విషయంలో ఆయన చూపిన క్రమశిక్షణ భావితరాలకు ప్రేరణగా నిలుస్తుంది. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం ఆయనది. ఏ కార్యక్రమం చేపట్టినా సేవే లక్ష్యంగా దానిని కొనసాగించేవారు. పౌల్ట్రీ రంగంలోని రైతులు, కార్మికుల సంక్షేమం కోసం అవిరళ కృషిచేసిన బి.వి.రావు గారిని భారత ప్రభుత్వం పద్మశ్రీ బిరుదుతో గౌరవించింది. వారు సదా స్మరణీయులు. ఆయన సూచించిన మార్గదర్శక సూత్రాలు, ఆవిష్కరణలు నేటికీ, ఏనాటికీ అందరికీ ప్రేరణగా నిలుస్తాయి. కోళ్ల పరిశ్రమను పెంచి, పోషించి, గుడ్ల ఉత్పత్తిని పెంచి, పౌల్ట్రీ రంగంలో భారతదేశాన్ని అగ్రగామిగా చూడాలన్న వారి కలను సాకారం చేయటానికి పునరంకితమవుతున్నామని నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్ పర్సన్ అనురాధా దేశాయ్ తెలిపారు.